www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

హరిత హోటళ్లు.. ఇక బార్ అండ్ రెస్టారెంట్స్



14

ఆధ్యాత్మిక ప్రదేశాల్లో ఉన్న వాటికి మినహాయింపు

నష్టాల నుంచి బయటపడటం, ఆదాయం సమకూర్చుకోవడమే లక్ష్యం

కొత్త పర్యాటక పాలసీలో భాగంగా టూరిజం శాఖ ప్రతిపాదన

ఇప్పటికే పలు పర్యాటక శాఖ హోటళ్లలో బార్ అండ్ రెస్టారెంట్ సేవలు

ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహణ.. వాటిపై అధికార్ల అధ్యయనం

లాభదాయకంగా ఉండటంతో మిగతా వాటినీ మార్చాలని నిర్ణయం

సోమవారం | 7-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 8

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం; తిథి: దశమి రా.8.01 తదుపరి ఏకాదశి; నక్షత్రం: పుష్యమి ఉ.6.25 తదుపరి ఆశ్లేష; వర్జ్యం:రా.8.01-రా.9.43; దుర్ముహూర్తం: ప.12.42-మ.1.31, మ.3.09-మ.3.58; అమృతఘడియలు: ఉ.6.13-ఉ.7.55; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.26

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కాలిఫోర్నియాలోని హంటింగ్టన్ బీచ్‌లో ట్రంప్, మస్క్‌లకు వ్యతిరేకంగా అమెరికన్ల నిరసన

ట్రంప్ పిచ్చోడు!

నిప్పులు చెరిగిన అమెరికన్లు!

ట్రంప్, మస్క్‌లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా భారీ నిరసనలు

రోడ్డెక్కిన 5 లక్షల మంది ప్రజలు.. 'హ్యాండ్సాఫ్' పేరిట వరదలా వీధుల్లోకి

ట్రంప్ పగ్గాలు చేపట్టిన స్వల్ప కాలంలోనే నిరసన ర్యాలీలు, ధర్నాలు

నిరసనలతో ఒరిగేదేం లేదు.. వైట్‌హౌస్ స్పష్టీకరణ

ట్రంప్ చర్యలతో ప్రపంచీకరణకు ముగింపు.. బ్రిటన్ ప్రభుత్వ అంచనా

వాషింగ్టన్, ఏప్రిల్ 6: అమెరికన్లు కదం తొక్కారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వరదను తలపించేలా నడిరోడ్లపైకి వచ్చి.. హ్యాండ్సాఫ్(జోక్యం వద్దు) పేరుతో భారీ నిరసనలు చేపట్టారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను 'పిచ్చోడు' అంటూ గేలిచేశారు. ట్రంప్ సహా ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ప్రస్తుతం అమెరికా అధినేత ప్రతీకార సుంకాలకు దిగడంతో దేశవ్యాప్తంగా అన్ని వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి. మరోవైపు.. వలస విధానాలు, ప్రభుత్వ ఉద్యోగుల కుదింపు, ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం కావడం ఇలా.. అనేక పరిణామాలను నిరసిస్తూ.. లక్షలాది మంది శనివారం రోడ్డెక్కారు. వాస్తవానికి ట్రంప్ ఈ ఏడాది జనవరిలో అధికార పగ్గాలు

మిగతా 2వ పేజీలో...

యూరప్‌లోనూ నిరసనల హోరు



లాస్‌ఏంజెల్స్‌లో పేలాదిగా పోటెత్తిన నిరసనకారులు

పేదవారి కళ్లలో.. ఆనందం చూశా

పేదలందరికీ ఆహార భద్రత కల్పించేందుకే రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం

ఈ పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

భద్రాద్రి జిల్లా సారపాకలోని గిరిజన లబ్ధిదారు ఇంట్లో సన్నబియ్యంతో భోజనం

ఆ కుటుంబానికి కొత్తవస్త్రాల అందజేత

సీఎంతో పాటు భట్టి , తుమ్మల, పొంగులేటి



ప్రభుత్వం తరఫున భద్రాద్రి సీతారాముల కల్యాణానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకొస్తున్న సీఎం రేవంత్ దంపతులు. చిత్రంలో తుమ్మల

బూర్గంపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ పథకంతో పేదవారి కళ్లలో ఆనందం చూశానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పేదవాడి ఇంట్లో సన్నబియ్యంతో అన్నం రుచిని స్వయంగా చూడడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించేందుకే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, 80 శాతానికి పైగా బడుగు, బలహీన, దళిత, గిరిజన, మైనారిటీ నిరుపేద ప్రజలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ముత్యాలమ్మపేటకు చెందిన ఆదివాసీ కుటుంబం, సన్నబియ్యం లబ్ధిదారు బూరం శ్రీనివాసరావు ఇంట్లో సీఎం రేవంత్‌రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి భోజనం చేశారు. తొలుత తమ ఇంటికి చేరుకున్న ముఖ్యమంత్రికి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం రేషన్‌షాపు నుంచి తీసుకువచ్చిన సన్నబియ్యంతో వండిన అన్నంతోపాటు పాయసం, పులిహోర, తోటకూర పప్పు, గోంగూర చట్నీ, బెల్లం పానకం, ఇతర ఆహార పదార్థాలు వడ్డించారు. కాగా, భోజనం చేస్తున్న సమయంలో సీఎం ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ వారి కుటుంబ పరిస్థితులు, జీవన

మిగతా 13వ పేజీలో...



రామేశ్వరంలో పాంబన్ బ్రిడ్జిని పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

అకారణంగా ఏడుస్తుంటారు!

కొందరికి ఇది అలవాటుగా మారింది.. మనమేం చేయలేం.. స్టాలిన్‌పై మోదీ విమర్శ

తమ హయాంలోనే తమిళనాడుకు ఎక్కువ కేటాయింపులని వెల్లడి

తనకు లేఖలు రాస్తున్న తమిళ నేతలు తమిళంలో సంతకం సైతం చేయడం లేదని ఎద్దేవా

పాంబన్ వంతెనను ప్రారంభించిన ప్రధాని.. తమిళనాడు సీఎం గైర్హాజరు

సాంకేతికత-సంప్రదాయాల సమ్మేళనం పాంబన్

వందేళ్ల క్రితం గుజరాతీ బిడ్డ నిర్మించాడు

ఇప్పుడు మళ్లీ గుజరాత్ బిడ్డకు అవకాశం: మోదీ

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు అభివృద్ధికి కేంద్రం ఎంతో చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. అయినా అకారణంగా ఏడవడం కొందరికి అలవాటుగా మారిందని విమర్శించారు. 'వారు ఏడుస్తూనే ఉంటారు. మనమేమీ చేయలేం' అని తమిళనాడు సీఎం స్టాలిన్ అండ్‌కోపై ధ్వజమెత్తారు. తనకు ఎంతో మంది తమిళనాడు నేతలు లేఖలు రాస్తుంటారని.. ఒక్కరు కూడా తమిళంలో సంతకం చేయడం లేదని ఆక్షేపించారు. శ్రీలంక పర్యటన

మిగతా 2వ పేజీలో...

రమణీయం.. రాములోరి కల్యాణం

13

భద్రాచలంలో వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం దంపతులు

నేడు శ్రీరామ మహాపట్టాభిషేకం

వస్త్రాలు సమర్పించనున్న గవర్నర్



అయోధ్య రాముడికి 'సూర్య తిలకం'

2

రామ మందిరంలో ఆవిష్కృతమైన సుందర దృశ్యం

రహదారులకు భూమి ఇవ్వండి

స్థల సేకరణలో చొరవ తీసుకోండి

సీఎం రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి లేఖ

తెలంగాణలో బీజేపీదే అధికారం

పార్టీ ఆవిర్భావ వేడుకల్లో ఉద్ఘాటన



బడంగ్‌పేట్‌లో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

హైదరాబాద్/న్యూఢిల్లీ/సరూర్‌నగర్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో నిర్మించనున్న, నిర్మిస్తున్న జాతీయ రహదారులకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కోరారు. భూ సేకరణ ప్రక్రియపై వ్యక్తిగతంగా చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. "రాష్ట్రంలో 2,500 కి.మీ. పొడవైన జాతీయ రహదారుల ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. అందులో రీజినల్ రింగ్ రోడ్డు కాకుండా, 12,619 కోట్ల అంచనా వ్యయంతో 691 కి.మీ. పొడవున నిర్మించనున్న, నిర్మిస్తున్న 16 జాతీయ రహదారుల ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. వీటి నిర్మాణానికి 1,550 హెక్టార్ల భూమి అవసరం ఉంది. ఈ స్థల సేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు.. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ, జాతీయ రహదారుల సంస్థ అధికారులు

మిగతా 12వ పేజీలో...



సీపీఎం కొత్త సారథి ఎంఏ బేబీ

మదురైలో జరిగిన పార్టీ మహాసభలో జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక

తొలిసారిగా మైనారిటీ నేతకు పగ్గాలు

సంఘను ఎదుర్కోవడమే లక్ష్యమన్న బేబీ

పొలిట్ బ్యూరోలో బీవీ రాఘవులు, అరుణ్‌కుమార్‌లకు చోటు

2

ప్రకాశ్ కరత్, బృందా కరత్‌కు ఉద్వాసన

సీసీలో మరో 9 మంది తెలుగువారు

దాచాలంటే దాగునులే

వయసు కనపడనివ్వకుండా చేసే మార్గాలెన్నో!

యాంటీ ఏజింగ్ క్రీముల నుంచి.. లేజర్, కణజాల చికిత్సల వరకూ అందుబాటులో..

3 పదుల వయసు దాటిన మహిళల్లో చాలా మంది చూపు ఆయా చికిత్సల వైపు!

మగవారిలో ఎక్కువగా హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, బొటాక్స్ చికిత్సలు!

రూ.వేల కోట్ల వ్యాపారంగా యాంటీ ఏజింగ్ రంగం

అర్హత లేనివారితో ఈ చికిత్సలు చేయించుకుంటే కష్టాలు కోరితెచ్చుకున్నట్టే.. ప్లాస్టిక్ సర్జన్ల హెచ్చరిక

ఆమె ఓ పేజ్ 3 సెలబ్రిటీ. ఇటీవలే మనవరాలికి ఓణీల ఫంక్షన్ చేసింది. అప్పటిదాకా చాలా మందికి ఆమె వయసు హాఫ్ సెంచరీ దాటిందని తెలియదంటే ఆశ్చర్యమే! ఎందుకంటే ఆమె ముఖంలో చూద్దామన్నా వార్ధక్యపు ఛాయలు కనపడవు. అలా కనపడకుండా ఉండడానికి ఆమె ఏం మాయ చేస్తోంది?

(ఆంధ్రజ్యోతి-హైదరాబాద్ సిటీ)

మనిషి ఎన్ని సాధించినా తప్పించుకోలేనివి జర (ముసలితనం), మరణం.. అని చాలా మంది ఆధ్యాత్మికవేత్తలు చెబుతుంటారు! రోగం, జర, మరణం ప్రతి ప్రాణికీ తప్పవని తెలుసుకున్నాకే రాజకుమారుడైన సిద్ధార్థుడు తపస్సు చేసి బుద్ధుడయ్యాడు!! కానీ అదంతా గతం. మృత్యువు సంగతి పక్కన పెడితే.. ముసలితనాన్ని కనీసం కొన్నాళ్లపాటయినా జయించి, యవ్వనంగా కనిపించేలా చేసే పరిజ్ఞానాలు

మిగతా 14వ పేజీలో...





జీఎస్‌డీపీ వృద్ధి రేటులో.. తెలంగాణకు 13వ స్థానం

2024-25లో స్థిర ధరల వద్ద 6.79 శాతంగా నమోదు

ఆంధ్రప్రదేశ్‌కు రెండవ స్థానం

ఆహార కల్తీలో దక్షిణ భారతంలో తెలంగాణకు రెండో స్థానం

58%తో దేశంలోనే యూపీ టాప్

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధి రేటు పరంగా తెలంగాణ 13వ స్థానంలో నిలిచింది. అలాగే తలసరి ఆదాయం పెరుగుదలలో 11వ స్థానంలో ఉంది. ఈమేరకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జీఎస్‌డీపీ, తలసరి ఆదాయ వృద్ధి రేట్ల వివరాలను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల

మిగతా 13వ పేజీలో...

ఇంటికి పైసలు రెడీ

ఇందిరమ్మ ఇళ్లకు రూ.3 వేల కోట్లు

హడ్కో నుంచి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ రుణం

బేస్‌మెంట్ పూర్తి చేసిన వారికి త్వరలో ఆర్థిక సాయం

మొదటి దశ కింద రూ.లక్ష చొప్పున అందజేత

బేస్‌మెంట్ దాకా కూడా నిర్మించుకునే స్థోమత లేని వారికి ఎస్‌హెచ్‌జీల రుణాలు ఇప్పించే ఏర్పాట్లు



హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ముందడుగు పడింది. తొలివిడతలో ఇళ్లు మంజూరై బేస్‌మెంట్ వరకు నిర్మించుకున్న లబ్ధిదారులకు అందించే మొదటి దశ ఆర్థిక సాయానికి అవసరమైన నిధులను ప్రభుత్వం సిద్ధం చేసింది. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఇందుకోసం హడ్కో నుంచి రూ.3 వేల కోట్ల రుణం తీసుకుంది. ప్రస్తుతానికి ఆ నిధులు హడ్కో దగ్గరే

మిగతా 12వ పేజీలో...



3

కృష్ణా ట్రైబ్యునల్ విచారణకు నేనొస్తా

తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు కృతనిశ్చయంతో ఉన్నాం

న్యాయ బృందంతో సమీక్షలో మంత్రి ఉత్తమ్



2

ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ దృష్టి

జపాన్, యూకే, ఇటలీ సంయుక్త ప్రాజెక్టులో చేరేందుకు ఆసక్తి

భారత్ నుంచి రష్యాకు రహస్యాలు వెళ్తాయని జపాన్ అనుమానం

సచివాలయంలో ఏఐసీసీ ఇన్‌చార్జ్ సమీక్షనా?

12

మంత్రివర్గ విస్తరణలో ఏఐసీసీదే నిర్ణయమా

తెలంగాణలో పాలనను భ్రష్టు పట్టించారు

ఎంఐఎంకు కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్



సన్నబియ్యం కేంద్రమే ఇస్తే.. దేశమంతా ఎందుకివ్వట్లేదు?

కేంద్ర మంత్రినన్న సంగతి మరిచి దిగజారి మాట్లాడొద్దు

13

బీజేపీ అధ్యక్ష పదవి దక్కడం లేదని ఆగమాగం

బండిపై పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ విమర్శలు



అయోధ్య రాముడికి 'సూర్య తిలకం'

» రామ మందిరంలో ఆవిష్కృతమైన సుందర దృశ్యం



అయోధ్య, ఏప్రిల్ 6: శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం అయోధ్యలోని రామమందిరంలో మనోహర దృశ్యం భక్తులకు కనువిందు చేసింది. బాల రాముడి నుదుటిపై సూర్య తిలకం ఆవిష్కృతమయింది. సరిగ్గా మధ్యాహ్నం 12గంటలకు సూర్య కిరణాలు రామ విగ్రహం నుదిటిని తాకాయని, 4నిమిషాల పాటు ఆ దృశ్యం కొనసాగిందని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలిపింది. సూర్యకాంతితో రాముడికి మహా మస్తకాభిషేకం జరిగిందని తెలిపింది. ఈ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనియాలతో చేసిన ప్రసాదాన్ని, ఫలాలతో చేసిన లడ్డూలను స్వామికి నివేదించారు.

రహస్యంగా జస్టిస్ యశ్వంత్ వర్మ ప్రమాణం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: ఇంట్లో నోట్లకట్టలు బయటపడిన వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొన్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ.. శనివారం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణం చేశారు. పెద్దగా అతిథులెవరూ లేకుండా ఆయన చాంబర్‌లోనే ఈ కార్యక్రమం రహస్యంగా జరగటం గమనార్హం. దీనిని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. జస్టిస్ వర్మను చేర్చుకోవద్దని తాము హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞాపనపత్రం ఇచ్చినప్పుడు.. తగిన చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారని అసోసియేషన్ కార్యదర్శి విక్రాంత్ పాండే తెలిపారు. అయినప్పటికీ, తమ సంఘంతో పాటు పలువురు జడ్జిలకు కూడా సమాచారం ఇవ్వకుండా సదరు 'ప్రమాణం' జరిపారన్నారు. రహస్య ప్రమాణం అనేది రాజ్యాంగ విరుద్ధమని, వర్మకు విధులు అప్పగించవద్దని డిమాండ్ చేశారు.

లండన్ డాక్టర్‌నన్నాడు..ఏడుగురి ప్రాణాలు తీశాడు

భోపాల్, ఏప్రిల్ 6: లండన్ నుంచి వచ్చిన ప్రముఖ వైద్యుడిని జాన్ కెమ్‌ను తానేనంటూ.. మధ్యప్రదేశ్‌లో ఓ వ్యక్తి 15 మంది రోగులకు శస్త్రచికిత్సలు చేసి ఏడుగురి ప్రాణాలను హరించాడు. మధ్యప్రదేశ్‌లోని దామోలో ఓ మిషనరీ ద్వారా నడుస్తున్న ఆసుపత్రిలో నరేంద్ర విక్రమాదిత్య యాదవ్ అనే వ్యక్తి నెరిపిన ఈ వ్యవహారానికి సంబంధించి జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ)కు ఫిర్యాదు రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. నరేంద్ర లండన్‌లో ప్రముఖ కార్డియాలజిస్టు నిపుణుడు జాన్ కెమ్‌గా అవతారమెత్తి, జనవరి నుంచి ఫిబ్రవరి మధ్య 15 మందికి గుండె శస్త్రచికిత్సలు నిర్వహించాడని దీపక్ తివారీ అనే వ్యక్తి ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు చేశాడు. వీరిలో ఏడుగురు మృతి చెందారని, ఈ వ్యవహారానికి సంబంధించి ఆసుపత్రికి తెలిసినప్పటికీ పోలీసులకు ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నాడు.

ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ కన్ను!

» జపాన్, యూకే, ఇటలీతో కలిసి తయారీకి ఆసక్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: అత్యాధునిక ఆరో తరం ఫైటర్ జెట్‌ల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), జపాన్, ఇటలీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంబాట్ ఎయిర్ ప్రోగ్రామ్ (జీసీఏపీ) ప్రాజెక్టులో చేరేందుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. కానీ, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బలమైన బంధం నేపథ్యంలో జీసీఏపీలో భారత్‌ను చేర్చుకునే అంశంలో జపాన్ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. జపాన్ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడ్డాయి. ఆరో తరం ఫైటర్ జెట్‌లను కలిసి అభివృద్ధి చేసేందుకు యూకే, జపాన్, ఇటలీ.. 2022 డిసెంబరులో జీసీఏపీ ప్రాజెక్టును చేపట్టాయి. 2035 నాటికి అత్యాధునిక ఫైటర్ జెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం. అడ్వాన్స్‌డ్ స్టెల్త్(రాడార్లకు చిక్కకుండా ప్రయాణించే సామర్థ్యం), అడ్వాన్స్‌డ్ వార్‌ఫేర్ వ్యవస్థ వంటి సామర్థ్యాలతోపాటు ఏఐ అనుసంధానంతో పని చేసే అత్యాధునిక ఆరో తరం ఫైటర్‌జెట్‌లను భవిష్యత్తు అవసరాల కోసం జపాన్, యూకే, ఇటలీ అభివృద్ధి చేస్తున్నాయి. జపాన్ తమ మిత్సుబుషి ఎఫ్-2ఫ్లీట్, యూకే తమ యూరో ఫైటర్ టైఫూన్‌ల స్థానంలో ఈ ఫైటర్ జెట్లను ప్రవేశపెట్టాలని అనుకుంటున్నాయి.

నిరాహార దీక్ష విరమించిన రైతు నేత దల్లేవాల్



చండీగఢ్, ఏప్రిల్ 6: రైతు డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షను పంజాబ్ రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆదివారం విరమించారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి పలు డిమాండ్ల సాధన కోసం గతేడాది నవంబరు 26న ఆయన ఈ నిరాహార దీక్ష చేపట్టారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు శనివారం జగ్జీత్‌ను కలిసి దీక్ష విరమించాల్సింగా కోరగా, మర్నాడే ఆయన దీక్ష విరమించారు. ఆదివారం పంజాబ్ ఫతేహ్‌గఢ్ సాహిబ్ జిల్లాలో నిర్వహించిన 'కిసాన్ మహాపంచాయత్'లో దల్లేవాల్ దీక్ష విరమిస్తున్నట్లు ప్రకటించారు. కాగా, మే 4న రైతులతో చర్చలు జరుగుతాయని దల్లేవాల్‌ను కలిసిన అనంతరం శివరాజ్ చౌహాన్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

తిరుమలేశుడి సేవలో సీజేఐ జస్టిస్ ఖన్నా



తిరుమల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రధాన న్యాయమూర్తి హోదాలో తొలిసారిగా శనివారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన ఆదివారం ఉదయం సంప్రదాయ వస్త్రధారణతో కుటుంబ సభ్యులతో కలిసి వైకుంఠం-1 కాంప్లెక్స్ క్యూలైన్ ద్వారా మహాద్వారం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో శ్యామలరావు, అర్చక బృందం మేళతాళాలతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలోకి వెళ్లిన జస్టిస్ ధ్వజస్తంభాన్ని తాకి అనంతరం గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీజేఐకి అర్చకులు శ్రీవారి శేష వస్త్రాన్ని మెడలో ధరింపజేశారు.

రొయ్యలపై సుంకాన్ని మినహాయించాలి

» 27% టారిఫ్‌పై అమెరికాతో కేంద్రం చర్చించాలి: చంద్రబాబు



అమరావతి, బాపట్ల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): భారత్ నుంచి వెళ్లే సముద్ర ఆహార ఉత్పత్తులపై 27% దిగుమతి సుంకం విధించిన అమెరికా ప్రభుత్వంతో వెంటనే చర్చలు జరపాలని ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రప్రభుత్వానికి సూచించారు. సుంకాల జాబితా నుంచి రొయ్యల ఉత్పత్తులను మినహాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌కు ఆదివారం లేఖ రాశారు. ఏపీ జీడీపీలో మత్స్యరంగం కీలక భూమిక పోషిస్తోందని, అమెరికా సుంకాల కారణంగా ఆక్వా పరిశ్రమ నష్టపోతోందని తెలిపారు. 'భారత్ నుంచి వెళ్లే సముద్ర ఆహార ఎగుమతులపై అమెరికా ప్రభుత్వం 27% దిగుమతి సుంకం విధించింది. ఈనెల 5 నుంచే ఇది అమల్లోకి వచ్చింది. 2023-24లో మన దేశం నుంచి అమెరికాకు 2.55 బిలియన్ డాలర్ల విలువైన సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. వీటిలో రొయ్యలే 92% వాటాను కలిగి ఉన్నాయి' అని లేఖలో పేర్కొన్నారు.



పాంబన్ కొత్త వంతెన మీద నుంచి వెళ్తున్న రైలు



బ్రిడ్జిని నిలువుగా పైకి లేపిన తర్వాత దాని కింద నుంచి వెళ్తున్న ఓడ

అకారణంగా ఏడుస్తుంటారు!

(మొదటి పేజీ తరువాయి)

ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం వాయుసేనకు చెందిన ప్రత్యేక హెలికాప్టర్‌లో నేరుగా రామనాథపురం జిల్లా మండపం వచ్చిన ప్రధాని.. పాంబన్ సముద్ర వంతెనను లాంఛనంగా ప్రారంభించారు. వంతెన పై నుంచి రైలుకు, కింది నుంచి నౌకా రవాణాకు కూడా పచ్చజెండా ఊపారు. అంతేగాక రాష్ట్రంలో రూ.8,300 కోట్ల విలువైన వివిధ రైలు, రోడ్డు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ప్రధాని ప్రసంగించారు. తమిళనాడుకు రావలసిన నిధులను కేంద్రం నిలిపివేసిందన్న సీఎం స్టాలిన్ ఆరోపణలను మోదీ ఈ సందర్భంగా ఖండించారు. గతంతో పోలిస్తే గడిచిన పదేళ్లలో తమిళనాడుకు 3 రెట్లు అధికంగా నిధులిచ్చామన్నారు. 'గత పదేళ్లలో తమిళనాడుకు రైల్వే బడ్జెట్‌ను 7రెట్లు పెంచాం. రామేశ్వరం సహా రాష్ట్రంలో 77 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నాం. పీఎం ఆవాస్ యోజన కింద తమిళనాడులో 12 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించాం. ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఈ రాష్ట్రంలో కోటికిపైగా చికిత్సలు జరిగాయి' అని తెలిపారు. హిందీ భాషను కేంద్రం తమపై రుద్దాలని చూస్తోందని ఆరోపిస్తున్న స్టాలిన్‌పై ప్రధాని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. 'చాలా మంది తమిళనాడు నాయకులు నాకు లేఖలు రాస్తుంటారు. కానీ ఎవరూ తమిళంలో సంతకం చేయరు. నిజంగా వారికి తమిళ భాష అంటే అంత అభిమానముంటే మొదట తమిళంలో సంతకం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని వ్యాఖ్యానించారు. డాక్టర్లు కావాలని కలలు కంటున్న పేద నేపథ్యం కలిగిన విద్యార్థులకు మేలు చేసేలా వైద్య విద్య కోర్సులను మాతృభాష తమిళంలో బోధించాలని స్టాలిన్ ప్రభుత్వాన్ని ఆయన కోరారు. తమిళ భాష, సంస్కృతిని ప్రపంచం నలుమూలలకూ చేర్చేందుకు కేంద్రం నిరంతరం కృషిచేస్తోందన్నారు. శ్రీరాముడి జీవితం, సుపరిపాలనా స్ఫూర్తి.. జాతి నిర్మాణానికి ముఖ్యమైన పునాదిగా పని చేస్తాయని చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా పవిత్ర భూమి రామేశ్వరం నుంచి దేశ పౌరులందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ప్రకటించారు.



రామనాథస్వామి ఆలయంలో మోదీ పూజలు

పాంబన్‌తో ఎంతో మేలు

'భారతరత్న' డాక్టర్ కలాం జన్మించిన భూమి రామేశ్వరమని ప్రధాని తెలిపారు. ఆయన జీవితం సైన్స్-ఆధ్యాత్మికత సమ్మిళితమని.. కొత్త పాంబన్ వంతెన కూడా సాంకేతిక-సంప్రదాయాల సమ్మేళనంగా అభివర్ణించారు. వేల సంవత్సరాల పురాతనమైన ఈ పట్టణం.. ఇప్పుడు 21వ శతాబ్దపు ఇంజనీరింగ్ అద్భుతంతో.. ప్రధాన భూభాగానికి అనుసంధానమైందన్నారు. పాంబన్ సహా దేశంలో నాలుగు దిక్కులా నిర్మించిన వంతెనలను మోదీ ప్రస్తావించారు. ఉత్తరాన జమ్మూకశ్మీర్‌లోని చీనాబ్ వంతెన ప్రపంచంలోనే ఎత్తయిన రైలు వంతెనల్లో ఒకటని.. పశ్చిమాన ముంబైలో ఇప్పుడు దేశంలోనే అతి పొడవైన సముద్రపు వంతెన అటల్ సేతు ఉందని.. తూర్పున అసోంలోని బోగీబీల్ వంతెన పురోగతికి నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. మత్స్యకారుల భద్రతకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందని.. గత పదేళ్లలో శ్రీలంక చెర నుంచి 3,700 మందికి పైగా మత్స్యకారులను స్వదేశానికి తీసుకొచ్చామని చెప్పారు. ఇదిలా ఉండగా, శ్రీలంకలో మూడ్రోజుల పర్యటనలో చివరి రోజు ఆదివారం ప్రధాని మోదీ చారిత్రక, ఆధ్యాత్మిక నగరం అనూరాధపురకు వెళ్లారు. అక్కడ రూ.780కోట్ల భారత్ సాయంతో పునర్నిర్మించిన మహో-ఒమన్‌థాయ్ రైల్వే లైనును ప్రారంభించారు. తర్వాత జయశ్రీ మహాబోధి ఆలయాన్ని సందర్శించారు. క్రీ.పూ.3వ శతాబ్దంలో అశోక చక్రవర్తి కుమార్తె సంఘమిత్త మహా థెరి నెలకొల్పిన మహాబోధి వృక్షం వద్ద ప్రార్థనలు చేశారు. మరోవైపు, మోదీ కోరిక మేరకు ఆదివారం 11 మంది తమిళ జాలర్లను శ్రీలంక విడుదల చేసింది.

అప్పుడూ.. ఇప్పుడూ గుజరాతీ బిడ్డే

పాంబన్‌లో వందేళ్ల క్రితం గుజరాత్‌కు చెందిన వ్యక్తి రైల్వే వంతెన నిర్మించారని, మళ్లీ శతాబ్దం తర్వాత ఇదే స్థలంలో కొత్త వంతెన నిర్మించే అదృష్టం గుజరాతీ బిడ్డ(మోదీ)కే వచ్చిందని మోదీ సభలో వ్యాఖ్యానించారు. పాంబన్ కొత్త రైలు వంతెనను ప్రారంభించి, జాతికి అంకితం చేసిన అనంతరం ప్రధాని.. తమిళ సంప్రదాయ దుస్తులైన ధోవతి, పట్టు చొక్కా, పట్టు అంగవస్త్రం ధరించి రామేశ్వరంలోని పర్వతవర్ధినీ సమేత రామనాథస్వామి ఆలయాన్ని సందర్శించారు. మధ్యాహ్నం 12.45 గంటలకు ఆలయానికి వెళ్లిన ఆయన మూలవిరాట్ ముంగిట నేలపై ఆసీనులై స్వామివారికి మొక్కారు. ఇదిలా ఉండగా, హెలికాప్టర్లో శ్రీలంక నుండి రామనాథపురం మండపం వచ్చేటప్పుడు 'రామసేతు'ను దర్శించుకునే అరుదైన భాగ్యం తనకు కలిగిందని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'దైవానుకూలంగా అయోధ్యలో సూర్య తిలకధారణ జరిగే సమయంలో ఈ సేతుబంధనాన్ని వీక్షించాను. ఇలా ఒకే సమయంలో రెండు దర్శనాలు శ్రీరామచంద్రుడి అనుగ్రహమే' అన్నారు.

పార్లమెంటులో మోదీ ప్రకటన చేయాలి: స్టాలిన్

పాంబన్ వంతెన ప్రారంభోత్సవానికి సీఎం స్టాలిన్ హాజరుకాలేదు. ముందుగా ఖరారైన కార్యక్రమాలు ఉన్నందున ప్రారంభోత్సవానికి రాలేనని ముందుగానే ప్రధానికి తెలియజేశానని ఆయన తెలిపారు. ఆదివారం ఊటీలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తమిళ గడ్డపై అడుగు పెట్టిన మోదీ.. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని పార్లమెంటులో విస్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ సవరణ చేయాలని.. సముచిత పునర్విభజనకు ఇదొక్కటే మార్గమని.. మోదీ ఈ పనిచేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. 1971 జనాభా లెక్కల ప్రకారమే పునర్విభజన చేపడతామని 2001లో నాటి ప్రధాని వాజపేయి హామీ ఇచ్చారని.. దీనికి కేంద్రం కట్టుబడి ఉండాలని కోరారు.

లోకం తీరు



పాంబన్ బ్రిడ్జి నిర్మాణంలో ఆంధ్రుడి ప్రతిభ

సీనియర్ సెక్షన్ ఇంజనీర్‌గా వెంకట చక్రధర్



గుర్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించిన పాంబన్ బ్రిడ్జి దేశంలోనే మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సముద్ర వంతెన. రూ.535 కోట్ల వ్యయంతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ వంతెన నిర్మాణంలో ఆంధ్రా కుర్రాడి ప్రతిభ కూడా ఉంది. విజయనగరం జిల్లా గుర్ల మండలానికి చెందిన నడుపూరు వెంకట చక్రధర్.. పాంబన్ వారధి నిర్మాణ పనుల్లో కీలక బాధ్యతలు చేపట్టారు. సీనియర్ సెక్షన్ ఇంజనీర్ హోదాలో ఇన్‌చార్జి సేనాధిపతిగా విధులు నిర్వహించారు. చక్రధర్ స్వగ్రామం గుర్ల మండలం భూపాలపురం. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేశాడు. రైల్వే పరీక్షల్లో సత్తా చాటి తర్వాత తమిళనాడు రీజనల్ పరిధిలో జూనియర్ ఇంజనీర్‌గా విధుల్లో చేరాడు. వంతెనల నిర్మాణంపై ఆసక్తిని గమనించిన అధికారులు 'పాంబన్' వారధి బాధ్యతలను చక్రధర్‌కు అప్పగించారు. 'చిన్నప్పటి నుంచి వంతెనలు, రోడ్లు అంటే ఎంతో ఇష్టం. బీటెక్‌లో సివిల్ ఇంజనీరింగ్ చదివిన తర్వాత ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ శిక్షణ తీసుకునే సమయంలో ఆర్‌ఆర్‌బీ నోటిఫికేషన్ వచ్చింది. అందులో బ్రిడ్జి విభాగం ఆప్షన్‌ను ఎంచుకొని ఉద్యోగంలో చేరాను. తొలుత పోస్టింగ్ చెన్నైలో వచ్చింది. తర్వాత సీనియర్ ఇంజనీర్‌గా పదోన్నతి లభించింది. అదే సమయంలో పాంబన్ కొత్త వంతెన నిర్మాణానికి కేంద్రం చర్యలు చేపట్టింది. అందులో నాకు బాధ్యతలు అప్పగించడం అదృష్టంగా భావించా. వంతెన నిర్మాణానికి నా వంతు కృషి చేశా'నని చక్రధర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ట్రంప్ చర్యలతో ప్రపంచీకరణకు ముగింపు

» నేడు ప్రకటించనున్న బ్రిటన్ ప్రధాని స్టార్మర్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: ట్రంప్ అవలంబిస్తున్న వాణిజ్య విధానాలతో ప్రపంచీకరణ శకం ముగిసిపోయినట్టేనని యూకే ప్రధాని కీర్ స్టార్మర్ ప్రకటించనున్నారు. 1991లో సోవియట్ యూనియన్ పతనంతో ప్రారంభమైన ప్రపంచీకరణ లక్షలాది మంది ఓటర్లకు నిరాశ కలిగించిందని, 'అమెరికా ఫస్ట్' నినాదంతో ప్రపంచ దేశాలపై ట్రంప్ అసాధారణ స్థాయిలో విధించిన 10శాతం బేస్‌లైన్ సుంకాలు మార్కెట్లను అనిశ్చితిలోకి నెట్టాయని ఆయన సోమవారం ప్రకటించడానికి రంగం సిద్ధమైందని 'టైమ్స్' నివేదిక పేర్కొంది. ఆర్థిక జాతీయవాదం విషయంలో అమెరికా దృష్టిని గుర్తించినట్లు స్టార్మర్ అంగీకరించే అవకాశం ఉందని తెలిపింది. ట్రంప్ తీవ్రమైన చర్యలతో ఏకీభవించనప్పటికీ అంతర్జాతీయ వాణిజ్యంలో ఒక కొత్త శకం ప్రారంభమైందని, అందులో చాలా మంది అమెరికా అధ్యక్షుడి విధానాలను సమర్థిస్తున్నారని స్టార్మర్ యంత్రాంగం గుర్తించిందంటూ యూకేకు చెందిన ఓ సీనియర్ అధికారిని ఉటంకిస్తూ వెల్లడించింది.

ట్రంప్ పిచ్చోడు!

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టారు. అయితే.. అత్యంత స్వల్ప కాలంలోనే ఆయనకు వ్యతిరేకంగా అమెరికా పౌరులు ఆందోళనకు దిగడంతో ప్రపంచవ్యాప్తంగా ఇది చర్చనీయాంశమైంది. లాస్‌ఏంజెలెస్, బోస్టన్, న్యూయార్క్, హ్యూస్టన్, కొలొరాడో, ఫ్లోరిడా, వాషింగ్టన్ డీసీ తదితర రాష్ట్రాల్లో సుమారు 5 లక్షల మందికి పైగా ప్రజలు ఈ నిరసనల్లో పాల్గొన్నట్టు తెలుస్తోంది. "కుబేరుల అజెండాను అమలు చేస్తున్నారు. అధికార అతిక్రమణలకు పాల్పడుతున్నారు" అంటూ ట్రంప్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనలు వామపక్ష నేతల ఆధ్వర్యంలో చేపట్టినట్టు స్థానిక మీడియా పేర్కొంది. గార్డియన్ మీడియా కథనం మేరకు.. వాషింగ్టన్, ఫ్లోరిడా సహా పలు రాష్ట్రాల్లో చేపట్టిన నిరసనల్లో 5 లక్షల మంది అంతకుపైగానే.. పౌరులు పాల్గొన్నారు. మొత్తంగా 50 రాష్ట్రాల్లోని 12 వందల నగరాల్లో 'హ్యాండ్సాఫ్' పేరిట నిరసనలు చేపట్టారు. ఈ నిరసనలన్నీ శాంతియుతంగానే జరిగాయని.. ఎక్కడా ఎవరినీ అరెస్టు చేయలేదని గార్డియన్ పేర్కొంది. మస్క్ పాలసీలకు మద్దతిస్తూ ట్రంప్ కుబేరుల అజెండాను అమలు చేస్తున్నారని నిరసనకారులు ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని, ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్నారని, వలసలు, మానవహక్కులపై ఉక్కుపాదం మోపుతున్నారని గర్జించారు. అయితే, ఈ ఆందోళనల్లో అమెరికాలోని వలసదారులెవరూ పాల్గొనలేదు. నిరసన ప్రదర్శనల్లో, అమెరికా ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల్లో వలసదారులెవరైనా పాల్గొంటే వారిని బహిష్కరిస్తామని ట్రంప్ గతంలో హెచ్చరించడమే ఇందుకు కారణం.

నిరసనలతో ఒరిగేది లేదు!

ట్రంప్, మస్క్ విధానాలను ఎండగడుతూ లక్షల మంది ప్రజలు నిరసన చేపట్టిన నేపథ్యంలో అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నిరసనలు చేపట్టినంత మాత్రాన ఒరిగేది ఏమీ లేదని స్పష్టం చేసింది. ట్రంప్ ప్రజాదరణ కూడా ఏమాత్రం తగ్గబోదని పేర్కొంది. కాగా.. శుక్రవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. "నా విధానాల్లో ఎలాంటి మార్పూ ఉండబోదు" అని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.



ట్రంప్ నిర్ణయాలకు వ్యతిరేకంగా కాలిఫోర్నియాలో భారీ నిరసన ప్రదర్శన

'రాజ్యాధిపత్యంపై పోరాటం'

'రాజ్యాధిపత్యంపై పోరాటం' అని రాసి ఉన్న ప్లకార్డులు సీటెల్ సహా.. పలు రాష్ట్రాల్లో కనిపించాయి. అంతేకాదు.. కొన్ని చోట్ల ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆ దేశ జాతీయ పతాకాన్ని పట్టుకుని నిరసన కారులు ఆందోళనల్లో పాల్గొన్నారు. 'హ్యాండ్సాఫ్ కెనడా, హ్యాండ్సాఫ్ గ్రీన్‌ల్యాండ్, హ్యాండ్సాఫ్ ఉక్రెయిన్' నినాదాలతో నిరసనకారులు హోరెత్తించారు. "ట్రంప్‌కు కీలక సందేశం పంపించేందుకే హ్యాండ్సాఫ్ ఉద్యమం చేపట్టాం" అని అమెరికా రాజకీయ నేత లీహ్ గ్రీన్‌బర్గ్ చెప్పారు. ట్రంప్‌పై నిరసన కారులు తీవ్ర వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. ఆయన పేరును ప్రస్తావించకుండానే 'శ్వేతజాతి అత్యాచార నిందితులు' అంటూ నిప్పులు చెరిగారు. "నాకు చాలా కోపంగా ఉంది. మనసు రగిలిపోతోంది. శ్వేతజాతి అత్యాచార నిందితులు మన దేశాన్ని నియంత్రిస్తున్నారు" అని 43 ఏళ్లపైనా కేస్నెర్ నిప్పులు చెరిగారు. చాలా మంది "అమెరికాకు రాజు ఎవరూ లేడు" అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు.

బెర్లిన్‌లో టెస్లా షోరూం ముందు...

ట్రంప్, మస్క్‌కు వ్యతిరేకంగా పలు యూరోపియన్ నగరాల్లోనూ శనివారం వందలాది మంది నిరసన వ్యక్తం చేశారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో దాదాపు 200 మంది ఆందోళనకు దిగారు. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నగరంలో 'హ్యాండ్సాఫ్' ప్రదర్శనను నిర్వహించారు. ట్రంప్ రాజీనామా చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. బెర్లిన్‌లోని టెస్లా కార్ల షోరూం ముందు నిరసన తెలిపారు. అలాగే లండన్, లిస్బన్ నగరాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబీ

తమిళనాడులోని మదురైలో జరిగిన పార్టీ భేటీలో ఎన్నిక

» ముగిసిన సీపీఎం '24వ పార్టీ కాంగ్రెస్' సమావేశాలు

చెన్నై, హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కేరళకు చెందిన సీనియర్ నేత మరియం అలెగ్జాండర్ బేబీ (ఎంఏ బేబీ) సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తమిళనాడులోని మదురైలో జరిగిన పార్టీ కాంగ్రెస్ సమావేశంలో ప్రధాన కార్యదర్శితోపాటు 84 మంది సభ్యుల కేంద్ర కమిటీని ఎన్నుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి చెందడంతో ఆ పదవి ఖాళీ అయింది. దీనితో మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ తాత్కాలిక కోఆర్డినేటర్‌గా ఆ బాధ్యతలను నిర్వర్తించారు. ఇప్పుడు పూర్తి స్థాయిలో ప్రధాన కార్యదర్శిని ఎన్నుకున్నారు. క్రిస్టియన్ అయిన ఎంఏ బేబీ సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తొలి మైనార్టీ నేత కావడం విశేషం. వామపక్ష రాజకీయాలకు కేంద్రమైన కేరళ నుంచి ఈఎంఎస్ నంబూద్రిపాద్ తర్వాత ఈ పదవికి ఎన్నికైన రెండో నేత ఎంఏ బేబీ. ఎంఏ బేబీ 1954లో కేరళలోని ప్రాక్కులంలో జన్మించారు. అక్కడే పాఠశాల విద్య పూర్తి చేశారు. అప్పుడే ఆయన ఎస్ఎఫ్ఐకి పూర్వరూపమైన కేరళ స్టూడెంట్స్ ఫెడరేషన్‌లో చేరి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. కొల్లాంలోని ఎస్ఎన్ కాలేజీలో డిగ్రీలో చేరినా పూర్తి చేయలేదు. తర్వాత ఎస్ఎఫ్ఐకి, సీపీఎం యూత్ విభాగం 'డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ)'కి అధ్యక్షుడిగా పనిచేశారు. ఎమర్జెన్సీ సమయంలో కొంతకాలం జైలు జీవితం అనుభవించారు. 1986లో కేవలం 32 ఏళ్ల వయసులోనే రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1999లో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడిగా నియామితులయ్యారు. 2006, 2011లో కేరళలోని కుందర ఎమ్మెల్యేగా గెలిచారు. 2006 నుంచి 2011 వరకు రాష్ట్ర విద్యా మంత్రిగా పనిచేశారు. 71 ఏళ్ల ఎంఏ బేబీకి కరుడుగట్టిన నాస్తికుడిగా పేరుంది. కేరళ విద్యా మంత్రిగా పనిచేసిన సమయంలో ఆయన తెచ్చిన పలు సంస్కరణలు, నాస్తికత్వాన్ని బోధించే పాఠ్యాంశాలను స్కూల్ సిలబస్‌లో ప్రవేశపెట్టడం వంటివి వివాదాస్పదం అయ్యాయి. కాగా, బలహీనంగా ఉన్న చోట సీపీఎంను బలోపేతం చేయడం, బీజేపీ ఆధ్వర్యంలోని సంఘ్ పరివార్‌ను ఎదుర్కోవడమే తన ముందున్న ప్రధాన లక్ష్యాలని ఎంఏ బేబీ తెలిపారు. పార్టీ నేతలంతా ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్నట్టు తెలిపారు.



నూతన ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబి పేరును ప్రకటిస్తున్న ప్రకాశ్ కరత్

తెలుగు రాష్ట్రాలకు చెందిన 11 మందికి చాన్స్

తెలుగు రాష్ట్రాల నుంచి బీవీ రాఘవులు, ఆర్.అరుణ్‌కుమార్‌లకు పొలిట్ బ్యూరోలో.. తెలంగాణ, ఏపీ రాష్ట్ర కార్యదర్శులు జాన్ వెస్లీ, వి.శ్రీనివాసరావులతోపాటు తమ్మినేని వీరభద్రం, ఎస్.వీరయ్య, జ్యోతి, పుణ్యవతి, సాయిబాబు, రమాదేవి, లోకనాథంలకు కేంద్ర కమిటీలో చోటు దక్కింది. ఇందులో ఆర్.అరుణ్‌కుమార్‌తోపాటు పుణ్యవతి, సాయిబాబులకు ఢిల్లీ కోటాలో కేంద్ర కమిటీలో చోటు కల్పించినట్టు సమాచారం. వీరిలో రాఘవులు, శ్రీనివాసరావు, వీరభద్రం, పుణ్యవతి ఇప్పటికే కేంద్ర కమిటీలో ఉండగా.. మిగతావారికి కొత్తగా చోటు కల్పించారు.

సీనియర్లకు ఉద్వాసన!

మదురైలో 3రోజులుగా జరుగుతున్న సీపీఎం 24వ పార్టీ కాంగ్రెస్ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శితోపాటు కొత్తగా కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులను ఎన్నుకున్నారు. పార్టీలో అత్యున్నత నిర్ణాయక విభాగమైన పొలిట్ బ్యూరోలోకి కొత్తగా ఎనిమిది మందికి అవకాశం ఇచ్చారు. ఈ క్రమంలో సీనియర్లు ప్రకాశ్ కరత్, బృందా కరత్, మాణిక్ సర్కార్ తదితర సీనియర్లకు పొలిట్ బ్యూరో నుంచి ఉద్వాసన పలికి.. కేంద్ర కమిటీ ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశమిచ్చారు. మొత్తంగా కేంద్ర కమిటీలో 20% మంది మహిళలు ఉన్నారని సీపీఎం ప్రకటించింది.



నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్‌పై సీఆర్‌పీఎఫ్ పహారా(ఫైల్)

వెనక్కి వచ్చేయండి..

- నాగార్జున సాగర్‌పై పహారా కాస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి పిలుపు
- ములుగు బెటాలియన్ నుంచి ఆదేశాలు
- బెటాలియన్‌కు వెళ్లేందుకు సిబ్బంది సిద్ధం
- రెండ్రోజుల క్రితం ఏపీ వైపు బలగాలకూ పిలుపు.. వెంటనే ఆ నిర్ణయం ఉపసంహారణ

నాగార్జునసాగర్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ డ్యామ్ భద్రతపై కేంద్ర ప్రభుత్వం దోబూచులాడుతోంది. సాగర్ ప్రధాన డ్యామ్ వద్ద పహారా కాస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు విధులు నిర్వర్తించే విషయంలో ప్రస్తుతం తీవ్ర గందరగోళం నెలకొంది. డ్యామ్‌లో తెలంగాణ వైపున విధులు నిర్వర్తిస్తోన్న ములుగుకు చెందిన 39వ బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని వెనక్కి రమ్మని ఆదివారం ఆదేశాలు అందాయి. ఏపీ వైపు పహారాలో ఉన్న సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి కూడా రెండ్రోజుల క్రితం ఇదే తరహా ఆదేశాలు వచ్చాయి. తాజా ఆదేశాల నేపథ్యంలో బెటాలియన్‌కు తిరిగి వెళ్లేందుకు తెలంగాణ వైపున ఉన్న బలగాలు కూడా సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం సిబ్బంది అంతా విధుల్లో కొనసాగుతున్నా.. బెటాలియన్ నుంచి వాహనాలు రాగానే వారు బయలుదేరతారు. ఈ విషయంపై సాగర్ డ్యామ్ ఇన్‌చార్జి ఎస్ఈ మల్లికార్జున్‌రావును వివరణ కోరగా.. ఆదేశాలు వచ్చిన మాట వాస్తవమేనని, తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు టీజీ ఎస్పీఎఫ్ సిబ్బందిని సిద్ధం చేస్తున్నారని చెప్పారు. గత ఏడాది డిసెంబరు 28న కూడా వెనక్కి రావాలని తెలంగాణ వైపున ఉన్న సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి ఇలానే ఆదేశాలు రాగా వారు నల్లగొండ దాకా వెళ్లారని, విధుల్లోనే కొనసాగాలని సాయంత్రం మళ్లీ ఆదేశాలు రావడంతో రాత్రికి తిరిగి సాగర్‌కు చేరుకున్న విషయాన్ని మల్లికార్జున్‌రావు గుర్తుచేశారు. కాగా, రెండ్రోజుల క్రితం ప్రధాన డ్యామ్‌కు కుడి వైపున ఏపీ పరిధిలో పహారా కాస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలకు కూడా వెనక్కి రావాలని ఏపీలోని విశాఖపట్నానికి చెందిన 234వ బెటాలియన్ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో డ్యామ్ భద్రతకు ఎంత మంది ఎస్పీఎఫ్ సిబ్బంది కావాలో చెప్పాలని ఏపీ పోలీసు ఉన్నతాధికారులు.. డ్యామ్ అధికారులతో మాట్లాడారు. ఈ లోగా వెనక్కి రావొద్దు, అక్కడే ఉండండి అంటూ బెటాలియన్ నుంచి ఆదేశాలు రావడంతో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది విధులు కొనసాగిస్తున్నారు.

అప్పు తీర్చమన్నందుకు ఫైనాన్సర్ దారుణ హత్య

- సికింద్రాబాద్‌లోని గాంధీనగర్‌లో ఘటన
- పరారీలో నిందితుడు



స్వప్నంసింగ్ (ఫైల్)

కవాడిగూడ/ రాంనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన అప్పును తీర్చమన్న పాపానికి ఓ ఫైనాన్సర్‌ను కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసి తన ఇంట్లోని సంపులో పడేసి పారిపోయాడో వ్యక్తి. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని గాంధీనగర్‌లో జరిగింది. అల్వాల్ వెంకటాపురానికి చెందిన స్వప్నం సింగ్ (59) వృత్తి రీత్యా ఫైనాన్సర్, పరిచయం ఉన్న వారందరికీ ఆయన ఫైనాన్స్ ఇస్తుంటారు. ఈ క్రమంలో గాంధీనగర్‌లో చాయి బండి నిర్వహించే ఒడిసాకు చెందిన నవీన్‌కు ఆయన ఫైనాన్స్ ఇచ్చారు. అయితే నవీన్ తీసుకున్న అప్పును తీర్చకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన స్వప్నం సింగ్ డబ్బు అడిగేందుకు నవీన్ ఇంటికి వెళ్లారు. ఆ రోజు ఇంట్లోనే ఉన్న నవీన్‌ను అప్పు తీర్చాలని స్వప్నం సింగ్ నిలదీసి అడగగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దాంతో కోపోద్రిక్తుడైన నవీన్, స్వప్నం సింగ్‌పై కత్తితో పలుమార్లు దాడి చేసి హతమార్చాడు. అనంతరం మృతదేహాన్ని తన ఇంట్లోని నీటి సంపులో పడేసి పరారయ్యాడు. స్వప్నంసింగ్ ఇంటికి రాకపోవడంతో భయపడిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సెల్ ఫోన్ సిగ్నల్ల ఆధారంగా స్వప్నం సింగ్.. నవీన్ ఇంటి వద్ద ఉన్నట్లు గుర్తించి అక్కడకు వెళ్లి చూడగా సంపులో ఆయన మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు నవీన్‌ను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు చెప్పారు. కాగా, నిందితుడు నవీన్.. స్వప్నం సింగ్ దగ్గరే కాకుండా పలువురి దగ్గర అప్పులు చేసి బోయిగూడలో ఓ ఇల్లు కొన్నట్లు తెలిసింది.

కామారెడ్డి డెయిరీ కళాశాల పీజీ అనుమతుల్లో జాప్యం!

ప్రతిపాదనలు పంపి ఏడాది అవుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

- పీజీ కోర్సుల కోసం పొరుగు రాష్ట్రాలకు విద్యార్థులు
- ప్రస్తుతం డెయిరీ టెక్నాలజీ కోర్సుకు మంచి డిమాండ్



కామారెడ్డి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాలలో పీజీ కోర్సుల అనుమతుల గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపి ఏడాది అవుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో డెయిరీ టెక్నాలజీ కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. రాష్ట్రంలో ఉన్న ఏకైక డెయిరీ కళాశాల కామారెడ్డి జిల్లా కేంద్రంలోనిదే. ఇక్కడ డెయిరీ కోర్సులు చదువుతుండగానే విద్యార్థులకు మంచి ఉద్యోగావకాశాలు వస్తున్నాయి. ఈ క్రమంలో కళాశాలలో పీజీకోర్సులు లేకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువుల కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి. విద్యార్థులు హరియాణా, కేరళ, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో ఆర్థిక భారంతో ఉన్నత చదువులు చదవాల్సి వస్తోంది. దీంతో ఈ కళాశాలలో పీజీ కోర్సులను అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ కళాశాలలో పీజీ కోర్సులకు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి కళాశాలకు 60 ఎకరాల భూమిని కేటాయించింది. రూ.11 కోట్లతో కళాశాల భవనం, హాస్టళ్లు, ఆడిటోరియం, ల్యాబ్‌లు అప్పటి ప్రభుత్వంలోనే నిర్మించారు. ప్రస్తుతం విద్యార్థులు ప్రాక్టికల్స్‌లో భాగంగా పాలపదార్థాలు తయారు చేసి డెయిరీ పార్లర్‌ను కూడా నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలలో ఇప్పటి వరకు సుమారు 1000 మంది విద్యార్థులు చదువు పూర్తి చేశారు. నాలుగున్నర దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. విద్యార్థులకు చదువు పూర్తయిన వెంటనే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయి. రాష్ట్రంలో పేరొందిన జెర్సీ డెయిరీ డైరెక్టర్లంతా ఈ కళాశాల విద్యార్థులు కావడం విశేషం. అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికాతో పాటు గల్ఫ్ దేశాల్లోనూ డెయిరీ రంగంలో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లోనూ చాలా మంది ఉద్యోగాలు చేస్తున్నారు. డెయిరీ కోర్సులు చేసిన వారు ఫుడ్ సేఫ్టీ అధికారులు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, సూపర్‌వైజర్ వంటి ఉద్యోగాలు పొందే వీలుంది. సొంతంగా ఉపాధి కూడా పొందవచ్చు. ఉపకార వేతనాలు, మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందుకోవచ్చు.

అధ్యాపకుల కొరత

డెయిరీ టెక్నాలజీ కళాశాలలో రెగ్యులర్ అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. ఈ కళాశాలలో 24 మంది అధ్యాపకులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ప్రొఫెసర్‌లు ఉన్నారు. 10 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు. కళాశాలకు 12 మంది పూర్తిస్థాయి ప్రొఫెసర్‌ల నియామకం కోసం కళాశాల నిర్వాహకులు ప్రతిపాదనలు పంపారు.

చదువు పూర్తవగానే ఉద్యోగాలు

- ఉమాపతి, అసోసియేట్ డీన్



ఈ కళాశాలలో నాలుగేళ్ల కోర్సు చేసిన విద్యార్థులకు చదువు పూర్తి చేయగానే ప్రైవేట్, స్వయం ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. ఇంటర్ ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఎంసెట్ ర్యాంకు సాధిస్తే ఈ కళాశాలలో చదువుకోవచ్చు. కళాశాలకు పీజీ కోర్సులు మంజూరు చేయాలని అధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

కృష్ణా ట్రైబ్యునల్‌కు నేనొస్తా..

- విచారణలకు హాజరవుతా
- న్యాయ బృందంతో సమీక్షలో మంత్రి ఉత్తమ్ వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల్లో ఏపీ-తెలంగాణ వాటాల పంపిణీకి జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలోని ట్రైబ్యునల్-2 విచారణలకు తానూ స్వయంగా హాజరవుతానని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం ఆయన జలసౌధలో సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ నేతృత్వంలో కృష్ణా ట్రైబ్యునల్-2 ఎదుట రాష్ట్రం తరఫున వాదనలను వినిపిస్తున్న న్యాయ బృందంతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. న్యాయ బృందానికి సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. డాటా సేకరణ, క్షేత్రస్థాయి సమాచారం, పిటిషన్లను రూపొందించే విషయంలో న్యాయబృందానికి పూర్తి సహకారం అందించాలని, వారికి అవసరమైన రవాణా, బస సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునల్ విచారణల సందర్భంగా న్యాయ బృందానికి మంత్రి పలు సూచనలు చేశారు. "తెలంగాణ వాదనలు కేవలం గణాంకాల కోసం కాదు. న్యాయం కోసం జరిపే పోరాటం. రాష్ట్ర హక్కులను కాపాడుకునే తాపత్రయం" అని వ్యాఖ్యానించారు. రాజ్యాంగబద్ధంగా.. సాంకేతికపరంగా రాష్ట్రానికి న్యాయమైన వాటాలను దక్కించుకునేలా ట్రైబ్యునల్ ఎదుట బలమైన వాదనలను వినిపించాలని న్యాయ బృందాన్ని కోరారు. దశాబ్దాలుగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిచేసేందుకు కాంగ్రెస్ సర్కారు కృతనిశ్చయంతో ఉందన్నారు. సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ ఇటీవల జరిగిన విచారణ వివరాలను మంత్రికి వివరించారు. ఈనెల 15 నుంచి 17 తేదీల్లో జరిగే విచారణకు సర్వసన్నద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణ హక్కుల సాధన కోసం ఇప్పటి వరకు జరిగిన విచారణల్లో తాము చేసిన వాదనలను, తాజా స్థితిగతులను వెల్లడించారు. తెలంగాణలో కృష్ణానది పరీవాహక విస్తీర్ణం, జనాభా, సాగునీటి సరఫరా సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, సమ కేటాయింపుల కోసం ట్రైబ్యునల్ ఎదుట వాదనలను వినిపిస్తున్నట్లు చెప్పారు. సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారులు ఆదిత్యనాథ్‌దాస్, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నేడు, రేపు అక్కడక్కడ వానలు!

హైదరాబాద్, విశాఖపట్నం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండు రోజుల పాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆదివారం తెలిపింది. సోమ, మంగళవారాల్లో పలుజిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. మంగళవారం ఖమ్మం, భద్రాద్రి, సూర్యాపేట, నల్లగొండ, మహబూబాబాద్, ములుగు, జనగామ, హనుమకొండ, సూర్యాపేట జిల్లాల్లో వానలు పడే అవకాశముందని పేర్కొంది. ఈ రెండు రోజులు అన్ని జిల్లాల్లోనూ గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల్లోపే నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. తర్వాత మరింత బలపడి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుందని అంచనా వేసింది.

మృత్యువుతో పోరాడి ఓడిన తెలంగాణ వాసి

- 6 మాసాలుగా చికిత్స.. చివరికి మృతి
- ఇరాక్ సరిహద్దులోని ఆరార్‌లో ఘటన

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)



నర్సారెడ్డి

ఉపాధి కోసం సౌదీ అరేబియాలోని ఇరాక్ సరిహద్దు ప్రాంతానికి వెళ్లిన తెలంగాణ వాసి ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆరు మాసాలుగా మృత్యువుతో పోరాడి ఆదివారం కన్నుమూశాడు. ఇరాక్ సరిహద్దులోని ఆరార్ నగరంలో పని చేస్తున్న జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం తుంబరావుపేట గ్రామానికి చెందిన గడ్డం నర్సారెడ్డి ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. సౌదీ ప్రభుత్వం భారీ మొత్తంలో వెచ్చించి నర్సారెడ్డికి చికిత్స చేయించింది. అయినా, ఫలితం దక్కలేదు. చికిత్సకు స్పందించని నర్సారెడ్డి ఆదివారం చనిపోయాడు. మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి రప్పించేందుకు సహకరించాల్సిందిగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సౌదీ అరేబియాలోని భారతీయ రాయబారికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

నేడు 'బనకచర్ల'పై చర్చ..!

బనకచర్లకు తెలంగాణ తీవ్ర వ్యతిరేకం.. కృష్ణా, గోదావరి బోర్డులకు ఫిర్యాదు

- గోదావరి బోర్డు కోరినా బొల్లాపల్లి వివరాలివ్వని ఏపీ
- ప్రాజెక్టుల అప్పగింతపైనా ఏపీ మెలిక



హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు విషయమై తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలపై సోమవారం గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశంలో కీలక చర్చ జరుగనున్నది. ప్రత్యేకించి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు కృష్ణా వరద జలాల తరలింపుపై చర్చ జరిగే అవకాశం ఉంది. జీఆర్ఎంబీ చైర్మన్ ఏకే ప్రధాన్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని జలసౌధలో సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, ఏపీ నుంచి జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తమ రాష్ట్రాల వాదనలు వినిపించనున్నారు. గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా పోలవరం ప్రాజెక్టు నుంచి గోదావరి జలాల తరలింపుతోపాటు నాగార్జున సాగర్ నుంచి కృష్ణా వరద జలాలను గుంటూరు జిల్లాలో నిర్మించే బొల్లాపల్లి రిజర్వాయర్‌కు మళ్లిస్తామని ఏపీ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తంచేస్తున్న సంగతి తెలిసిందే.

ప్రాజెక్టుల అప్పగింతపైనా చర్చ


గోదావరి నది పరిధిలోని మొత్తం 16 ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతను జీఆర్ఎంబీకి అప్పగించాలని 2021 జూలై 15న కేంద్రం జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్ మీద బోర్డు సమావేశంలో చర్చ జరిగే అవకాశం ఉంది. గోదావరిపై ఉన్న పెద్దవాగు ప్రాజెక్టు మాత్రమే రెండు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు అని, అది మినహా ఇతర ప్రాజెక్టులను అప్పగించే ప్రసక్తే లేదని తెలంగాణ తేల్చేసింది. తెలంగాణ ప్రాజెక్టులు అప్పగిస్తేనే తాము అప్పగిస్తామని ఏపీ మెలిక పెట్టింది. 2021లో కేంద్రం విడుదల చేసిన గెజిట్ ప్రకారం తెలంగాణలో 11, ఏపీలో నాలుగు కలిపి గోదావరి బేసిన్‌లో మొత్తం 16 అనుమతి లేని ప్రాజెక్టులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతి పొందాల్సి ఉంది. తెలంగాణలోని 11 ప్రాజెక్టుల్లో తొమ్మిది ప్రాజెక్టుల ఎనిమిది డీపీఆర్‌లను అనుమతి కోసం కేంద్రానికి సమర్పిస్తే ఆరింటికి టీఏసీ అనుమతులు లభించాయి. ఏపీ సర్కార్ మాత్రం తమ ప్రాజెక్టుల డీపీఆర్‌లను అనుమతుల కోసం కేంద్రానికి సమర్పించనే లేదు.

బొల్లాపల్లిపై ఇవీ ఏపీ ప్రతిపాదనలు

రూ.80 వేల కోట్ల ప్రాథమిక అంచనాలతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు ద్వారా రోజూ రెండు టీఎంసీల చొప్పున 90 రోజుల్లో 180 టీఎంసీల మిగులు జలాలను తరలిస్తామని ఏపీ చెబుతోంది. అందుకు నాగార్జున సాగర్ కుడి కాల్వ సామర్థ్యం పెంచడం ద్వారా కృష్ణా నది వరద జలాలను తరలిస్తామని ఏపీ ప్రతిపాదన. అదే జరిగితే నాగార్జునసాగర్ కింద తమ ఆయకట్టు ఎడారిగా మారే ప్రమాదం ఉందని తెలంగాణ ప్రభుత్వం ఆందోళన వ్యక్తంచేసింది. దీనిపై గోదావరి, కృష్ణా బోర్డులతో పాటు కేంద్ర జలశక్తిశాఖకూ ఫిర్యాదు చేసింది. దీంతో ఈ ప్రాజెక్ట్ డీపీఆర్, ఇతర వివరాలు సమర్పించాలని సమర్పించాలని జీఆర్ఎంబీ లేఖ రాసినా ఏపీ ఇంతవరకూ అందించలేదు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏఐ!

- కృత్రిమ మేధ సాయంతో ఈసీజీ, ఎక్స్‌రేల విశ్లేషణ
- కసరత్తు ప్రారంభించిన వైద్య ఆరోగ్య శాఖ



హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించడంపై రాష్ట్ర సర్కారు దృష్టి పెట్టింది. వైద్య సిబ్బంది, నిపుణుల కొరత వల్ల రోగులు ఇబ్బంది పడకూడదనే ఆలోచనతో వైద్యసేవల్లో కృతిమ మేధ (ఏఐ)ను వినియోగించాలని నిర్ణయించింది. ఈ మేరకు కసరత్తును ఇప్పటికే ప్రారంభించిన వైద్య, ఆరోగ్య శాఖ.. రాష్ట్ర ఐటీ విభాగం సహకారం తీసుకోవాలని అనుకుంటుంది. వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఐటీ విభాగంతో త్వరలోనే సమావేశం కానున్నారు. మరోపక్క, ఏఐని వినియోగిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో ఇప్పటికే సమావేశమైన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వివిధ అంశాలపై చర్చించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏఐ సేవలు అందుబాటులోకి తేవాలని వైద్యఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు కూడా పట్టుదలగా ఉన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ తొలుత ఎక్స్‌రేలు, ఈసీజీల విశ్లేషణకు ఏఐని వినియోగించాలని భావిస్తోంది. క్రమంగా మిగిలిన విభాగాలకు ఏఐ సేవలను విస్తరించాలని అనుకుంటోంది. ప్రస్తుతం నిమ్స్ ఆస్పత్రి పాథాలజీ విభాగంలో ఏఐ సేవలను వినియోగిస్తున్నారు. రోగుల నివేదికలను ఏఐ విశ్లేషించి, అసాధారణ రిపోర్టులను గుర్తించి వైద్యులకు తెలియజేస్తుంది. ఈ ప్రక్రియలో మరింత కచ్చితత్వం కోసం ఎదురుచూస్తున్నామని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప వెల్లడించారు. అయితే, నిమ్స్ మాదిరిగానే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్స్‌రేలు, ఈసీజీల పరిశీలన, విశ్లేషణకు ఏఐను వినియోగించాలని వైద్య శాఖ భావిస్తుంది. ఏదైనా ఆస్పత్రిలో వైద్యులు.. రోగులకు ఎక్స్‌రే, ఈసీజీలు సిఫారసు చేస్తే.. సదరు రిపోర్టులు ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్ ద్వారా హైదరాబాద్‌లోని ఐటీ సెల్‌కు వస్తాయి. ఐటీ సెల్‌కు చెందిన ఏఐ ఆ రిపోర్టులను విశ్లేషించి వాటిలో అసాధారణంగా ఉన్న వాటిని గుర్తిస్తుంది. సదరు రిపోర్టు ప్రకారం రోగి ఎదుర్కొంటున్న సమస్యపై పూర్తి విశ్లేషణ చేసి సిఫారసులు చేస్తుంది. ఈ సిఫారసుల ఆధారంగా వైద్యులు లేదా వైద్య సిబ్బంది రోగులకు చికిత్స అందించడం లేదా మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆస్పత్రులకు సిఫారసు చేయడమో చేస్తారు. దీంతో వైద్య సేవల్లో వేగం పెరగనుంది.

ఎట్టకేలకు బోనుకు చిక్కిన చిరుత

- ఊపిరి పీల్చుకున్న తిరుపతివాసులు



బోనులో ఉన్న చిరుత పులి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా తిరుపతి వాసులను హడలెత్తిస్తున్న చిరుతపులి ఎట్టకేలకు బోనులో పడింది. ఈమధ్యకాలంలో తిరుపతిలోని ఎస్వీయూ, వేద వర్సిటీ, వెటర్నరీ యూనివర్సిటీ పరిసరాల్లో తరచూ జింకలను, కుక్కలను చిరుత చంపి పడేసిన ఘటనలు చోటుచేసుకున్నాయి. చెర్లోపల్లె-అలిపిరి ప్రధాన మార్గంలో ఒక ద్విచక్రవాహనదారుడిపై చిరుత దాడి చేసి గాయపరిచింది. ఈ విషయాన్ని యూనివర్సిటీ అధికారులు ఫారెస్టు శాఖ దృష్టికి తీసుకెళ్లారు. వారు చిరుత కదలికలను గుర్తించడానికి ట్రాప్ కెమెరాలు, బోన్లు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బోనులో చిరుత పడింది.

గంజాయి రవాణా ముఠా గుట్టురట్టు!

- 273 కిలోల డ్రై గంజాయి జప్తు.. ముగ్గురి అరెస్టు

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇల్లు మారుతున్నప్పుడు సామగ్రి రవాణ సేవలందించే ప్యాకర్స్ అండ్ మూవర్స్ సంస్థ ముసుగులో ఒడిశా నుంచి తెలంగాణ మీదుగా హరియాణకు గంజాయి తరలిస్తున్న ముఠా గుట్టును శామీర్‌పేట, ఎస్‌వోటీ పోలీసులు రట్టుచేశారు. పంజాబ్‌వాసి పర్దీప్‌కుమార్, హరియాణా వాసులు సన్నీ, మనీష్ కుమార్..బోయిన్‌పల్లిలో ప్యాకర్స్ అండ్ మూవర్స్ సంస్థ నిర్వహిస్తున్నారు. గతంలో ఎన్‌సీబీ కేసులో శిక్ష పడిన వ్యక్తితో కలిసి ఒడిశా నుంచి హరియాణకు భారీగా గంజాయి రవాణాకు పథకం వేశారు. ఒడిశా సప్లయర్ సుభాష్ బిశ్వాస్‌తో ఒప్పందం చేసుకున్నారు. బొలెరో వాహనంలో బయలుదేరిన ఈ ముఠా ప్రతి రోజూ రూట్ మారుస్తూ.. పోలీసుల ట్రాకింగ్‌కు చిక్కకుండా తమ మధ్య కమ్యూనికేషన్ కోసం జియో డాంగిల్‌సాయంతో వాట్సాప్ సేవలను వాడుకున్నారు. ఈ ముఠా పథకం గురించి పక్కా సమాచారం తెలుసుకున్న బాలానగర్ ఎస్ఓటీ, శామీర్‌పేట పోలీసులు ఆదివారం తెల్లవారుజామున శామీర్‌పేట ఓఆర్ఆర్ వద్ద తనిఖీ చేయడంతో గంజాయి బయట పడింది. 273 కిలోల డ్రై గంజాయి (రూ.95 లక్షలు), బొలెరో (రూ.5 లక్షలు), జియో డాంగిల్ (రూ.70 వేలు), ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ కోటిరెడ్డి ఆదివారం మీడియాకు చెప్పారు.

విత్తన హక్కుతోనే సంప్రదాయ విత్తనాలకు రక్షణ

- రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి
- అన్మాస్‌పల్లిలో ముగిసిన విత్తన పండుగ

కడ్తాల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రైతుల విత్తన హక్కుకు చట్ట రూపం ఇచ్చి దానిని అమలుపరచినప్పుడే దేశీయ సంప్రదాయ విత్తనాలను రక్షించుకోగలుగుతామని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టిసారించి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురావాలని కోరారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలం అన్మాస్‌పల్లి 'ది ఎర్త్ సెంటర్'లో సీజీఆర్, 'భారత్ బీజ్ స్వరాజ్ మంచ్' ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తెలంగాణ తొలి విత్తన పండుగ కార్యక్రమం ఆదివారం ముగిసింది. 20 అంశాలతో ఐదు భాషల్లో డిక్లరేషన్ ప్రకటించారు. ప్రముఖ విధాన విశ్లేషకుడు దొంతి నర్సింహరెడ్డి రచించిన ఆరోగ్యానికి ఆహారం-భద్రతకు విత్తనం పుస్తకాన్ని రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో కోదండ రెడ్డి మాట్లాడుతూ.. కల్తీ విత్తనాలను అరికట్టడానికి ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. సంప్రదాయ విత్తనాలతో సేంద్రియ సాగు ద్వారా భూసారాన్ని, ప్రకృతిని పరిరక్షించుకోవచ్చన్నారు. ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ.. దేశంలో ఆకుపచ్చ విప్లవానికి, పర్యావరణ పరిరక్షణకు, దేశీయ సంప్రదాయ విత్తనాలకు అన్మాస్‌పల్లి 'ఎర్త్ సెంటర్' కేంద్రంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, సీజీఆర్ వ్యవస్థాపక అధ్యక్షులు కొర్పోలు లీలారెడ్డి, పీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మధుసూదన్ రెడ్డి, సీజీఆర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

- రంగారెడ్డి జిల్లా చిన్న శంకర్‌పల్లిలో ఘటన

శంకర్‌పల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని చిన్న శంకర్‌పల్లిలో జరిగింది. బద్దం హన్మంత్‌రెడ్డి(48) వ్యవసాయం చేసుకొని జీవనం సాగించేవాడు. అతనికి భార్య అనిత, కుమారులు అరవింద్ రెడ్డి, ప్రణీత్‌రెడ్డి ఉన్నారు. అయితే పెద్ద కుమారుడు అరవింద్‌రెడ్డి తల్లిదండ్రులకు చెప్పకుండా బయట రూ.3 లక్షల వరకు అప్పులు చేశాడు. ఇదే విషయంలో భార్య, పెద్ద కుమారుడితో హన్మంత్‌రెడ్డి గొడవ పడ్డాడు. ఈ నేపథ్యంలో మనస్తాపంతో ఈనెల 3న పొలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం హన్మంత్‌రెడ్డి పొలంలో మృతి చెంది ఉండటాన్ని చూసిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

గౌడ మహిళలను గుడి నుంచి పంపేసిన పూజారి

- పోలీస్‌స్టేషన్ వద్ద బైఠాయించిన మహిళలు
- పూజారి, ముగ్గురు గ్రామ కమిటీ సభ్యులపై కేసుల నమోదు

మోర్తాడ్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఆలయం నుంచి గౌడ సామాజిక వర్గానికి చెందిన మహిళలను పంపించిన ఘటన నిజామాబాద్ జిల్లాలో జరిగింది. ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లోని కోదండరామాలయంలో శ్రీరామ నవమికి ముందు రోజు కుంకుమార్చన జరపడం ఆనవాయితీ. దాంతో శనివారం గౌడ కులానికి చెందిన మహిళలు ఆలయంలోకి వెళ్లారు. అయితే, లోపలికి రానివ్వవద్దని గ్రామ కమిటీ సభ్యులు చెప్పారంటూ.. బయటకు వెళ్లిపోవాలని ఆలయ పూజారి వారికి చెప్పారు. అయినా మహిళలు వెళ్లకపోవడంతో మీరు వెళ్తేనే కుంకుమార్చన చేస్తామని చెప్పడంతో పూజలకు అంతరాయం కలిగించవద్దని మహిళలు బయటకు వెళ్లారు. అనంతరం వారు ఏర్గట్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి గ్రామకమిటీ సభ్యులు, పూజారిపై ఫిర్యాదు చేసి, పోలీస్‌స్టేషన్ వద్ద బైఠాయించారు. దీంతో పోలీసులు పూజారిపై, ముగ్గురు గ్రామ కమిటీ సభ్యులపై కేసులు నమోదు చేశారు. కాగా, గ్రామ కమిటీకి గౌడ సంఘానికి మధ్య వివాదం జరుగుతోంది. గ్రామ కమిటీకి గీత కార్మికులు డబ్బులు ఇవ్వాలని కమిటీ సభ్యులు డిమాండ్ చేయగా గీత కార్మికులు స్పందించలేదు. దాంతో కల్లు తాగకుండా కొన్ని నెలలుగా గీత కార్మికులను గ్రామం నుంచి బహిష్కరించారు. ఇటీవల వివాదం సద్దుమణిగిందని భావించిన ఆ సామాజిక వర్గ మహిళలు శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొనేందుకు సిద్ధమవ్వగా ఈఘటన జరిగింది.

బొమ్మలు: అక్బర్


ఈ 'రీల్స్' రోజుల్లో 'యులీసిస్' చదవగలమా!


ఆధునిక సాహిత్యంలో అత్యంత ముఖ్యమైన, సంక్లిష్టమైన రచనగా పరిగణించబడే జేమ్స్ జాయిస్ 'యులీసిస్' నవలను మొదట చాలామంది పబ్లిషర్లు తిరస్కరించారు. తర్వాత 1922లో పారిస్‌లోని 'షేక్స్పియర్ అండ్ కంపెనీ' యజమాని సిల్వియా బీచ్ ప్రచురించారు. కానీ అశ్లీలత పేరిట ఈ నవలను త్వరలోనే నిషేధించారు. యు.ఎస్. పోస్టల్ సర్వీసు ఏకంగా నవల కాపీలను తగలబెట్టింది. కథాపరంగా చూస్తే 'యులీసిస్'కు ఎటువంటి ప్రత్యేకతలూ లేవు. అతి సాధారణమైన కథను జాయిస్ ఎలా చెప్పారన్నదే దీని ప్రత్యేకత.

డబ్లిన్ నగరంలో కొందరు సాధారణ వ్యక్తుల జీవితంలో ఒకే ఒక్క రోజు (1904 జూన్ 16న), సుమారు 18 గంటలపాటు, జరిగే సంఘటనలను కథగా రాసుకొచ్చారు జేమ్స్ జాయిస్. క్రమమూ లేకుండా ఒకదాన్నొకటి ఢీ కొడుతూనే ఉంటాయి. అందువల్ల 'యులీసిస్' వచనమంతా అనేక పాత్రల ఆలోచనల అంతర్వాహిని అస్తవ్యస్తంగా పెనవేసుకుని చిక్కులు పడిపోయినట్లుంటుంది.

కథలో లియోపోల్డ్ బ్లూమ్, స్టీఫెన్ డెడలస్, మోలీ వంటి ముఖ్య పాత్రలతో బాటు కథ మధ్యలో వస్తూ పోతూ ఉండే ఇతరత్రా పాత్రల 'స్ట్రీమ్ ఆఫ్ కాన్షియస్‌నెస్' కూడా కలగాపులగంగా కలిసిపోయి, జాయిస్ వచనాన్ని పాఠకులకు ఓ పట్టాన కొరుకుడు పడనివ్వదు. పాఠకుడికి ఒక సన్నివేశం ఎలా మొదలవుతుందో, ఎవరు, ఎప్పుడు, ఎక్కడ మాట్లాడడం మొదలుపెట్టారో, సంభాషణ ఎప్పుడు ముగించారో స్పష్టత ఉండదు. వాక్యాల చివర ఫుల్‌స్టాపులూ, కామాలూ ఉండవు. రెండు మూడు పేజీలు పూర్తయినా ఒక్కోసారి వాక్యం ముగింపు కానరాదు. ఇక చివరి అధ్యాయం 'పెనెలోపె'లో అయితే మోలీ అనే పాత్ర స్వగతంగా మొదలైన ఒక వాక్యం మొదట్నుంచి చివరి వరకూ ఆగకుండా అనంతమైన ప్రవాహంలా సాగుతూనే ఉంటుంది. ఏదేమైనా ఐరిష్ సంస్కృతి గురించీ, జేమ్స్ జాయిస్ శైలి గురించీ కనీస అవగాహనలేని సగటు పాఠకుడిని చెయ్యి పట్టుకుని 'యులీసిస్' ఏరు దాటించే 'డిజిటల్ సాయాలు' ఇప్పుడు పబ్లిక్ డొమైన్‌లో అనేకం అందుబాటులో ఉండడం వల్ల ఈ నవల చదవడం ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు తేలికే.

నిర్దిష్టమైన మూలం, నేపథ్యం ఉండే ఇద్దరి మధ్య సంభాషణ, వాటి నేపథ్యం తెలియని మూడో వ్యక్తికి అర్థం కాదు. జాయిస్ నవల ఇటువంటి ఒక 'ఇన్‌సైడ్ జోక్' లాంటిది. ఎటొచ్చీ 'యులీసిస్' రాయడం ద్వారా జాయిస్ ఏ ఒక్క వ్యక్తినో గాక మొత్తం ప్రపంచాన్ని తన సంభాషణలో భాగంగా చేసుకునే ప్రయత్నం చేశారు. 'యులీసిస్' శిల్పానికి ఫ్రేమ్ వర్క్‌గా తీసుకున్న హోమర్ కావ్యం 'ఒడిస్సీ' చదివితే ఈ నవల చదవడం తేలికవుతుంది అంటారు కొందరు. కానీ అది అర్ధసత్యం మాత్రమే. కథాపరంగా ఒడిస్సీకీ, యులీసిస్‌కీ పొంతనలుండవు.





ఐదువందల పేజీల పుస్తకాన్ని అరగంట నిడివికి కుదించే వెబ్ సిరీస్‌లూ, అంతకంతకూ క్షీణించిపోతున్న మన అటెన్షన్ స్పాన్‌ని సూచించే అర నిముషం వీడియోలు ఇవన్నీ కలగలసిన 'ఇన్‌స్టంట్' సంస్కృతిలో 'యులీసిస్' లాంటి నవలను చదవడం మెదడును రీవైర్ చెయ్యడం లాంటిది. మొండి పశువు కొమ్ములు బలవంతంగా వంచడంలాంటిది. ఇలాంటి నవలలు మనం నేర్చుకున్నదంతా వదిలించుకుని మళ్ళీ పూర్వపు విద్యార్థిగా మారే అవకాశమిస్తాయి.

దైనందిన వ్యవహారాల్లోను, మామూలు సంభాషణల్లోను 'ఆర్ట్'ను ఆయన ఎంత వైవిధ్యంగా చూపగలిగారన్నదే ఈ నవల ప్రత్యేకత. నిజానికి ఇప్పటి ఓటీటీ వెబ్ సిరీస్లు, సినిమాలూ, పుస్తకాల్లో కనిపించేంత అశ్లీలత ఈ నవలలో లేదు. అందువల్ల నేటి పాఠకుడికి ఈ పుస్తకంలో షాక్ వేల్యూ పెద్దగా ఏమీ కనిపించదు. కానీ ఆనాటి మతవిశ్వాసాలనూ, సాంఘిక నియమాలనూ సవాలు చేసిన ఈ నవలకు అప్పటి వ్యతిరేకతను అర్థం చేసుకోవచ్చు.

సాహిత్యంలో 'స్ట్రీమ్ ఆఫ్ కాన్షియస్‌నెస్' కథనాలు కొత్తేమీ కాదు. ఉదాహరణకు జులియన్ బార్న్స్ 'ది సెన్స్ ఆఫ్ ఆన్ ఎండింగ్', థామస్ బెర్న్‌హార్డ్ 'ది లూజర్' వంటి నవలల్లో కథంతా ఒకే ఒక్క ముఖ్య పాత్ర తన స్వగతం చెప్పుకుంటున్నట్లు రాశారు. టాల్‌స్టాయ్ 'అన్నా కరెనినా', ఇటీవల నోబెల్ ప్రైజ్ గెలుచుకున్న హాన్ కాంగ్ 'ది వెజిటేరియన్' లాంటి నవలల్లో రెండు లేదా అంతకంటే ఎక్కువ పాత్రల స్వగతాలను ఒక్కొక్కరి దృష్టి కోణం నుంచీ విడదీసి చెబుతారు. ఇప్పుడు జాయిస్ వచనాన్ని పరిశీలిస్తే– ఉత్తమ, మధ్యమ, ప్రథమ పురుష ఈ మూడు రకాల నేరేటివ్‌లూ కథలో ఏ విధమైన

కానీ జాయిస్ తన స్నేహితులకు ఇచ్చిన 'గిల్బర్ట్ స్కీమా డయాగ్రమ్'లో ప్రతీ అధ్యాయానికీ 'ఒడిస్సీ' నేపథ్యమేమిటో చెప్పే లంకెలుంటాయి.

నవల మొదటి 10 ఎపిసోడ్ల వరకూ విపరీతమైన పాండిత్య ప్రకర్ష ప్రదర్శించినా, 'సైరెన్స్' ఎపిసోడ్ మొదలు హాస్యం, వ్యంగ్యం, పేరడీలతో జాయిస్ పామరుల కోసమే ప్రత్యేకించి రాస్తున్నారనిపించేంతగా, కఠినమైన వచనాన్ని కొమ్ములు వంచి ఉన్న పళంగా 180 డిగ్రీల మలుపు తిప్పుతారు జాయిస్. ఆయన వచనం ఆయన సృష్టించిన అనేక పాత్రల వెనక ఎక్కడో నక్కి పాఠకుడితో నర్మగర్భంగా దాగుడుమూతలు ఆడుతున్నట్లు ఉంటుంది. ఆయన తన గురించి ఎన్నో వివరాలను గుక్కతిప్పుకోకుండా చెప్పీచెప్పనట్లు చెబుతూనే, చివరి వరకూ పాఠకుడికి దూరంగా, ఒక అపరిచిత వ్యక్తిగానే మిగిలిపోతారు. జాయిస్ వచనంలో అందరికీ అర్థంకావాలనే ఉబలాటం కనపడదు. "నా గురించి తెలియాలంటే నా ప్రపంచాన్ని నువ్వే ప్రయత్నపూర్వకంగా తెలుసుకోవాలి" అనే కళాకారుడికి ఉండే సాధికారత, అహంకారం జాయ్స్ వచనంలో అణువణువునా కనిపిస్తుంది.

జాయిస్ శైలిలో మనకు నవలంతా స్థిరంగా కనిపించే ఒకే ఒక్క నియమం– ఏ నియమాలూ లేకపోవడమే! మొదటి మూడు చాప్టర్లలో చాలా పకడ్బందీగా కనిపించే వాక్య నిర్మాణం తరువాత చాప్టర్లలో పూర్తిగా వీగిపోతుంది. ఇక్కడ నుండీ పాండిత్య ప్రకర్ష తగ్గి జాయిస్ అసలుసిసలు "Foul play" మొదలవుతుంది. ఇక్కడ నుండీ జాయిస్ వాక్యనిర్మాణపు సంప్రదాయాలకూ, నవలా రచన విధివిధానాలకూ పూర్తి తిలోదకాలిచ్చేస్తారు. ఇక 11వ భాగం 'సైరెన్స్'కి వచ్చేసరికి జాయిస్ స్వరంలోని 'గూఫీ టోన్' తారాస్థాయికి చేరుకుంటుంది. "Bronze by gold heard the hoofirons, steelyrining imperthnthn thnthnthn" అనే వాక్యాలు చదివిన ఎజ్రా పౌండ్ "జాయిస్ తలకు ఏదైనా బలమైన దెబ్బ తగిలిందేమో" అని కలవరపడ్డారంటేనే మనం ఊహించుకోవచ్చు. ఈ నవల నైతిక విలువలనూ, సభ్యతనూ మాత్రమే కాదు, కాల్పనిక సాహిత్య సంప్రదాయాలన్నిటినీ కూకటివేళ్ళతో పెకలించివేస్తుంది. జాయిస్ వచనం కొన్నిచోట్ల ఐరిష్, బ్రిటిష్ రైమ్స్, దేశ విదేశీ కవిత్వం, చరిత్ర, సాంస్కృతిక అంశాలతోనూ, మరికొన్ని చోట్ల వాటికి పూర్తి భిన్నంగా 'gibberish' భాషలో అతి సామాన్యమైన, ఒకింత అర్థంపర్థం లేని సంభాషణలూ, పారడీలతోనూ ఎగుడుదిగుడు రోడ్ల మీద పడుతూ లేస్తూ చేసే ప్రయాణాన్ని తలపిస్తుంది. సాధారణంగా ఆనాటి రచయితలు వాడని అసభ్య భాషని పచ్చిగా ఉన్నదున్నట్లుగా ఎందుకు వాడారని ఎవరో అడిగితే– "ఈ జాతి, ఈ దేశం, ఈ జీవితం నన్ను మలిచాయి–– నేను ఎలాంటి వాడినో అలాగే నన్ను వ్యక్తం చేసుకుంటాను" అని సమాధానం ఇచ్చారు జాయ్స్.

ఐదువందల పేజీల పుస్తకాన్ని అరగంట నిడివికి కుదించే వెబ్ సిరీస్‌లూ, అంతకంతకూ క్షీణించిపోతున్న మన అటెన్షన్ స్పాన్‌ని సూచించే అర నిముషం వీడియోలు ఇవన్నీ కలగలసిన 'ఇన్‌స్టంట్' సంస్కృతిలో 'యులీసిస్' లాంటి నవలను చదవడం మెదడును రీవైర్ చెయ్యడం లాంటిది. మొండి పశువు కొమ్ములు బలవంతంగా వంచడం లాంటిది. ఇలాంటి నవలలు మనం నేర్చుకున్నదంతా వదిలించుకుని మళ్ళీ పూర్వపు విద్యార్థిగా మారే అవకాశమిస్తాయి. ముఖ్యంగా జాయిస్ వాడిన ఐరిష్ యాసతో కూడిన పక్కా లోకల్ భాష మనకి ఇంగ్లీష్ మీద మంచి పట్టు ఉందనే నమ్మకాన్ని తునాతునకలు చేసిపారేస్తుంది. మార్కస్ జూసాక్ నవల 'బుక్ థీఫ్'లో లీసెల్ మెమింగర్ చిన్నప్పుడు చదవడం నేర్చుకుంటున్నప్పుడు ఒక్కో అక్షరాన్నీ కూడబలుక్కుంటూ పదాలను పేర్చుకోవడం గురించి రాస్తారు. అలాగే 'యులీసిస్' నవల మనం బాల్యంలో ఎక్కడో కోల్పోయిన తొలి పాఠకుడిని మరోసారి వెలికితీస్తుంది.

■ నాగిని కందాళ

'బందారం కథలు' ఆవిష్కరణ

నందిని సిద్ధారెడ్డి కథా సంపుటి 'బందారం కథలు' ఆవిష్కరణ సభ ఏప్రిల్ 8 సా.4.30నిమిషాలకు ప్రెస్ క్లబ్, సిద్దిపేటలో జరుగుతుంది. అధ్యక్షత కె. రంగాచారి; ముఖ్య అతిథి కె. శ్రీనివాస్; ఆత్మీయ అతిథి దేశపతి శ్రీనివాస్; సమీక్ష వి. శంకర్; ఆత్మీయ సందేశం జైదల అంజయ్య, పొన్నాల బాలయ్య.

సిద్దెంకి యాదగిరి

రెండుతరాల కవిసంగమం

పై కార్యక్రమం ఏప్రిల్ 12 సా.6 గంటలకు నిజాం కాలేజి, బషీర్ బాగ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఏనుగు నరసింహారెడ్డి, రహీమొద్దీన్, శ్రీనిధి విప్లవశ్రీ, సందీప్ వొటారికారి, అరవింద్ మైలారపు పాల్గొంటారు.

కవి యాకూబ్

అవార్డుల ప్రదానోత్సవ సభ

చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా బండారు ప్రసాదమూర్తి ప్రధాన అవార్డును స్వీకరిస్తారు. ఈ సభ ఏప్రిల్ 13 సాయంత్రం నెల్లూరు పురమందిరం ఏసీ హాలులో జరుగుతుంది. ముఖ్యఅతిథి షేక్ అబ్దుల్ అజీజ్, అధ్యక్షత తుంగా శివప్రభాత్ రెడ్డి, విశిష్ట అతిథి మాడభూషి సంపత్ కుమార్. సభలో పి. శ్రీనివాస్ గౌడ్, కొమ్మవరపు విల్సన్ రావు, అవధానుల మణిబాబు సాహితీ పురస్కారాలను స్వీకరిస్తారు. కవి సమ్మేళనం వుంటుంది.

చిన్ని నారాయణరావు

వి. చంద్రశేఖర రావు పురస్కారం

వి. చంద్రశేఖర రావు జయంతి, పురస్కార సభ ఏప్రిల్ 13 సా.6గంటలకు 2/7, బ్రాడీపేట, కొరటాల భవన్ (సిపియం ఆఫీస్), గుంటూరులో జరుగుతుంది. కథకుడు కె.వి.మేఘనాథ్ రెడ్డి పురస్కారం స్వీకరిస్తారు. సభలో పెనుగొండ లక్ష్మీ నారాయణ, ఎ.కె. ప్రభాకర్, వాసిరెడ్డి నవీన్, కందిమళ్ళ శివప్రసాద్, కాట్రగడ్డ దయానంద్ పాల్గొంటారు.

వి. ప్రసూన

బాలల నవలల పోటీ ఫలితాలు

తానా – మంచి పుస్తకం ఆధ్వర్యంలో జరిగిన బాలల నవలల పోటీలో ఎంపికైన రచయితలు: ఆర్.సి. కృష్ణస్వామి రాజు ('కుంటోళ్ల కొట్టం'), పాణ్యం దత్త శర్మ ('మనకు మనుషులు కావాలి'), శాఖమూరి శ్రీనివాస్ ('చతుర్ముఖం'), ఎం. సుగుణ రావు ('ఆలీబాబా అయిదుగురు స్నేహితులు'), పి. యుగంధర్ ('జాను అనే నేను, నా స్నేహితురాళ్లు'). ఒక్కొక్కరూ రూ.15వేల పారితోషికాన్ని స్వీకరిస్తారు.

పి. భాగ్యలక్ష్మి

కవితల పోటీ

వాసా ప్రభావతి స్మారకంగా వాసా ఫౌండేషన్ – పాలపిట్ట సంయుక్తంగా నిర్వహిస్తున్న కవితల పోటీకి ఎక్కడా ప్రచురితం కాని, పోస్టు చేయని వచన కవితలను ఏప్రిల్ 30లోగా పంపాలి. ఇతివృత్తం ఏదయినా పరవాలేదు. మొదటి, రెండో, మూడో బహుమతులు వరుసగా: రూ.3వేలు, 2 వేలు, 1000. ఎనిమిది కవితలకు రూ.500 ప్రత్యేక బహుమతులు. చిరునామా: ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం. 2, బ్లాక్-6, ఎం.ఐ.జి-2, ఏపిహెచ్‌బి, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్-500 044. ఫోన్: 98487 87284, ఈమెయిల్: palapittamag@gmail.com

పాలపిట్ట

బాల్యానికి బయోస్కోపులా.. మాలిమిగా.. లాలనగా..

'నామంకోపు' అని తెల్లగా వేలెడంత ఉండేది. రాత్రిపూట దాన్ని నీటితో అరగదీసి నా చిన్నప్పుడు రెండు కళ్లచుట్టూ పూసేది మా అమ్మమ్మ. ఎందుకని అడిగితే కళ్లకి చలవ నాయనా అని చెప్పేది. తొలకరి మట్టి వాసనతో, కళ్లచుట్టూ చల్లని తడితో, గాంధీ కళ్ళద్దాలు పెట్టుకున్నట్టుండే ముఖాల్ని అద్దంలో చూసుకుని నవ్వుకొనేది పిల్లలం. అలాగ రాత్రిళ్ళు నామంకోపు కళ్లతో ఉన్న చిన్నప్పటి నేనే ఈ కవిత ప్రారంభంలో అందమైన అమాయకపు ప్రశ్న వేసిన 'పిచ్చి కన్నా' అనిపిస్తుంది నాకు.



కరెంటు పోయి కొవ్వొత్తి వెలిగిస్తున్న అమ్మ పిల్లవాడి ప్రశ్నకు చిన్న కథ చెబుతుంది. (నా చిన్నప్పుడు బడి దగ్గరకి ఎవరో బయోస్కోపు తెచ్చేవాళ్లు. దానిలో రంగురంగుల బొమ్మలు ఒకదాని తర్వాత ఒకటి మారిపోతుంటే ఓ కన్ను మూసి మరో కంటితో చూసేవాళ్లం. అచ్చంగా అలా ఉంటుంది ఈ కథ. పాఠకుడ్ని 'పసివాడ్ని' చేసి చెబుతున్నప్పుడు అచ్చంగా అలానే ఉండాలి కథ). కథలో ఆకుల్ని కప్పుకొనే పిట్టల నుంచి పగటినీ రాత్రినీ మార్చి మార్చి కప్పుకొనే భూమి వరకూ ప్రతి ఒక్కటీ నేనే అనిపించి ఉద్వేగం కలుగుతుంది.

"నీకు ముందు, నీ తర్వాత, నీకోసం, ఇంత గొలుసుకట్టు ప్రపంచం ఉండాలి నీ ఇంట్లో, లోకంలో, నీలో – అదే నీకు రక్షణ, భద్రత – అదే నిన్ను ప్రేమించే అందరి నుంచి నువ్వు పొందుకుంటోంది, తిరిగి వాళ్లందరికీ నువ్వు ఇవ్వాల్సింది" అనే జీవిత సత్యాన్ని 'పసిబిడ్డ భాషలో' మాలిమిగా, లాలనగా అమ్మలాగా చెబుతుంటే ఉద్వేగం కలగకుండా ఎలా ఉంటుంది?

చివరికి నిద్రలేమితో ఏళ్లకేళ్లు తీసుకున్నవాడిగా ఆఖరి మూడు వరుసల్లో కథలోనివన్నీ గంధపు వదనంపైన తెరలు తెరలుగా కదలాడుతుండగా అలా నోరు తెరుచుకుని నిదురపోయి ఉండేదీ నేనే...

ఐదేళ్ల క్రితం తొలిసారి చదివిన నాటి నుండి నేటి వరకు ఈ కవిత ఎప్పుడు మదిలో మెదిలినా ఇవే నాకు కలిగే బయోస్కోపు భావనలు, నేను ప్రేమని పొందుతున్న ప్రతి ఒక్కరిపైనా కృతజ్ఞతల్ని కాపాడుతున్న బతుకు తీపి వరాలు.

■ సొలోమోన్ విజయ్ కుమార్
83413 36828

ప్రియ పద్యం

అమ్మ చెప్పిన కథ

"అమ్మా చలేస్తే, మనం దుప్పట్లు కప్పుకుంటాం. మరి పిట్టలూ?"

కరెంట్ పోయిన చీకట్లో కొవ్వొత్తిని వెలిగిస్తూ ఆ తల్లి ఇలా చెప్పింది "పిచ్చి కన్నా, చలేస్తే పిట్టలు ఆకుల్ని కప్పుకుంటాయి ఆకులు ఆకాశాన్ని కప్పుకుంటాయి, ఆకాశం చుక్కల్నీ చుక్కలు నీ కళ్ళనీ కప్పుకుంటాయి. నీ కళ్ళని అమ్మా, అమ్మని నాన్నా, నాన్నని నీ తమ్ముడూ నీ తమ్ముడ్ని తాతా, తాతని నాయనమ్మా నాయనమ్మని ఈ ఇల్లూ కప్పుకుంటుంది. ఈ ఇంటిని వేపచెట్టూ, వేపచెట్టుని నేలా, నేలను గాలీ మరి గాలిని పచ్చని చేలూ, చేలని నీరూ, నీరుని నిప్పూ కప్పుకుంటాయి. ఇక పూలని పురుగులూ, పురుగులని పుట్టలూ, పుట్టల్ని పాములూ పాములని పరమ శివుడూ, ఆ శివుడిని పార్వతీ, పార్వతిని ఈ భూమీ, ఈ భూమిని పగలూ రాత్రీ మార్చిమార్చి కప్పుకుంటాయి. ఇక పడుకుందామా?" అని తను తల తిప్పి పక్కకు చూసేటప్పటికి, మంచంపై పిట్టలూ ఆకులూ పూవులూ చుక్కలూ, నింగీ నేలా నీరూ నిప్పూ గూళ్ళూ చెట్లూ పుట్టలూ పురుగులూ, పగలూ రాత్రీ వెన్నెల వాసనా, చల్లటి నిద్రా తెరలు తెరలుగా కదులాడే గంధపు వదనంతో ఒక పిల్లవాడు అలా నోరు తెరుచుకుని నిదురపోయి ఉన్నాడు!



■ శ్రీకాంత్

దుఃఖం అడ్డుపడ్డ పద్యం

పద్యం గొంతులో పెను దుఃఖం ఏదో అడ్డుపడింది
అందమైన, సొగసు పదాల్ని పలుక లేక
దాని పెదవులు వణికాయి

సముద్రపు చీకటి అగాధాలవలే ఎంతో లోతైన
మహాపర్వత శిఖరాలవలే అత్యున్నతమైన
చిక్కటి చీకటి కారడవుల వలే అతివిస్తారమైన
'కోల్పోవడం, కోరుకోవడం'
అనే అతి క్లుప్త, అత్యంత బరువైన
రెండు మహా పదాల శబ్దాలు
మనిషి హృదయంలో నుండి పలికిన
సన్నటి దుఃఖ జీర వలే దానికి వినపడ్డాయి

ఆ రెండు సర్వోత్కృష్ట
పదాల మధ్య
కవిత్వం ఒక ఊగే ఆశల వంతెనను కడుతుంది

ఆ తరువాత, అనేక మార్లు
వికసించి, వాడి, రాలిపోయి,
పునర్జీవించే జీవితం చేయి పట్టుకుని
ఆ వంతెనపై కవిత్వం మెల్లిగా నడిచింది

మానవ మహా విషాదాన్ని అనునిత్యం
అతి దగ్గరగా చూసే
పద్యం గొంతులో ఎప్పుడూ
దుఃఖ సుడిగుండాలు అడ్డుపడతాయి

వణికే దాని పెదవులు
అయినా పలుకుతాయి ఇలా
జీవించు, పోరాడు, జీవించు

■ విమల



ద్రావిడ సంస్కృతికి దర్పణంగా 'బర్మాకేంపు'

వేరే ప్రాంతాలకి వలస వెళ్ళి అక్కడి మనుషులతో, జీవన విధానాలతో సామరస్యం కోసం నిరంతరం ఘర్షణ పడిన జీవితాలను సాహిత్యంలో కొంతమేరకి చదివాము. కానీ విశాఖపట్నం నడిబొడ్డున ఉన్న బర్మాకేంపు కాందిశీకుల జీవితాలలో ప్రత్యేకమైనది. తన బాల్యాన్ని అక్కడ గడిపిన **హరి వెంకట రమణ** ఆ కాలాన్ని నమోదు చేస్తూ 'బర్మాకేంపు కథలు' రాశారు. వస్తురూప వైవిధ్యం రీత్యా కొత్త చేర్పునిచ్చిన ఈ కథకునితో ముఖాముఖి.

ఇంటర్వ్యూ ■ కె.ఎన్. మల్లీశ్వరి



బర్మాకేంపులో తిరుగాడిన బాలుడిని సాహిత్యంలోకి తేవడానికి ఎలాంటి ప్రయత్నం చేసారు?

గట్టి ప్రయత్నమే చేసాను. నాదసలు జీవితమే కాదు, రాసేది సాహిత్యమే కాదు అనే స్థాయి నుంచి, ఇది కదా రాయాల్సింది అని తెలుసుకోవడానికి చాలాకాలం పట్టేసింది. అప్పుడు ఈ కథల్లోని బాలుడు సాహిత్యం లోకి రాక తప్పింది కాదు– ఇల్లిల్లూ తిరిగిన అనుభవాలు, అధోలోకపు జీవులతో పరిచయం వల్ల సాహిత్యంలోకి అతన్ని తీసుకురాక తప్పింది కాదు. చెప్పింది బాలుడి జీవితం నుంచే కానీ చెప్పిందంతా బర్మాకేంపులోని పెద్దల జీవితాలు, పాటలు, చావులు, నీళ్ల, రౌడీలు, ఉద్యమాలు, తగలబడిన పాకలు. అయితే విషాదాన్ని గెడ్డ అడుగున మట్టిలా ఉంచి తేటనీరు ప్రవహించినట్లుగా చిన్నపాటి హాస్యం, వ్యంగ్యంతో కథలు చెప్పే ప్రయత్నం చేసాను. రాస్తున్న ప్రతిసారీ దృశ్యప్రధానంగా ఉందా లేదా అనే కొట్టుకులాడాను. ఒకప్పుడు బర్మాకేంపుకి వస్తావా అంటేనే ఆటోవాళ్ళు భయపడి రాని ఊరు అది. అక్కడింత వైవిధ్యం గల మనుషులు, జీవితాలు వుంటాయని చెప్పడం; పిల్లాడి మనస్తత్వంతో ఎటువంటి జడ్జిమెంట్ లేకుండా కథలు చెప్పాలనుకోవడం; అన్వేషణ, ప్రశాంతత, నింపాదితనం అదే ఈ బర్మాకేంపు బాలుడిని సాహిత్యంలోకి లాక్కొచ్చింది.

మీ బాల్య జ్ఞాపకాలు రాయాలని ఎందుకు అనుకున్నారు?

బర్మాకేంపు జీవితాన్ని నమోదు చేయాలనుకున్నాను. కన్న ఊరికే కాందిశీకులైనవారి గురించి రాయాలనుకున్నాను. కానీ ఎలా చెప్పాలన్నది పెద్దసమస్య. మనసాహిత్యంలో పేదవాళ్ళు, శ్రామికులు, కిందిలోకపు జీవితాలను రాయాలంటే వాళ్లకు వున్న కష్టాలు చాలక ఇంకొన్ని కష్టాలు కల్పించడం చూసాను. నల్లబై గ్రామాల వూరు కంచర పాలానికి శివారు అయిన స్మశానానికి ఆవల ఇచ్చిన స్థలంలో అందమైన ద్రావిడ సంప్రదాయాన్ని నిర్మించుకున్న శ్రామికుల ఊరు గురించి రాసేను. ఉత్తరాంధ్రలో వున్న ఒక గొప్ప సంస్కృతి ఏమిటంటే ఏదుంటే అది తింటారు, తిన్నదానితో వుంటారు, పనుంటే చేస్తారు, లేదా కాలక్షేపం చేస్తారు కానీ పిరికిగా చావరు. ఎన్ని కష్టాలు వొచ్చినా ఉత్సవ వసంతం వాళ్ళ జీవితాల్లోకి ఆహ్వానిస్తారు. ఇదంతా అందరితో పంచుకోడానికే రాశాను. జ్ఞాపకాలతో, బాల్యంతో కనెక్ట్ కాని వారు ఉండరు అనే నమ్మకంతో పిల్లవాడి దృష్టికోణంతో స్వచ్ఛంగా అతనికి తెలిసింది మాత్రమే చెప్పాను.



ఒకప్పుడు బర్మాకేంపుకి వస్తావా అంటేనే ఆటోవాళ్ళు భయపడి రాని ఊరు అది. అక్కడింత వైవిధ్యం గల మనుషులు, జీవితాలు వుంటాయని చెప్పడం; పిల్లాడి మనస్తత్వంతో ఎటువంటి జడ్జిమెంట్ లేకుండా కథలు చెప్పాలనుకోవడం; అన్వేషణ, ప్రశాంతత, నింపాదితనం అదే ఈ బర్మాకేంపు బాలుడిని సాహిత్యం లోకి లాక్కొచ్చింది.

బర్మాకేంపు మానవసంబంధాలలో మీరు గుర్తించిన పరిణామం ఏమిటి?

ఒకప్పటి సమష్టితత్వం ఇప్పుడు లేదు. నూకాలమ్మ తల్లి కాస్త నూకాంబిక అయ్యింది. బయట నుంచి వచ్చినవాళ్ళు కొన్న ఆ కొంచెం స్థలంలో మూడంతస్తుల ఇళ్లు కట్టారు, అద్దెలకిచ్చారు. కొత్తగా వొచ్చిన వాళ్ళకి కాందిశీకులంటే తెలీదు. ఇప్పుడక్కడ అభ్యుదయ ఉద్యమాలు చేసేవాళ్ళు లేరు. వాళ్లంతా కాలనీలకు, సౌకర్యంగా వున్న ప్రదేశాలకు తరలిపోయారు. చాలా చర్చిలు వచ్చాయి. ఒకప్పుడు ఊరందరికీ ఒక్క గుడే ఉండేది ఇప్పుడు కొత్త గుడులు వొచ్చాయి. జనం ఇప్పుడు కూడా కొట్టుకుంటున్నారు, కానీ తిరిగి కలుసుకోవటం లేదు. ఒకప్పుడు విశాలమైన ప్రదేశంలో అగ్నిగుండం తొక్కేవారు ఇప్పుడు దానికి స్థలమే లేదు. స్మశానం బయట అందమైన పెయింటింగులు వొచ్చాయి కానీ స్మశానంలోని పొగమాత్రం అందరిముక్కుల్లోకి ప్రతిరోజూ దూరుతుంది, ఇప్పటి వినిమయ సంస్కృతిలాగ. అయినా నగరంలో బ్రతకడానికొచ్చిన వాళ్ళని బర్మాకేంపు నేనున్నానని ఇంకా చేరదీస్తుంది.

ఈ కథలు రాయటం మీపై ఎలాంటి ప్రభావం చూపింది?

బర్మాకేంపు, ఒక జీవితాన్ని శ్రామికుల దృష్టితో ఎలా చూడాలో నేర్పింది. ద్రావిడ సంస్కృతి అంటే ఏంటో ప్రత్యక్షంగా చూపించింది. ప్రజల పట్ల, జీవితంపట్ల ఉండాల్సిన దృష్టి ఏంటో అర్థమయ్యేలా చెప్పింది. కొన్నిసార్లు గెలుస్తాము, చాలా సార్లు ఓడిపోతాము. 'అయితే ఏంటి' అన్న ధీమా ఇచ్చింది. ఈ వెలుగులో తర్వాత రాసిన 'మాబడి కథలు' అభ్యుదయ కుటుంబాలలో వున్న పిల్లవాడి ప్రభుత్వ పాఠశాల అనుభవాలు, మానవ సంబంధాల్లో పైకి కనపడని కులం ఇతర డైనమిక్స్ ఎలా వుంటాయో చెప్పేవి. 'పెందుర్తి.ORG కథలు' ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ. మధ్యతరగతి కుటుంబాలలో తెచ్చిన మార్పులను రికార్డు చేసేవి. మనుషుల్ని ప్రేమించడం, నిమ్మళత్వం, హక్కు కోసం కొట్లాడటం అనే తాత్విక భూమిక మాత్రం బర్మాకేంపుదే. ■

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
సోమవారం 7 ఏప్రిల్ 2025

నేడు బల్దియాలో ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 06 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

రాములోరి పెళ్లికి ఊరంతా పందిరి..

నేత్రపర్వంగా జానకీరాఘవుల కల్యాణం

7

- ఆలయాలు, ఆశ్రమాలు, మఠాల్లో నేత్రపర్వంగా వేడుకలు
- అభిజిత్ లగ్న సుముహూర్తంలో తలంబ్రాలు
- అపర మిథిలా నగరంగా శోభిల్లిన ఓరుగల్లు
- ఊరూవాడా ఎక్కడా చూసినా పెళ్లి సందడే..
- ప్రసాదంగా వడపప్పు, బెల్లం పానకం పంపిణీ
- వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ప్రజలు

దశరథ నందనుడు.. జానకీ వల్లభుడు అయిన రామచంద్రుడి కల్యాణం ఆద్యంతం నయనా నందకరంగా సాగింది. ఆదివారం నవమి పర్వ దిన శుభ గడియలో అభిజిత్ లగ్న సుముహూర్తాన వేద మంత్రాల మధ్య శ్రీసీతారాముల పరిణయ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆకాశ మంత పందిరి.. భూదేవంత పీట వేసినట్లు వాడవాడలా శ్రీరామనవమి పర్వదిన వేడుకలు అత్యంత వైభవోతంగా సాగాయి. కొబ్బరి మట్టలు, అరటి చెట్లతో కల్యాణ మండపాలను అందంగా తీర్చిది ద్దారు. సీతా లక్ష్మణ ఆంజనేయ సహిత రామచంద్రప్రభు విగ్రహాలతో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అర్చక స్వాములు వైభవంగా జరిపించారు. రామాలయాలు, కల్యాణ ప్రదేశాలు పెళ్లిసందడితో శోభను సంతరించుకున్నాయి. కల్యాణ వేడుకల్లో పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు చలువ పందిళ్లు వేసి తాగునీటి సౌకర్యం కల్పించారు. అన్ని చోట్ల దాదాపు అన్నదానాలు నిర్వహించారు. కల్యాణ సమయంలో భక్తులకు మజ్జిగ, బెల్లం పానకాన్ని పంపిణీ చేశారు. శ్రీరామ నవమి సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఇంటింటా పండుగ వాతావరణం నెలకొంది.

- హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్





రెవెన్యూ కాలనీలో భక్తులకు తాళి చూపెడుతున్న అర్చకుడు

శ్రీనివాస కాలనీలోని అభయాంజనేయ ఆలయంలో పూజలందుకుంటున్న రాముడు, సీతాదేవి ఉత్సవ విగ్రహాలు



రెవెన్యూ కాలనీలో జరిగిన కల్యాణంలో పాల్గొన్న భక్తులు



హనుమకొండలోని రెవెన్యూ కాలనీలో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి



రానున్న రోజులు బీజేపీవే

- పార్టీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి
- ఘనంగా బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి

రాంనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న రోజులు బీజేపీ పార్టీవేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. భారతీయ జనతాపార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం హంటర్‌రోడ్‌లోని జిల్లాపార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌రెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటులో ఇతరపార్టీలు మద్దతు ఇచ్చినప్పటికీ ఒకే ఒక ఓటుతో ప్రధాన మంత్రి పదవిని, కేంద్ర ప్రభుత్వాన్ని వదులుకున్న చరిత్ర బీజేపీ పార్టీకి ఉందన్నారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో అయోధ్య రామ మందిర నిర్మాణం, ట్రిపుల్ తలాక్ రద్దు, ఆర్టికల్ 370 రద్దు, వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లులు దేశ ప్రజల కోసం తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మార్తినేని ధర్మారావు, రావు పద్మ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, అమరేందర్‌రెడ్డి, సరోత్తమ్ రెడ్డి, మధుసూధన్‌రావు, శ్రీకాంత్, శ్రీనివాసు, సత్యనారాయణ, సంపత్‌రెడ్డి, శ్రీనివాస్, నానునాయక్, జైపాల్ రెడ్డి, జన్ను మధు పాల్గొన్నారు.

చిన్నారులకు నేత్ర పరీక్షలు

అంగన్వాడీ కేంద్రాల్లో నేటి నుంచి ఆరంభం

- రెండు నెలల పాటు వ్యాధుల నిర్ధారణ
- అవసరమైతే అద్దాల పంపిణీ
- సన్నద్ధమైన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ



హనుమకొండ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు కంటి పరీక్షల నిర్వహణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా సోమవారం నుంచి హనుమకొండ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లోని 0-6 సంవత్సరాల పిల్లలకు పరీక్షలు జరుగుతాయి. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ్ బాల సురక్ష కార్యక్రమం ద్వారా పరీక్షల నిర్వహణ తలపెట్టారు. అంగన్వాడీ కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ కార్యక్రమానికి మరో వైపు మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు కూడా సన్నద్ధమయ్యారు.

నేటి నుంచి ఆరంభం

అంగన్వాడీ కేంద్రాల్లోని 0-6 ఏళ్ల పిల్లలకు నిర్వహించే కంటి చూపు పరీక్షలు సోమవారం నుంచి జిల్లాలో ఆరంభం కానున్నాయి. జూన్ వరకు నేత్ర పరీక్షల కార్యక్రమం కొనసాగుతుంది. జిల్లాలోని పరకాల, భీమదేవరపల్లి, హనుమకొండ ప్రాజెక్టుల్లో మొత్తం 788 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. రోజు వారిగా ప్రణాళిక మేరకు సెంటర్లలో వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారు.

వ్యాధుల నిర్ధారణ.. అద్దాల పంపిణీ

నేత్ర పరీక్షల్లో వ్యాధులను గుర్తిస్తారు. ఈ మేరకు అవసరమైన చికిత్స పద్ధతులను నిర్ధారిస్తారు. పిల్లలకు కంటి అద్దాలు అవసరమైతే ఆ మేరకు కళ్లజోళ్లను కూడా అందించే చర్యలు చేపడతారు. ఇక ఇంకా తీవ్ర సమస్యలు ఉన్నటైతే ఆ మేరకు కూడా చికిత్సలు జరుపనున్నట్లు అధికారులు చెబుతున్నారు. చిన్నతనంలోనే సమస్యలు గుర్తించినట్లైతే పిల్లల్లో చూపు మందగించడాన్ని అరికట్టవచ్చనే ప్రధాన ఉద్దేశంతో నేత్ర పరీక్షలను ప్రభుత్వం చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. గర్భిణులు, బాలింతలకు కూడా పిల్లల నేత్ర పరిరక్షణ, ఆరోగ్య సూత్రాల పాటింపుపై కూడా అవగాహన కల్పిస్తారు.

పోషణ్ ట్రాకర్ కష్టాలు


- ఏడేళ్ల కిందటి 2జీబీ ర్యామ్ ఫోన్లే దిక్కు
- అంగన్వాడీ టీచర్ల సహనానికి పరీక్ష
- లబ్ధిదారుల వివరాల నమోదులో జాప్యం

7

చదువులో వెనుకబడిన విద్యార్థులే లక్ష్యంగా..

సర్కారు బడుల్లో కృత్రిమ మేధ విద్య

- అభ్యసనా సామర్థ్యాల పెంపే ధ్యేయం
- ప్రాథమిక తరగతి విద్యార్థులకు బోధన
- ప్రతీ పాఠశాలకు ఐదేసి కంప్యూటర్లు
- వచ్చే జూన్ నుంచి అన్ని స్కూళ్లలో విద్య



హనుమకొండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాన్ని పెంచడానికి విద్యాశాఖ కృత్రిమ మేధను ప్రవేశపెట్టింది. చదువులో వెనుకబడిన విద్యార్థులు ఇంగ్లీష్, లాంగ్వేజ్‌లలో మిగతా విద్యార్థులతో సమానంగా రాణించడానికి ఈ అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా పాఠ్యాంశాల బోధన కంప్యూటర్ ద్వారా జరుగుతుంది. విద్యార్థుల సామర్థ్యాన్ని అర్టిఫిషియల్ ఏజెన్సీ గుర్తించి ఆ మేరకు వర్క్‌షీట్లను రూపొందిస్తుంది. వాటిని పూర్తి చేయడం ద్వారా విద్యార్థులు తమ అభ్యసనా సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోగలుగుతారు. ఒక విధంగా చెప్పాలంటే తరగతి గదిలో ఒక విద్యార్థి అభ్యసనా సామర్థ్యాన్ని ఉపాధ్యాయులకు బదులు అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ గుర్తిస్తుంది. ఆ మేరకు బోధన చేస్తుంది.

ప్రాథమిక పాఠశాలల్లో..

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కంప్యూటర్ల సాయంతో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) ద్వారా పాఠ్యాంశాలు బోధించాలని నిర్ణయించింది. ఒక్కో జిల్లాలో ఎంపిక చేసిన 10 నుంచి 15 ప్రాథమిక పాఠశాలల్లో కృత్రిమ మేధ ద్వారా పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ఈ విధానం మంచి ఫలితాలను ఇస్తుండటంతో అన్ని ప్రాథమిక పాఠశాలల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 50 మంది విద్యార్థులు దాటిన అన్ని బడులకు ఐదు కంప్యూటర్లు అందచేయాలని నిర్ణయించారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే 10 కంప్యూటర్లను ఇవ్వనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈనెల 15 నుంచి ఈ పథకం ప్రారంభమైంది.

సులభ పద్ధతులను అనుసరించినా..

ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సామర్థ్యాల పెంపుపై కొంత కాలంగా ప్రభుత్వం దృష్టి నిలిపింది. ఇందుకోసం సులభతరమైన అనేక పద్ధతులను అమలు చేస్తున్నా ఫలితాలు ఆశించిన మేరకు రావడం లేదు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లోని బాలలు భాష, గణితంలో సామర్థ్యాలను చాటడంలో వెనుకబడిపోతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించిందుకు కృత్రిమ బోధనను అమలు చేయాలనే నిర్ణయం విద్యాశాఖ తీసుకున్నది. ప్రాథమిక తరగతుల్లో ఆంగ్లాన్ని చదవడంలో, గణితంలో చతుర్వి ప్రక్రియలను పూర్తి చేయడంలో వెనుకబడిపోతున్నారు. మూడేళ్లుగా ఈ పరిస్థితిని అధిగమించేందుకు తొలి మెట్టు కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నా ఆశించిన రీతిలో ఫలితం లేదు. వివిధ సర్వేల్లోనూ 50శాతానికి మించి సామర్థ్యాలను పిల్లలు చాటడం లేదనేది తేలింది. ఈ క్రమంలోనే విద్యాశాఖ కృత్రిమ మేధవైపు దృష్టి సారించింది. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు మెరుగైనా ప్రవేశాలు పెరగకపోవడం కూడా కృత్రిమ మేధను ఆశ్రయించడానికి ఒక కారణంగా కనిపిస్తోంది. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఏఐ ద్వారా అభ్యసనా సామర్థ్యాలను పెంచేందుకు ఏక్ స్టెప్ సంస్థ సహకారంతో ఈ ఏఐ బోధన ప్రక్రియను ప్రారంభించారు.

ప్రతీ తరగతికి 20 నిమిషాలు

గత నెల 15వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియలో బాలలు చదవడం, రాయడం, గణితంలో కొత్త సామర్థ్యాలను చాటుకుంటారని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఇప్పటికే కృత్రిమ మేధ ఆధారిత టూల్స్‌తో చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలను చయడం వంటివి నేర్చుకుంటున్నారు. ప్రతీరోజు ఇంగ్లీష్, లాంగ్వేజెస్‌లలో 20 నిమిషాల చొప్పున కృత్రిమ మేధ తరగతులను నిర్వహిస్తున్నారు. దీనికితోడు వచ్చే విద్యా సంవత్సరం నుంచి 1-5 తరగతులకు ఇంటిగ్రేటెడ్ గణితాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులు, సీఆర్పీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నారు.

పాఠశాలలు ఎంపిక

కృత్రిమ మేధ తరగతులకు హనుమకొండ జిల్లాలో 9, వరంగల్ జిల్లాలో 11 పాఠశాలను ఎంపిక చేశారు. హనుమకొండ జిల్లాలో వాస్తవానికి పది పాఠశాలలు ఎంపిక కాగా, సాంకేతిక కారణాల వల్ల ఒక పాఠశాలల్లో ఏఐ తరగతులు ప్రారంభం కాలేదు. మిగతా తొమ్మిది పాఠశాలల్లో నడుస్తున్నాయి. హనుమకొండ జిల్లాలో భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి, ముల్కనూరు, ధర్మసాగర్ మండలంలోని దేవునూరు, హనుమకొండ మండలంలోని కుమార్‌పల్లి ప్రభుత్వ పాఠశాల, హసన్‌పర్తి మండలంలోని దేవన్నపేట, మడిపల్లి, నాగారం, ఐనవోలు మండలంలోని కక్కిరాలపల్లి, పరకాల మండలంలోని నాగారం పాఠశాలలు కృత్రిమ మేధ తరగతులకు ఎంపిక అయ్యాయి. వరంగల్ జిల్లాలో చెన్నారావుపేట మండలంలోని లింగాలఘనపురం, జల్లి, పాపయ్యపేట, గీసుకొండ మండలంలోని మచ్చాపురం, నర్సంపేట మండలంలోని మహేశ్వరం, పర్వతగిరి మండలంలోని గోపన్నపల్లి, రాయపర్తి మండలంలోని కొలనుపల్లి, మైలారం, ఊకలు, తిరుమలాయపల్లి, కత్రాపల్లి ఎంపికయ్యాయి. ఈ మేరకు శిక్షణ కోసం ఎంపికైన ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లో ఒక రోజు శిక్షణ ఇచ్చారు. జూన్ నుంచి అన్ని ప్రాథ మిక పాఠశాలల్లో కంప్యూటర్లను ఏర్పాటు చేయనున్నారు.



సీతారామ కల్యాణోత్సవంలో అపశ్రుతి

- వల్మిడిలో గాలి దుమారానికి కూలిన టెంట్
- పలువురు భక్తులకు స్వల్పగాయాలు

పాలకుర్తి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వల్మిడి దేవస్థానంలో శ్రీ రామనవమి వేడుకల్లో ఆదివారం అపశ్రుతి చోటుచేసుకుంది. కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని నిర్వాహకులు భోజనాలకు తగిన ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం భక్తులు టెంట్ కింద భోజనాలు చేస్తుండగా ఒక్కసారిగా గాలి దుమారం వచ్చింది. ఆ సమయంలో టెంట్ల కింద సుమారు 300మంది వరకు భోజనాలు చేస్తున్నారు. టెంట్ సపోర్టు కోసం ఏర్పాటు చేసిన ఇనుపరాడ్లు భక్తుల మీద పడడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో వల్మిడికి చెందిన వాసూరి మారమ్మ, పెద్దవంగర మండలం గంట్లకుంటకు చెందిన పాలయి సంధ్య, చెన్నూరుకు చెందిన విద్యార్థి మారబోయిన మనుశ్రీలు గాయపడ్డారు. ఓ మహిళపై టెంట్‌కు సంబంధించిన ఇనుప పైపులు పడడంతో రక్తస్రావంతో విలవిలలాడారు. క్షతగాత్రులను పాలకుర్తి ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి ఆధ్వర్యంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరం వద్దకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నిర్వాహకుల నిర్లక్ష్యం

వేడుకలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని తెలిసి కూడా నిర్వాహకులు ఆస్థాయిలు ఏర్పాట్లు చేయలేదంటూ భక్తులు ఆరోపించారు. రాష్ట్రంలోని పలు జిల్లాలో గాలి దుమారంతో కూడిన వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించినా నిర్వాహకులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. టెంటు కూలడంతో భక్తులు భోజనాలు చేయకుండానే వెళ్లిపోయారు.

8న జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్ హాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి పి.రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-19 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో 1జనవరి 2007 నుంచి 31డిసెంబర్ 2008 సంవత్సరం మధ్యకాలంలో జన్మించిన వారు అర్హులని ఆయన వెల్లడించారు. ఇక్క డ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీల్లో సికింద్రాబాద్‌లోని లాలాపేటలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని రాజేందర్ పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు ఈ నెల 8వ తేదీన హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్లో ఉదయం 7గంటలకు రిపోర్టు చేయాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ 9959711609 నెంబరులో సంప్రదించాలని రాజేందర్ కోరారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న బుకీ అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బుకీని పోలీసులు అరెస్ట్ చేసి, రూ.లక్షా యాభై వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పది రోజుల కిందట హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పద్మాక్షి కాలనీలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ పాల్పడుతున్న హైదరాబాద్‌కు చెందిన చింతపండు కృష్ణ, మేడిశెట్టి నరేష్, హనుమకొండకు చెందిన ఆటగాళ్లు పులి ఓంకార్, పల్లపు సురేష్‌లను అరెస్ట్ చేసి, రూ.1,58,000 నగదును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. అరెస్ట్ అయిన వ్యక్తులు కాకినాడకు చెందిన వీరమనికుమార్ అలియాస్ పండు పేరును విచారణలో వెల్లడించారు. ఆదివారం వీరమనికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా గోవాకు వెళ్లినపుడు హైదరాబాద్‌కు చెందిన యోగేష్ గుప్తా పరిచయం అయ్యాడని, క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నపుడు ఆన్‌లైన్ బెట్టింగ్ చేస్తే లాభంలో తొమ్మిది శాతం వాటా ఇస్తానని చెప్పి రాధా ఎక్సేంజ్ యాప్ గురించి వివరించి దాని యూసర్ నేమ్, పాస్‌వర్డ్ ఇచ్చారన్నారు. ఈ మేరకు పండు బ్యాంకు అకౌంట్ నెంబర్‌తోపాటు తన స్నేహితుడి అకౌంట్ నెంబర్ ఇవ్వడంతో ఇప్పటివరకు బెట్టింగ్ ద్వారా రూ.5కోట్లు అకౌంట్‌లో జమ అయ్యాయి. రూ.3కోట్లు యోగేష్‌కు ఇచ్చి రూ.కోటి ఆటగాళ్లకు ఇచ్చి మిగిలిన రూ.కోటి పండు తీసుకుని కాకినాడలో ఇంటిని నిర్మించుకుని రెండు వైన్ షాపులు ఏర్పాటు చేసుకున్నాడు. కాగా, ఈ ఘటనలో ప్రధాన బుకీ యోగేష్ గుప్తాతోపాటు హనుమకొండకు చెందిన మరో ఆటగాడు కేతిరి రంజిత్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐ సతీష్ కుమార్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

గ్రూప్-1లో మెరిసిన హసన్‌పర్తి వాసి


తల్లిదండ్రులతో పవన్

మల్టీజోన్-1లో 171, రాష్ట్రస్థాయిలో 461వ ర్యాంకు

హసన్‌పర్తి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో హసన్‌పర్తికి చెందిన పోతరాజు విజయలక్ష్మి-రమేష్ దంపతుల ఏకైక కుమారుడు పవన్ అత్యంత ప్రతిభకనబర్చి 456.5 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 461వ ర్యాంకు, మల్టీజోన్-1లో 171వ ర్యాంకు, ఎస్సీ కేటగిరిలో 15వ ర్యాంకు సాధించాడు. పవన్ తల్లి విజయలక్ష్మి ప్రైవేటు ఉపాధ్యాయురాలు కాగా, తండ్రి రమేష్‌బాబు ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అతిసామాన్య కుటుంబంలో జన్మించిన పవన్ చిన్న తనం నుంచే చదువులో రాణిస్తూ మూడు సార్లు సివిల్స్ మెయిన్స్ వరకు చేరుకున్నాడు. 2023లో అగ్నిమాపక అధికారిగా ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఆయన చొప్పదండిలో విధులు నిర్వహిస్తున్నారు. పవన్ 10వ తరగతి వరకు కరీంనగర్ జిల్లాలోనే కొనసాగగా హైదరాబాద్ నారాయణ కాలేజీలో ఇంటర్, అనంతసాగర్ ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశాడు.

సివిల్స్ సాధించడమే లక్ష్యం :

పోతరాజు పవన్



చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు కష్టపడి చదివించారు. అమ్మానాన్నల కష్టాలను అర్థం చేసుకొని ఎలాగైనా సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి చదివాను. మూడు సార్లు సివిల్స్ మెయిన్స్ వరకు వెళ్లాను. 2023లో అగ్నిమాపక శాఖలో ఎస్సైగా పోస్టింగ్ వచ్చింది. అంతటితో సంతృప్తి చెందలేదు. ఎలాగైనా సివిల్స్ సాధించాలనే ఉద్దేశ్యంతో చదువును కొనసాగించాను. తల్లిదండ్రుల ప్రోత్సాహమే మనోధైర్యాన్ని కల్పించింది.

దేవునూరు భూములపై జాయింట్ సర్వే

హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ముప్పారం, దేవునూరు గ్రామాలకు సంబంధించిన వివాదాస్పద భూములను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు జాయింట్ సర్వే చేసినట్లు హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామాలకు చెందిన రైతులు సమస్య పరిష్కరించాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా.. ఎమ్మెల్యే కలెక్టర్‌కు సమస్య పరిష్కరించాలని వినతి ఇవ్వగా.. కలెక్టర్ ఆదేశాలతో సర్వే చేసినట్లు తెలిపారు. సర్వే రికార్డుల పరిశీలనలో అటవీశాఖ 60 ఏళ్ల కిందట ఇనుపరాతి గట్లు రిజర్వ్ ఫారెస్టు బ్లాక్ ఏర్పాటు చేయడం కోసం ముప్పారం, దేవునూరు, ఎర్రబెల్లి, దామెర, కొత్తపల్లి గ్రామాల పరిధిలో 3750 ఎకరాల విస్తీర్ణంతో ప్రతిపాదనలు తయారు చేశారని, ఆ తర్వాత అటవీ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో చేసిన జాయింట్ సర్వేలో ఆయా గ్రామాల పరిధిలో 3,956 ఎకరాల విస్తీర్ణంలో అటవీశాఖ ఇనుపరాతి గట్లు ఫారెస్ట్ బ్లాక్ ఏర్పాటు కోసం భూములను తమ ఆధీనంలో ఉన్నట్లుగా నిర్ధారించినట్లు తెలిపారు. ఈ సర్వేలో ముప్పారం గ్రామంలోని సర్వే నెంబర్ 213, 214, 215, 216, దేవునూరు గ్రామంలోని సర్వే నెంబర్ 403, 404లోని భూములు అటవీశాఖ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో లేని భూములు అయినప్పటికీ ఈ పట్టా భూములను విస్తీర్ణం 43.38గుంటల భూమి అటవీశాఖ ఆధీనంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ సర్వే రిపోర్టు కలెక్టర్‌కు నివేదించామని, త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని ఆర్డీఓ ఆ ప్రకటనలో తెలిపారు.

కేయూ నుంచి విడిపోతున్న కళాశాల

ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ వర్సిటీగా ఏర్పాటు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలకు బంధం తీరిపోయింది. భద్రాద్రి కొత్తగూడెంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ వర్సిటీగా కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ యోగితా రాణా ఉత్తర్వులు వెలువరించారు.

కాగా, కేయూకు ఇప్పటి వరకు అనుబంధంగా కొనసాగిన కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో మైనింగ్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాలున్నాయి. ఆయా విభాగాల్లో సుమారు 950 మంది విద్యార్థులు ఏటా సీట్లు సాధించి చదువుతున్నారు. కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల మొదట హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీకి అనుబంధంగా ఉండేది. 1996లో కాకతీయ యూనివర్సిటీకి అనుబంధ కళాశాలగా మారింది. దాదాపు 29 ఏళ్లుగా కాకతీయ యూనివర్సిటీకి కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల అఫిలియేటెడ్ కళాశాలగా నడిస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేస్తూ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణగా మార్చడంతో కేయూతో ఉన్న అనుబంధం వీడనుంది.

కాగా, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలకు ప్రభుత్వం 41 అధ్యాపక పోస్టులను మంజూరు చేయగా, అందులో 14 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారు. అలాగే బోధనేతర పోస్టులు 106 ఉండగా, అందులో 55 మంది పనిచేస్తున్నారు. ప్రస్తుతం కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు కాకతీయ యూనివర్సిటీ ధృవపత్రాలను అందచేయనుండగా రానున్న విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు నూతనంగా ఏర్పడిన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ధ్రువపత్రాలను జారీ చేయనుంది.

అక్రమంగా మొరం తరలిస్తున్న వాహనాలు స్వాధీనం

మడికొండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మడికొండ ఎస్సై పెగడ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం రాంపేట శివారులో ప్రభుత్వ అనుమతి లేకుం డా అక్రమంగా మొరం మట్టి తవ్వి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై పెగడ రాజ్‌కుమార్ పోలీస్ కానిస్టేబుళ్లు సీహెచ్. మోహన్‌రావు, డి.గోవర్ధన్‌తో కలిసి వెళ్లి పరిశీలించగా ఓ డోజర్‌తో టిప్పర్‌లో కొందరు వ్యక్తులు మట్టి లోడ్ చేస్తున్నారు. వెంటనే వాహనాలను స్వాధీనం చేసుకొని కరీమాబాద్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ గాజ దిలీప్, డోజర్ డ్రైవర్ నల్లబెల్లికి చెందిన గోలి రాజేష్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీతారాముల కల్యాణోత్సవంలో స్థాన భేదాలు

మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌కు అవమానం


వేడుకలకు దూరంగా వేసిన బెంచీపై మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమిని పురస్కరించుకుని వర్ధన్నపేట పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహించిన కల్యాణ వేడుకల్లో నిర్వాహకులు తరతమ భేదాలు ప్రదర్శించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీతారాముల కల్యాణం సందర్భంగా పట్టణం పరిధిలోని, శివారు గ్రామాల నుంచి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు వేడుకలకు హాజరయ్యారు. కులాలకతీతంగా నిర్వహించే ఈ వేడుకలు ఈ దాతల విరాళాలతో నిర్వహిస్తుండగా ఆదివారం నాటి కల్యాణ మహోత్సవంలో కొందరికే ప్రత్యేకంగా కుర్చీలు వేయడం, మాజీ ఎమ్మెల్యే, ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులను ఉద్దేశ్యపూర్వకంగా అవమానించేలా వారిపట్ల వ్యవహరించడం తీవ్ర చర్చనీయాంశమైంది.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌కు స్థానం కల్పించకపోవడంపై ఆయన కినుక వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేవాలయంలో అందరూ సమానులేనని, నిర్వాహకులు నూతన సంప్రదాయానికి తెరతీస్తూ ప్రత్యేకంగా కుర్చీలు వేసి సన్మానించడం ఏమిటని ప్రశ్నించారు. కల్యాణ మహోత్సవం ఖర్చు విరాళాలతో నిర్వహిస్తుండగా కొందరి ప్రత్యేక జోక్యం సరికాదన్నారు. ఆలయానికి శాశ్వత కమిటీని ఏర్పాటు చేసి నిర్వహణలోనే వేడుకలు జరిపించాలన్నారు. ఇదిలా వుండగా, ఈ అంశంపై వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పందించారు. దేవుడి కార్యక్రమంలో దళిత నాయకులను అవమానించడం సరికాదన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

మరొకరికి తీవ్రగాయాలు

హసన్‌పర్తి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగట్టుగుట్ట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయానికి చెందిన ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థి రామటెంకి ఉదయ్ (19) మృతి చెందగా, అతడి స్నేహితురాలు వ్యవసాయ కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ విద్యనభ్యసిస్తున్న ఖమ్మం జిల్లా దొండపాడు మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన రాంశెట్టి బాబురావు కూతురు రాంశెట్టి రజితకు తీవ్రగాయాలయ్యాయి. కాగా, మృతుడి తండ్రికి నలుగురు సంతానం. ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఇన్‌స్పెక్టర్ పట్టి చేరాలు, మృతుడి తండ్రి శ్రావణ్ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం శ్రీరాంపూర్ ఆర్‌కే-6 కాలనీకి చెందిన రామటెంకి శ్రావణ్ - పుష్పలత దంపతుల పెద్ద కుమారుడు రామటెంకి ఉదయ్ (19) అనంతసాగర్ ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ట్రిపుల్ ఈ చదువుతున్నాడు. ఆదివారం ఎస్సార్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాలకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థిని రాంశెట్టి రజితను తన బైక్‌పై ఎక్కించుకొని ఆదివారం వరంగల్ భద్రకాళి దేవాలయం బయలుదేరారు. ఈ క్రమంలో మార్గ మధ్యంలో హసన్‌పర్తి నల్లగట్టుగుట్ట సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న గూడ్స్ వాహనం వేగంగా ఢీకొట్టింది. దీంతో రామటెంకి ఉదయ్‌తో పాటు ఖమ్మం జిల్లా దొండపాడు మండలం చింతలపాలెంకు చెందిన రాంశెట్టి బాబురావు పెద్ద కూతురు రాంశెట్టి రజితకు తీవ్రగాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్ వాహనానికి సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది గాయపడిన వీరికి ప్రాథమిక చికిత్స అందించి ఎంజీఎంకు తరలించగా అప్పటికే ఉదయ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం రాంశెట్టి రజిత పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి ఆటో డ్రైవర్ శ్రావణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పట్టి చేరాలు తెలిపారు.


మృతి చెందిన ఉదయ్


గాయపడిన రజిత

సీడ్ కంపెనీ మోసం

బాధిత రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

పర్వతగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఓ సీడ్ కంపెనీకి చెందిన వ్యక్తులు తమను మోసం చేశారంటూ మండలంలోని రావూరు రైతులు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత వర్షాకాలంలో ఓ బయో సీడ్ కంపెనీకి చెందిన కొందరు వ్యక్తులు రైతుల వద్దకు వచ్చారు. వారి కంపెనీకి సంబంధించిన బాసుమతి వరివిత్తనాలను వేస్తే అధిక దిగుబడి వస్తుందని నమ్మించారు. అయితే వారి మాటలు నమ్మి రావూరు గ్రామానికి చెందిన 25 మంది రైతులు సుమారు 40 ఎకరాల్లో ఆ సంస్థకు చెందిన విత్తనాలు వేశారు. ఎకరానికి 8 నుంచి 12 క్వింటాళ్ల వడ్లు వస్తాయని చెప్పగా, 2 క్వింటాళ్ల వడ్లు కూడా పండకపోవడంతో సంబంధిత సీడ్ కంపెనీ ఉద్యోగులను రైతులు ప్రశ్నించారు. దీంతో కంపెనీ వ్యక్తులు రూ.50 విలువ గల బాండ్ పేపర్లో నష్టపోయిన రైతులకు రూ.50 వేలు చెల్లిస్తామని అగ్రిమెంట్ చేసి ఇచ్చారు. రోజుల గడుస్తున్నా వారికి అగ్రిమెంట్ ప్రకారం డబ్బులు చెల్లించక పోవడంతో పోలీసులను ఆశ్రయించారు.

ఈ విషయమై సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌ను వివరణ కోరగా, పోలీసులు స్టేషన్‌కు పిలిచిన మాట వాస్తవమేనన్నాడు. ఆ సంస్థలో ప్రస్తుతం తాను పనిచేయడంలేదని తెలిపారు. అందులో 5 నెలల కిందట పనిచేసిన మాట వాస్తవమే.. అయితే అగ్రిమెంటులో తమపై అధికారి సంతకం చేయాలని ఒత్తిడి చేయడంతో తాను సంతకం చేశానని అన్నారు. అయితే అగ్రిమెంటుకు తనకు ఎలాంటి సంబంధంలేదని తెలిపాడు. ఎస్సై ప్రవీణ్‌ను వివరణ కోరగా.. రైతులు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. ఈ క్రమంలో సంబంధిత కంపెనీలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను పిలిపించి మాట్లాడామని తెలిపారు. కొందరు రైతులకు డబ్బులు కొంత మేర చెల్లించినట్లు తెలిసిందన్నారు. కంపెనీ వారితో మాట్లాడి మిగిలిన వారికి న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తామని అన్నారు. రైతులు అత్యాశకు పోయి, ఎవరినిపడితే వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు.

ముగిసిన జిల్లాస్థాయి చెస్ పోటీలు


విజేతలకు ప్రశంసాపత్రాలను ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్ ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-19 బాలబాలికల విభాగంలో నిర్వహించిన ఈ టోర్నీ ముగింపు వేడుకలకు టీటీడీ కల్యాణ మండపం మేనేజర్ రఘువీర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములను సహజమన్నారు. క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఒక్కరోజు నిర్వహించిన చెస్ టోర్నీలో 40 మంది బాలబాలికలు పాల్గొన్నారన్నారు. క్రీడాకారులు మధ్య జరిగిన పోరులో బాలుర విభాగంలో రిత్విక్ గండు ప్రథమ స్థానం, సాయిజోషిత్ బొల్లం ద్వితీయ స్థానం, అక్షయ్‌కుమార్ తృతీయ, చకిలం చరణ్‌రాజ్‌లు నాలుగో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో తోట జాన్వీ ప్రథమ, దీపిక బొమ్మిడిని ద్వితీయ, వర్షిత పటూరి తృతీయ, కైరంకొండ సహస్ర నాలుగో స్థానాల్లో నిలిచి త్వరలో మంచిర్యాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీకి ఎంపికైనట్లు కన్నా తెలిపారు. ఆర్బిటర్లు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలో యువకుడి గల్లంతు


రహమాన్ (ఫైల్)

పర్వతగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకపాక గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో యువకుడు గల్లంతైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఎల్‌బీనగర్‌కు చెందిన నలుగురు స్నేహితులు పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్‌కు ఆటోలో వచ్చారు. తిరిగి హనుమకొండకు వెళ్తున్న క్రమంలో కొంకపాక శివారులోని కెనాల్ వద్దకు రావడంతో బట్టలకు మురికి అంటుకుందని, శుభ్రం చేసుకుంటానని రహమాన్ మిత్రులతో చెప్పడంతో కెనాల్ వద్ద ఆటోను నిలపారు. ఈ క్రమంలో రహమాన్ (28) ఆటో దిగి కెనాల్ వద్దకు వెళ్లి అందులో దూకాడు. రహమాన్‌ను కాపాడేందుకు అతడి స్నేహితుడు ఖలీమ్ ప్రయత్నించాడు. ఈ క్రమంలో అతడు కూడా కెనాల్‌లో కొట్టుకు పోతుండగా మిత్రులు సుమేర్, అఫ్రోజ్ ఖలీమ్‌ను కాపాడారు. అప్పటికే రహమాన్ కెనాల్‌లో కొట్టుకుపోయాడు. అతడి ఆచూకీ ఇంకా తెలియలేదు. కాగా, ఉదయం నుంచి రహమాన్ తన ప్రేమ విఫలమైందని, ఆత్మహత్య చేసుకుంటానని అన్నట్లు మిత్రులు ఎస్సైకు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

మొక్కజొన్న చేను దగ్ధం


నల్లబెల్లిలో దగ్ధమైన మొక్కజొన్న పంట

నల్లబెల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు మూడిక వీరన్న మొక్కజొన్న పంట చేను దగ్ధమైన ఘటన ఆదివారం చేసుకుంది. బాధిత రైతు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రైతు మూడిక వీరన్న రెండు ఎకరాల మొక్కజొన్న పంటను వేశాడు. మొక్కజొన్న పంట ఏపుగా పండి చేతికి వచ్చింది. దీంతో కొందరి గుర్తుతెలియని వ్యక్తులకు కన్ను కుంటి పంట చేను కాలపెట్టారు. ఆదివారం మధ్యాహ్నం మొక్కజొన్న పంట చేనులో ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. దీంతో రైతు లబోదిబో మంటూ స్థానికులకు, ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. అప్పటికే రెండు ఎకరాల మొక్కజొన్న పంట చేను మొత్తంగా కాలిపోయింది. అనంతరం ఘటన స్థలికి ఫైర్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది చేరుకొని పరిశీలించారు. బాధిత రైతు మూడిక వీరన్న రూ.80వేల పంట నష్టం జరిగిందని, దీనికి కారుకులైన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. అనంతరం బాధిత రైతు మూడిక వీరన్న ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ వెల్లడించారు.

ఇక్కడ 12 గంటల పనివేళలు

- తపాలా శాఖ వరంగల్ ప్రధాన కార్యాలయంలో సేవలు
- కేంద్రంలో ఆధార్ అప్‌డేట్, పోస్టల్ బ్యాంకింగ్, జీవితబీమా
- అందుబాటు చార్జీలతో విదేశాలకు పార్సిళ్లు

గిర్మాజిపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో ఉత్తరాలు, పార్సిళ్లు, బ్యాంకింగ్, జీవితాబీమా సేవలతో పాటు ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవచ్చు. విదేశాల్లో ఉన్నవారికి సైతం అవసరమైన మందులు, వస్తువులు అందుబాటు ధరలతో పార్సిళ్లు పంపవచ్చు. శిశువులకు బాల ఆధార్ ఇంటివద్దనే పోస్ట్‌మ్యాన్ ద్వారా ఉచితంగా పొందవచ్చు. రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసులు రోజుకు 8 గంటలు పనిచేస్తుంటే వరంగల్ హెడ్‌పోస్టాఫీసు 12 గంటలు పనిచేస్తూ ప్రజలకు మరింత విస్తృతంగా సేవలందిస్తోంది.

హెడ్ పోస్టాఫీసులో తపాలా సేవలివే..

రెవెన్యూ, పోస్టల్ స్టాంపుల విక్రయం, దేశ, విదేశాలకు ఉత్తరాలు, పార్శిళ్లు, ఇండియన్ పోస్టల్ బ్యాంకింగ్, తపాలా సేవింగ్స్, చిన్నమొత్తాల పొదుపు, తపాలా బీమా పథకాలు, ఇన్సురెన్స్ సేవలు అందిస్తున్నారు.

ఆధార్ సేవా కేంద్రం

వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో ప్రత్యేకంగా ఆధార్ సేవా కేంద్రం పనిచేస్తున్నది. ఇందులో కొత్తగా



వరంగల్ ప్రధాన తపాలా కార్యాలయం

ఆధార్ నమోదును ఉచితంగా చేస్తారు. ఆధార్ కార్డులో పేర్లు, ఇంటి పేర్లు, చిరునామా, పుట్టినతేదీ, ఫొటో, వేలిముద్రలు తదితర సవరింపులను ఆధార్ సంస్థ నిర్ణయించిన ఫీజులతో చేస్తున్నారు. పుట్టిన తేది సవరణకు విద్యాసంస్థ, మున్సిపల్ బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్టుల్లో ఏదైనా ఒకటి సమర్పించి అప్‌డేట్ చేసుకోవచ్చు. చిరునామా మార్పు కోసం వంట గ్యాసు/ విద్యుత్ బిల్లును సమర్పించాలి. అలాగే బయోమెట్రిక్ సవరణల కోసం ఫొటో, వేలిముద్ర లు, కనుపాపలు అప్‌డేట్ చేసుకునేందుకు 5 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల లోపు ఉచితంగా చేస్తారు. అలాగే 15 సంవత్సరాలు దాటిన వారికి రూ. 100 చార్జి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఆధార్ డౌన్‌లోడ్ చేసి కలర్ ప్రింట్ కోసం రూ.30 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం 10 సంవత్సరాలకు ఒకసారి ఆధార్‌కార్డును తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని ఆధార్ సంస్థ ప్రకటించడంతో ఆధార్ సెంటర్లలో రద్దీ పెరుగుతుంది. మీసేవ సెంటర్లలో ఆధార్ సేవల చార్జీలను రూ.100 నుంచి రూ.200 వసూలు చేస్తున్నారు. హెడ్‌పోస్టాఫీసులో ఆధార్ ఎన్‌రోల్ మెంట్, ఆధార్ అప్‌డేట్ రూ.50 నుంచి రూ.100 లోపు తీసుకుంటు న్నారు. ఆధార్ ఎన్‌రోల్, అప్‌డేట్ దేశాయిపేట పోస్టాఫీసులోను అందుబాటులో ఉంది. ఇంటి వద్దనే పోస్ట్‌మ్యాన్‌ల ద్వారానే 0 నుంచి 5 సంవత్సరాలలోపు శిశువులకు ఉచితంగా ఆధార్ తీసుకోవచ్చు.

విదేశీ పార్సిళ్ల ద్వారా ఆదాయం

విదేశాల్లో ఉంటున్నవారికి అవసరమైన వస్తువులు, మందులు, పిండివంటలు తదితర పార్సిళ్లను వరంగల్ హెడ్‌పోస్టాఫీసు ద్వారా పంపే సదుపాయం ఉంది. ప్రైవేట్ కొరియర్ సర్వీసుల కంటే తక్కువ చార్జీలుండటంతో ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ప్రతి అర కిలోకు అమెరికాకు రూ.1550, కెనడాకు రూ.1180, ఆస్ట్రేలియాకు రూ.975, యూకేకు రు.1570 చార్జి ఉంటుంది. గత సంవత్సరంలో ఈ కౌంటర్ ద్వారా 11 వేల పార్సిళ్లు పంపిస్తున్నారు. దీని ద్వారా తపాలా శాఖకు రూ. 53 లక్షల ఆదాయం వచ్చిందని తపాలాశాఖ అధికారులు తెలిపారు.

తపాలా బీమా పథకాలు

సామాన్య, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో వివిధ జీవిత, ప్రమాద బీమా పథకాలను తపాలాశాఖ అమలు చేస్తోంది. టాటా ఏఐజీ, నీవాబూపాల్, ఆదిత్య బిర్లా/ స్టార్/ బజాజ్ ఇన్సురెన్స్ కంపెనీల సహకారంతో రూ. 10 లక్షలు, రూ.5 లక్షల యాక్సిడెంటల్ బీమా పాలసీని అమలు చేస్తోంది. 18 నుంచి 65 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన వారు సంవత్సరానికి రూ.520, రూ.555రూ. 549రూ. 559రూ. 699లు చెల్లిస్తే రూ.10 లక్షల యాక్సిడెంటల్ బీమా పొందవచ్చు. అలాగే నీవాబూపాల్ రూ.755, ఆదిత్య బిర్లా రూ.749, స్టార్ ఇన్సురెన్స్‌కు రూ.799లు చెల్లించి రూ.15 లక్షల ప్రమాద బీమా సదుపాయం పొందవచ్చు. అలాగే రూ.320లు చెల్లిస్తే రూ.5 లక్షల యాక్సిడెంటల్ బీమా వర్తిస్తుందని తపాలా అధికారులు తెలిపారు. తపాలా ప్రమాద బీమా పథకాలు పేద, రోజువారి కూలీ పనులు చేసుకుంటున్న కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ప్రమాదవశాత్తు పాలసీదారుడు మృతి చెందితే ఆ కుటుంబానికి తపాలా బీమాలు ఆర్థికంగా రక్షణ కల్పిస్తున్నాయి. అలాగే ఇండియన్ పోస్టల్ బ్యాంకింగ్ ద్వారా సేవింగ్ అకౌంట్లు, డిపాజిట్ పథకాలతో పాటు పిల్లలకు సుకన్య సమృద్ధి యోజన, సీనియర్ సిటిజన్లు, మహిళల కోసం ప్రత్యేక డిపాజిట్, సేవింగ్స్, నెలవారీ ఆదాయం స్కీమ్‌లను తపాలాశాఖ అమలు చేస్తుంది. ఇందుకు సంబంధించిన అన్ని కార్యకలాపాలు హెడ్ పోస్టాఫీసులో ఉన్నాయి.

ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఓపెన్

వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పనివేళలు గతంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉండేది. ప్రజల ఇబ్బందులను గ్రహించిన తపాలా శాఖ తెలంగాణ ఉన్నతాధికారులు గత సంవత్సరం నుంచి వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పనివేళలను 12 గంటలు పనిచేసేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పనిచేస్తోంది. ప్రజలు రాత్రి వేళల్లోను పోస్టాఫీసు సేవలు పొందుతున్నారు.

తపాలా బీమా చేయించుకోండి

బి.రవికుమార్, తపాలా శాఖ వరంగల్ సూపరింటెండెంట్

అన్ని వర్గాల ప్రజలకు తపాలాబీమా పథకాలు చాలా మేలు చేస్తున్నాయి. ఏదైనా ప్రమాదంలో కుటుంబ యజమాని మృతి చెందితే ఆ కుటుంబం రోడ్డున పడకుండా కాపాడేందుకు తపాలా బీమా పథకం చాలా ఉపయోగపడుతుంది. పేదలు, రోజువారి కూలీలు, ఆర్థిక చేయూతలేని వారు తప్పకుండా తమ ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా తపాలా బీమా తీసుకోవాలి. తద్వారా వారి కుటుంబానికి మేలు జరుగుతుంది. ప్రతి ఒక్కరూ తపాలా బీమా చేయించుకుంటే బాగుంటుంది. తపాలా బీమా పథకాలను అన్ని వర్గాలు ఉపయోగించుకోవచ్చు. అలాగే అందుబాటు చార్జీలతో విదేశాల పార్సిళ్లు పంపించుకోవచ్చు. ఆధార్ సేవలనూ ప్రజలు వినియోగించుకోవాలి.



కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక

ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

పోషణ్ ట్రాకర్ కష్టాలు

- ఏడేళ్ల కిందటి 2జీబీ ర్యామ్ ఫోన్లే దిక్కు
- అంగన్‌వాడీ టీచర్ల సహనానికి పరీక్ష
- కేంద్రం లబ్ధిదారుల వివరాల నమోదులో జాప్యం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారుల వివరాల నమోదు గగనంగా మారింది. ఏడేళ్ల క్రితం ప్రభుత్వం అందజేసిన 2 జీబీ ర్యామ్ ఫోన్లలోనే లబ్ధిదారులు, పౌష్టికాహార వివరాల నమోదు సమస్యలకు ప్రధాన కారణమైంది.

పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు కష్టాలు

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే సరుకుల దుర్వినియోగాన్ని అరికట్టడం, లబ్ధిదారులకు పౌష్టికాహారం పకడ్బందీగా అందజేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 'పోషణ్ ట్రాకర్' పేరుతో యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, 0-3 ఏళ్లు, 3-6 ఏళ్ల ప్రీస్కూల్ పిల్లలకు ఇచ్చే పౌష్టికాహార సరుకుల వివరాల నమోదు చేయాలి. అంతే కాకుండా వారి పేర్లు, ఆధార్‌కార్డు తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. పాత ఫోన్లలో పోషణ్ ట్రాకర్ వివరాల సేకరణ సాంకేతిక సమస్యలను సృష్టిస్తోంది. వివరాల నమోదు వేగంగా జరిగేందుకు ఈ ఫోన్లు సాంకేతికంగా అనువుగా లేవు. ఫోన్ల నెట్‌వర్క్ సరిగా ఉండే నగర ప్రదేశాల్లోనే వివరాల నమోదు కష్టంగా ఉంటే ఇక మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లోని కేంద్రాలకు అసలు నెట్‌వర్క్ ఉండడం లేదు. దీంతో ఈ ప్రాంత అంగన్‌వాడీ టీచర్లు మరింత సమస్యను ఎదుర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 4 వేలకు పైగా కేంద్రాలు

వరంగల్ ఉమ్మడి జిల్లాలో 4 వేలకు పైగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లో ఈ సమస్య ఉండడంతో టీచర్లు తలపట్టుకుంటున్నారు. ఒకటి, రెండు కాదు అనేక సాంకేతిక అంశాలూ టీచర్లను వేధిస్తున్నాయి. ఎవరైనా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నివాసం మారినప్పుడు మారిన చోటు కేంద్రంలో లబ్ధిదారుల వివరాల నమోదు ప్రహసనంగా మారింది. తొలుత నమోదైన సెంటర్‌లో పూర్తిగా వివరాల తొలగింపు జరిగితేనే కొత్త సెంటర్‌లో మళ్లీ వివరాల నమోదు జరుగుతుంది. అయితే ఈ ప్రక్రియకు 2 జీబీ ర్యామ్ ఫోన్లు అవరోధంగా మారాయి. ఒకవైపు యాప్ సులభంగా లేకపోవడం, మరోవైపు ఫోన్ల సాంకేతికత అనువుగా లేకపోవడం వంటి అనేక సమస్యలు నమోదును క్లిష్టతరం చేస్తున్నాయి. పోషణ్ ట్రాకర్ యాప్‌తో అంగన్వాడీ టీచర్లు అసహనానికి గురవుతున్నారు.

తనిఖీల్లో నమ్మని అధికారులు.. అభద్రతలో టీచర్లు

పోషణ్ ట్రాకర్ యాప్‌లో లబ్ధిదారులు, సరుకుల అందజేత వివరాలు ఎప్పటికప్పుడు టీచర్లు ఆన్‌లైన్ చేయాలి. అయితే 2జీబీ ఫోన్లు సతాయిస్తుండడంతో సమయానికి వివరాలు నమోదు కావడం లేదు. ఈ క్రమంలో ఉన్నతాధికారులు కేంద్రాలకు తనిఖీకి వచ్చిన సమయంలో లబ్ధిదారులు, సరుకుల సరఫరాల వివరాల్లో తేడా ఉంటున్నాయి. ఇదంతా టీచర్ల మెడకు బిగుసుకుంటుంది. ఏడేళ్ల కిందటి ఫోన్లు అవుట్ డేట్ కావడంతో సమస్యగా మారింది. ఆ ఫోన్ల రిపేరు, పరికరాలు కూడా దొరకడం లేదు.

ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం

అంగన్‌వాడీ టీచర్లు విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించినా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందనే సమాధానంతో దాట వేస్తున్నారు. అయితే కేంద్రాల్లో ఏర్పడే సమస్యలకు మాత్రం టీచర్లనే బాధ్యులను చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కరించే దిశలో ప్రభుత్వం ఆలోచన చేయాలని టీచర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. ట్యాబ్‌లు అందజేస్తే సమస్యకు పరిష్కారం ఉంటుందని అంగన్‌వాడీ టీచర్లు వేడుకుంటున్నారు.

రాములోరి పెళ్లికి ఊరంతా పందిరి

- నేత్రపర్వంగా జానకీరాముల కల్యాణం
- అపరమిథిలా నగరంగా శోభిల్లిన ఓరుగల్లు
- పూజలకు హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

హనుమకొండ కల్చరల్/ వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అంతా రామమయంగా మారింది. చూచూవారలకు చూడముచ్చటగా.. రాములోరి పెళ్లి వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. హనుమకొండలోని ప్రధాన రెవెన్యూ కాలనీలోని రామాలయంలో ఈసారి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తుల కోలాహలం మధ్య సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఆరవెల్లి శ్రీకాంతాచార్య ఆధ్వర్యంలో స్వామివారికి సంప్రదాయంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పాల్గొని స్వామివారికి ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ఆలయ చైర్మన్ బూసూరి సాంబమూర్తి, రామారావు, సెక్రటరీ ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులందరికీ అన్నప్రసాదం నిర్వహించడం విశేషం.

ఆలయాల్లో..

హనుమకొండలోని రాగన్న దర్వాజ శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందిన చిన్న కోవెలలో 2వేల మంది కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం, ఆరుబయట రోడ్లపై ప్రత్యేకంగా వేసిన షామియానాల మధ్య కండ్లకుంట వెంకటచారి, చెరకుపల్లి శ్రీనివాసచారిల యాజ్ఞికం మధ్య ఆలయ అనువంశీయ ధర్మకర్త చెరకుపల్లి నర్సింహాచార్య ఆధ్వర్యంలో వైభవంగా వేడుకలు జరిగాయి. డాక్టర్ జ్ఞానేష్, స్థానిక కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, రేబల్లి వెంకటేశ్వరస్వామి తదితర కాలనీ ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులు మజ్జిగ, అన్న ప్రసాద వితరణ చేశారు. హనుమకొండ అదాలత్ సమీపంలోని శ్రీభూనీలా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ నిర్వాహకులు అమరేందర్‌రెడ్డి, చాడ సునీత-సుభాష్‌రెడ్డి, అమృతరెడ్డి- జమున, శ్రీధర్‌రెడ్డి-కల్పన, ఇతర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నర్సింహా దేశికన్, వంశీ కృష్ణమాచార్య, ఆరవెల్లి వెంకట కృష్ణచైతన్యల ఆధ్వర్యంలో వైభవంగా వేడుకలు నిర్వహించారు. సాయంత్రం నాగవెల్లిని కూడా సంప్రదాయంగా నిర్వహించారు. హనుమకొండ విద్యానగర్ విజయగణపతి ఆలయంలో ఆ ప్రాంతానికి చెందిన ఇరిగేషన్ సీఈ వెంకటకృష్ణ-మాధవిల ఇంటి నుంచి శ్రీరాముడు, వీరారెడ్డి స్వగృహం నుంచి సీతమ్మ వారిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. నేత్రపర్వంగా నిర్వహించిన కల్యాణంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వనం లక్ష్మీకాంతారావు, డాక్టర్ ఎన్‌వీఎన్.చారి తదితర అనేక మంది ప్రముఖులు కల్యాణోత్సవంలో పాల్గొన్న వారిలో ఉన్నారు. హనుమకొండ గుడిబండర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు, సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కలకోట శ్రీనివాసాచార్య ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పులి విక్రమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. హనుమకొండ లష్కర్ బజార్‌లోని రామమందిర్‌లో నేత్రపర్వంగా శ్రీరామ నవమి, సీతారాముల కల్యాణోత్సవాలు ఘనశ్యామ్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. మార్వాడీలు పెద్ద సంఖ్యలో సంప్రదాయ దుస్తులతో వేడుకల్లో పాల్గొని భజనలు నిర్వహించారు. టీటీడీ కల్యాణ మండపంలో హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండప మేనేజర్ కనపర్తి రఘువీర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో టీటీడీ ప్రోగ్రాం ఇన్‌చార్జి రావిరెడ్డి కృష్ణమూర్తి దంపతులు పాల్గొన్నారు. హనుమకొండ చౌరస్తాలోని శివశక్తిస్థల్, ములుగురోడ్‌లోని గురుధామంలో శివానంద కల్చరల్ ట్రస్ట్, ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వరాలయంలో, ఏకశిలా పార్కు సమీపంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో, ములుగురోడ్‌లోని దత్తక్షేత్రంలో ఆలయ ట్రస్టీ వైవి.వామన్‌రావు ఆధ్వర్యంలో నేత్రపర్వంగా సీతారాముల కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు.



వేయిస్తంభాల ఆలయంలో హోమం చేస్తున్న పూజారులు, భక్తులు



కాశిబుగ్గలో కల్యాణ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలతో పాటు వరంగల్ నగరంలో శ్రీ సీతారాముల కల్యాణం వైభవోపేతంగ సాగింది. వరంగల్ శివనగర్‌లోని శ్రీసీతారామ ఆలయం, ఎల్లం బజార్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం, బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం, గీతా భవన్‌లో శ్రీకృష్ణ మందిరం, పోతన రోడ్డులోని శ్రీమురళీకృష్ణ మందిరం, ములుగు రోడ్డులోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రం, గురుధామం, కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో, ఆకారపువారి దేవాలయం, ఓసిటీ, కొత్తవాడ, రాంకీ, పోచమ్మ మైదాన్, కరీమాబాద్, ఉర్సు, ఎస్ఆర్ఆర్ తోట, గిర్మాజీపేట, పిన్నవారివీధి, రామన్నపేట, మట్టెవాడ తదితర ప్రాంతాలతో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మండపాలను అందంగా తీర్చిదిద్ది జై శ్రీరామ్ నామంతో కూడిన కాషాయ జెండాలతో అందంగా అలంకరించారు. భద్రకాళి ఆర్చి, ఎంజీఎం సెంటర్ నుంచి మండపాల వద్దకు శ్రీసీతారాముల విగ్రహాలను డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. మండపాల వద్ద వడపప్పు, బెల్లం పానకం, మామిడి కాయ పులిహోర ప్రసాదంగా అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పోచమ్మ మైదాన్‌లో జరిగిన కల్యాణ వేడుకలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పాల్గొనగా, కాశిబుగ్గలో మేయర్ దంపతులు గుండు సుధారాణి- ప్రభాకర్ పాల్గొన్నారు. కాలనీల్లో కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు కల్యాణోత్సవాల్లో పాల్గొన్నారు. రామన్నపేటలో శ్రీసీతారామ కల్యాణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు దాదాపు 3 వేల మంది భక్తులు హాజరయ్యారు. సాయంత్రం శ్రీసీతారాముల విగ్రహాలను తిరిగి ఆలయాల్లో భద్రపర్చడానికి బ్యాండ్ మేళాలతో మంగళహారతులతో ఊరేగింపు నిర్వహించారు.

నేడు పట్టాభిషేకం

వరంగల్ రామన్నపేట శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద గత 40 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టాభిషేకం నిర్వహిస్తారు. రామాలయాల్లో కూడా ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తారు.

వేయిస్తంభాల గుడిలో..

హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఆలయ ప్రాంగణంలో శ్రీరామ నవమి సందర్భంగా ప్రత్యేక వేదికపై నేత్రపర్వంగా శ్రీసీతారామ కల్యాణోత్సవం జరిగింది. పాంచరాత్ర ఆగమానుసారం వేద పండితుడు గుడిమల్ల విజయ కుమారాచార్య, మణికంఠ శర్మల వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణోత్సవం జరిగింది. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్వామివారికి సంప్రదాయంగా పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. ప్రముఖ న్యాయవాది రవీంద్రనాథ్- వసంత దంపతులు ఉభయ దాతలుగా రామయ్య పక్షాన నిలిచి కల్యాణ తంతులో పాల్గొన్నారు. అంతకుముందు తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న వసంత నవ రాత్రి వేడుకల ముగింపు క్రమంలో మహాసుదర్శన హోమ పూర్ణాహుతి నిర్వహించారు. టీటీడీ భజన బృందం వారు అద్భుతమైన సంకీర్తనలతో వీరికి తోడు కృష్ణవేణి, సాహితీలు ఆలపించిన సంకీర్తనలు భక్తులను ఓలలాండిపజేశాయి. ఆలయ ఈవో అనిల్‌కుమార్ పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు మహాప్రసాదం అందజేశారు.




పోస్టల్ అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళ హారతులతో మహిళలు



భూనీలా సమేత వేంకటేశ్వర ఆలయంలో సీతా రాములు

ఆంధ్రజ్యోతి
హనుమకొండ సిటీ
HANUMAKONDA CITY ■ సోమవారం 7 ఏప్రిల్ 2025 V 8



కిట్స్ వాకర్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

హసన్‌పర్తి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆర్‌టీసీ కాలనీ రాములవారి దేవస్థానం, హసన్‌పర్తి వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం నిర్వహించిన రాముల వారి కల్యాణ వేడుకలకు హాజరైన భక్తులకు కిట్స్ వాకర్స్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ (303) వాకర్స్ గవర్నర్ కూరాకుల భారతి చేతుల మీదుగా భక్తులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కిట్స్ వాకర్స్ ప్రెసిడెంట్ నాగమల్ల సుధీర్, డిప్యూటీ గవర్నర్ పాపిశెట్టి శ్రీధర్, పీఆర్‌ఓ ఉపేందర్, కోశాధికారి గూడూరు లక్ష్మీనారాయణ, సలహాదారు బోడ యుగందర్, చెన్నూరి సత్యనారాయణ, మేకల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న కూరాకుల భారతి

నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలి



పి.సత్యనారాయణ రెడ్డి
సీఐ, సుబేదారి

ఆంధ్రజ్యోతి: చోరీల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలోని రాత్రివేళల్లో పెట్రోలింగ్ పెంచి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇటీవల కాలంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌తో మోసపోతున్నారు. నివారణ చర్యలు తీసుకుంటున్నారా?

సీఐ: ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ఎక్కువ శాతం యువకులే మోసపోతున్నారు. లక్షల్లో పెట్టి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు యువత దూరంగా ఉండాలి. ఇప్పటికే పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: రౌడీషీటర్లు, ఆకతాయిల కదలికలపై నిఘా పెంచారా?

సీఐ: గతంలో నేరాలు చేసిన వారి కదలికలపై పోలీసు నిఘా ఉంటుంది. కొత్తగాఎవరైనా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: ఇటీవల కాలంలో భూ దందాలు ఎక్కువ జరుగుతున్నాయి . వాటిపై దృష్టి సారిస్తున్నారా?

సీఐ: సుబేదారి పరిధిలో భూ దందాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించాం. అమాయకులను భూ తగాదాలతో బెదిరిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి.

ఆంధ్రజ్యోతి: ప్రజలకు మీరు ఇస్తున్న సూచనలు ఏమిటి?

సీఐ: ప్రజల రక్షణ కోసం పనిచేస్తున్న పోలీసులకు ప్రజల సహకారం ఉండాలి. అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

- హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి)

కమనీయం.. సీతారాముల కల్యాణం

- హనుమకొండలో వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు
- ఆలయాల్లో మహా అన్నదానాలు.. పాల్గొన్న ప్రముఖులు

వడ్డెపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని వివిధ డివిజన్లలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని శ్రీసీతారాముల కల్యాణ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. అన్నదానాలను, తీర్థప్రసాద వితరణలు గావించారు. గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పురోహితులు సత్యమూర్తిశర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. 57వ డివిజన్ కార్పొరేటర్‌తో పాటు గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకు వెంకటరాజిరెడ్డి, సట్ల సత్తయ్యగౌడ్, కోశాధికారి గోపగాని అశోక్ తదితరులు కల్యాణ తంతులో పాల్గొని శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలను కొలిచారు. అశోక కాలనీలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో అధ్యక్షుడు చింత శ్రీనివాసరావు, సెక్రటరీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ శ్రీనగర్ కాలనీ నార్త్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఈటూరి కొండల్‌రావు ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణ తంతును నిర్వహించారు. డివిజన్‌లోని స్నేహనగర్‌లో గల శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో కాలనీ అధ్యక్షుడు కె.చిన్న, ఆలయ చైర్మన్ వెంకట్రామనర్సింహరావు, అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రాములోరి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డులోని శ్రీవేంకట గణేశసాయి సువర్చల అభయాంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణాన్ని ఆలయ ప్రధానార్చకుడు ఆరుట్ల కిరణ్‌కుమారాచార్యులు, వడ్డెపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో సైతం రాములోరి కల్యాణ తంతు నేత్రపర్వంగా జరిగింది.



రాగన్నదర్వాజ రామాలయంలో ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న కార్పొరేటర్ వేముల శ్రీనివాస్

- మడికొండ: మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామ చంద్రస్వామి దివ్య క్షేత్రములో ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈవో శేషు భారతి, చైర్మన్ పల్లపు అర్జున్ ఆధ్వర్యంలో స్వామి వారలకు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. సీతారాములను ముస్తాబు చేసిన అర్చకులు మేళతాళాల మధ్య కల్యాణ మండపం పైకి తీసుకువచ్చారు. వేదపండితుల మంత్రాల నడుమ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ జిల్లా జడ్జి రమేష్, స్టేట్ ఫైనాన్స్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి, 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం ఎ.వెంకట్‌రెడ్డి-శ్వేత దంపతులచే భక్తులకు అన్నప్రసాద వితరణచేశారు.మణిగిరి బ్రాహ్మణ సంఘం వారు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈవో శేషుభారతి, రామాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లపు అర్జున్, ధర్మకర్తలు అర్చకులు, ఆలయ సిబ్బంది, రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.
- న్యూశాయంపేట: హనుమకొండలోని పద్మాక్షి టెంపుల్ రోడ్‌లో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం ఘనంగా సీతారాముల కల్యాణం జరిపించారు. దేవాలయ పండితులు ఆరుట్ల రామాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది.
- బాలసముద్రం: హనుమకొండ సుమంగళి ఫంక్షన్ హాల్ ప్రాంతంలోని శ్రీనివాసకాలనీలోని శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణ తంతులో ఆలయ కమిటీ చైర్మన్ రావుల హరిచరణ్‌రెడ్డి, కమిటీ సభ్యులు జైప్రకాష్, లింగమూర్తి, సారంగపాణి, ప్రవీణ్‌రావు, భూపాల్‌రెడ్డి, శ్రీనివాసరావు, గణేష్, రామ్మోహన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహరెడ్డితోపాటు కాలనీ పెద్దలు కల్యాణ తంతులో పాల్గొని శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాద వితరణ గావించారు.
- హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయాలతో పాటు ఆర్‌టీసీ కాలనీ, చింతగట్టు రామాలయాల ఆవరణలో సీతారాముల కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆలయానికి చేరుకొని సీతారాముల కల్యాణాన్ని తిలకించి స్వామి వారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలు స్వీకరించారు.
- హనుమకొండ చౌరస్తా: హనుమకొండ రాగన్నదర్వాజ చిన్న కోవెలలోని శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో శ్రీజానకీరాముడి కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఆదివారం చైత్రశుద్ధ నవమిని పుస్కరించుకొని చిన్నకోవెల అనువంశీయ ధర్మకర్త, ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకుపల్లి నరసింహాచార్యులు, నరేంద్రాచార్యుల వేదమంత్రాలతో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం ఎంతో వైభవంగా నిర్వహించగా, 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్-అరుణ దంపతులు సంప్రదాయంగా ముత్యాల తలంబ్రాలను సమర్పించారు.
- హనుమకొండ బస్టాండ్ సమీపంలోని శ్రీబాలాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ సీతారాములు కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కలకోట్ల మధునాచార్యులు జానకీరాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సీతమ్మ వారికి కొక్కుల సాయిచందు-నిహారిక దంపతులు పెళ్లి పట్టువస్త్రాలు సమర్పించగా, వరుడు రామయ్యకు మనోహర్-స్వరూప దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. హనుమకొండ చౌరస్తాలోని శ్రీశ్రీశ్రీ ప్రత్యంగిర భైరవ సహిత శివశక్తి దేవాలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యులు మార్క సునీల్ గౌడ్, వలుస అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సీతారాముల కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, కార్పొరేటర్ చాడ స్వాతి-శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు శేఖర్, దేవేందర్, నక్క శ్రీను, సంపత్, సతీష్, దయానంద్, రామ భక్తులు పాల్గొన్నారు.
- హనుమకొండ(ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్ రోడ్డులో రైస్ విల్లర్స్ అసోసియేషన్ ఆవరణలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ సీతారామ కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు సతీష్ శర్మ కల్యాణ క్రతువు జరిపారు. ఈ వేడుకల్లో వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తోట సంపత్ కుమార్, అధ్యక్షుడు గోనెల రవీందర్, ప్రధాన కార్యదర్శి బూరెల సత్యనారాయణ, కోశాధికారి ఇరుకు కోటేశ్వర్‌రావు, నిర్వాహణ కార్యదర్శి పబ్బా విశ్వ ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఇరుకుల్ల రమేష్, హనుమకొండ జిల్లా రైస్ విల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ద ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మడికొండలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పురోహితులు



మడికొండలోని మెట్టురామలింగేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



సీతారాముల కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఈవో, చైర్మన్, ధర్మకర్తలు



హసన్‌పర్తి ఆర్టీసీ కాలనీలో కల్యాణంలో పాల్గొన్న కార్పొరేటర్ శివకుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



హనుమకొండ హంటర్ రోడ్డులోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు సతీష్‌శర్మ



వేదికపై సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న గాంధీనగర్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు



హనుమకొండ శ్రీనివాసకాలనీలో సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

జార్జిరెడ్డి వర్ధంతి సభలను విజయవంతం చేయాలి

- పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ సెక్రటరీ మహేశ్ తదితరులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మతోన్మాదం, మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను నిరసించి పోరాడి అమరుడైన జార్జిరెడ్డి 53వ వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం కేయూ మొదటి గేటు వద్ద పీడీఎస్‌యూ నేతృత్వంలో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మర్రి మహేశ్ మాట్లాడారు. క్యాంపస్‌లో జరుగుతున్న అన్యాయాలను, లంపెన్ గుండాల దాడులను ఎదురించి విద్యార్థులకు అండగా నిలిచారని అన్నారు. ఏప్రిల్ 10 నుంచి 14 వరకు జార్జిరెడ్డి వర్ధంతి సభలను నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సభ్యుడు ఉడుత గణేశ్, రాజేశ్, అనిల్, నాయకులు సాయితేజ, పవన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



గోపాల్‌పూర్ జంక్షన్‌లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న బీజేపీ నేత బండి హరీష్ ముదిరాజ్

వడ్డెపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్-జవహర్‌కాలనీ సర్దార్ సర్వాయి పాపన్న జంక్షన్‌లో గోపాల్‌పూర్ జోనల్ బీజేపీ అధ్యక్షుడు బండి హరీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేసి, టపాసులు పేల్చి సంబరాలను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ తక్కళ్లపల్లి అమృతరావు, ఓబీసీ జిల్లా కార్యాలయ కార్యదర్శి అలుగునూరి కృష్ణంరాజు, బీజేపీ సీనియర్ నేతలు చింతలఫణి అమరేందర్‌రెడ్డి, జన్ను మధు, పబ్బు రమేష్, నాతి రామేష్, గ్యాద నర్సింగ్, ఎర్రబెల్లి లక్ష్మణ్‌రావు, ఎల్లపూర్ లింగమూర్తి, కొత్తపల్లి అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

- హసన్‌పర్తి: గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి బస్టాండులో బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ బీజేపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మారపల్లి రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, రైల్వే బోర్డు మెంబర్లు మేకల హరిశంకర్, దాసరి రాజు, ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి పెద్దమ్మ నాగరాజు, డివిజన్ ప్రధాన కార్యదర్శి మట్టెడ సుమన్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.
- మడికొండ: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ మడికొండ చౌరస్తాలో పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. 44, 45, 46, 64 డివిజన్ల జోనల్ అధ్యక్షుడు దామెరుప్పుల రమేష్ పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, నాయకులు ముత్తోజు సురేష్, బొల్లికొండ వినోద్‌కుమార్, కందుకూరి బాలరాజు, కొలిపాక కుమార్‌బాబు, నిఖిల్‌రావు, దార ధనుంజయ్, ఎలగొండ శివ, చట్ల అజయ్, బైరపాక వెంకటేష్ గుండాల కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. మడికొండలోని వినాయక నగర్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ కౌన్సిల్ మెంబర్ దువ్వ నవీన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు నవీన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ వర్ధన్నపేట కోకన్వీనర్ టి.రవిందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఆకులు శ్రీకాంత్, కుక్కల రాజేష్, బండ రాజు, పెట్టెం సాంబయ్య, వెంకటేశ్వర్లు, జనీత్, సాయి, రంజిత్, బైరి సతీష్, మచ్చ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తిలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్



మడికొండ చౌరస్తాలో బీజేపీ జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న పార్టీ శ్రేణులు

కార్యదర్శులను ట్రాన్స్‌ఫర్ చేయడం దారుణం

న్యూశాయంపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో విధి విధానాలు లేకుండా, కొందరి ఒత్తిడితో ఒక నియోజకవర్గ కార్యదర్శిని ఆ నియోజకవర్గంలో లేకుండా చేయడం దారుణమని తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎలికట్టె శ్రీకాంత్‌గౌడ్, ఉపాధ్యక్షులు ఆకారపు సురేష్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం హనుమకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. కార్యదర్శులను ట్రాన్స్‌ఫర్‌లు చేయడాన్ని తమ యూనియన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇప్పటి వరకు ఒక్కొక్క కార్యదర్శి కనీసం రూ2లక్షల నుంచి 5లక్షల వరకు ఆయా గ్రామాలలో గ్రామ పంచాయతీల కనీస అసరాలు, శానిటేషన్ కోసం ఖర్చు చేశారన్నారు. ఖర్చులకు సంబంధించిన నిధులు వెంటనే విడుదల చేయాలని, ట్రాన్స్‌ఫర్‌లకు మేం వ్యతిరేకం కాదని, తాము పెట్టి న డబ్బులు తమకు వచ్చిన తర్వాత ట్రాన్స్‌ఫర్‌లు చేసుకుంటే బాగుంటుంద న్నారు. సర్పంచ్‌ల పదవీకాలం అయిపోయినప్పటి నుంచి సుమారు 14 నెలలుగా గ్రామాల్లో ఎన్నో పనులకు డబ్బులు ఖర్చు పెట్టామని, ఇప్పటికైనా కార్యదర్శుల గురించి ఆలోచించి ట్రాన్స్‌ఫర్‌లపై వెనక్కి తగ్గాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న నేదునూరి జ్యోతి

హసన్‌పర్తి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : దేశ సంపదను కోటీశ్వరులకు దోచిపెడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. మండలంలోని మడిపల్లిలో సీపీఐ గ్రామ శాఖ అధ్యక్షుడు జక్కుల సాంబరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై సీపీఐ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. భారతరాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఈడీ, సీబీఐలతో ప్రతిపక్ష పార్టీలపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. నవరత్నాలుగా పిలువబడే ప్రభుత్వరంగ సంస్థలైన ఓడరేవు, విమానాశ్రయాలు, బొగ్గు గనులు, జాతీయ రహదారులు, రైల్వేలు, బీఎస్ఎన్ఎల్ లాంటి ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరిస్తూ అదాని, అంబానీ, నీరవ్ మోదీ లాంటి వ్యక్తులకు కారుచౌకగా కట్టబెట్టడాన్ని ప్రజాస్వామ్యవాదులు, పౌర సమాజం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీకేఎంయూ జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, ఆల్ ఇండియా ప్రోగ్రెస్ ఫోరం రాష్ట్ర సమితి సభ్యుడు నేదునూరి రాజమౌళి, నాయకులు దొమ్మాటి ప్రవీణ్‌కుమార్, మెట్టు శ్యాం సుందర్‌రెడ్డి, సుధాకర్, సమ్మయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు

- ఇబ్బందులు పడుతున్న కాజీపేట ప్రజలు





బాపూజీనగర్‌లో కూరగాయల మార్కెట్, రోడ్డుపై విక్రయాలు జరుపుతున్న వ్యాపారులు

కాజీపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట - హైదరాబాద్ ప్రధాన రహదారికి సమీపంలో సుమారు రెండు ఎకరాలు విశాలమైన స్థలం, ముప్పై వరకు రేకుల షెడ్‌లు, సౌకర్యవంతమైన పార్కింగ్ స్థలం కలిగి ఉన్న కాజీపేట బాపూజీనగర్ వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ ప్రస్తుతం సమస్యల వలయంలో చిక్కుకుంది. ఎన్నో ఉద్యమాలు, ఆందోళనలతో సాధించుకున్న మార్కెట్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అంతర్గత రోడ్లు లేకపోవడం, తాగునీటి సౌకర్యం, వాష్‌రూమ్‌ల మెయింటనెన్స్ లేకపోవడంతో అక్కడి చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదేకాకుండా కొందరు వ్యాపారులు రోడ్లపైనే అమ్మకాలు జరుపుతున్నారు. మార్కెట్‌లో విక్రయించేవారు నష్టపోతున్నారు. దీంతో మార్కెట్ ఉనికికే ప్రమాదం ఏర్పడుతోందని వ్యాపారులు అంటున్నారు.

రోడ్లపై అమ్మకాలు నిలిపివేయాలి

కాజీపేట బాపూజీనగర్ వెంకటలక్ష్మికూరగాయలు మార్కెట్‌లో అమ్మకాలు జరపకుండా కాజీపేట చౌరస్తా, విష్ణుపురి, డీజిల్ కాలనీ ప్రధాన రహదారిపై అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు రోడ్లపై ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. రోడ్లపై అమ్మకాలు నిలిపివేయాలని కొందరు వ్యాపారులు గతంలో ఆందోళనలు చేశారు. గతంలో మున్సిపల్ అధికారులు, పోలీసులు రోడ్లపై అమ్మకాలు జరిపే వారిని అడ్డుకుని మార్కెట్‌కు తరలించారు. కొన్ని రోజుల తర్వాత మళ్లీ రోడ్లపై అమ్మకాలు చేపట్టడంతో సమస్య మొదటికి వచ్చింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు రోడ్లపై అమ్మకాలు నిలిపివేసి, మార్కెట్‌లోనే అమ్మకాలు జరిపేలా చూడాలని, మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఆర్‌ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు దర్గా, హౌసింగ్ బోర్డ్ కాలనీ, బియాబానీ నగర్, గాంధీనగర్, బీజేపీ క్వార్టర్స్, ఈపీఎఫ్ ఆఫీస్ రోడ్డు, భీమ్‌నగర్ ఏరియాల్లో, కలెక్టర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి11.00 గంటల వరకు శాంతినగర్, సుబేదారి, పోస్టల్ కాలనీ, ఎక్సైజ్ కాలనీ, అదాలత్ జంక్షన్లో, కడిపికొండ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8.30 నుంచి 10.30 వరకు కడిపికొండ రాజీవ్ గృహకల్ప, కడిపికొండ టౌన్, సూర్యకుటీర్, బోడగుట్ట, అయోధ్యపూర్, వెస్ట్ సిటీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి1 0.30 వరకు 11 కేవీ బాపూజీనగర్ ఫీడర్, బాలాజీనగర్, సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలో సుంచు అశోక్ డీటీఆర్, గణేష్ స్వీట్స్ షాప్, సెయింట్ థామస్ స్కూల్, ఉప్పలయ్య హోటల్ ఏరియాలో విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



రాబోయే తరం శ్రేయస్సు కోసం డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టడానికి దేనికైనా సిద్ధమంటున్నారు ఫరీషా అబిద్. కేరళలోని ఓ పంచాయతీ ప్రెసిడెంట్ అయిన ఆమె దాదాపు 800 మందితో ఓ సైన్యాన్ని సిద్ధం చేసి, మాదక ద్రవ్యాలపై పోరాడుతున్నారు. తనను, తన కుటుంబాన్ని చంపుతామనే బెదిరింపులను లెక్క చెయ్యకుండా... స్వార్థపరుల ఆట కట్టిస్తున్నారు.

మత్తు వదిలిస్తున్నారు..

"నాలుగైదు నెలల క్రితం... పంచాయతీ ఆఫీసు నుంచి ఇంటికి వెళ్తున్నాను. రోడ్డు పక్కన జనం గుమిగూడి ఉన్నారు. 'ఏమిటా?' అని వెళ్ళి చూస్తే పదిహేనేళ్ళ కుర్రాడు స్పృహ లేకుండా పడి ఉన్నాడు. అక్కడికి చేరుకున్న డాక్టర్... ఆ కుర్రాణ్ణి పరీక్ష చేసి, అతను డ్రగ్స్ తీసుకున్నాడని, మోతాదు ఎక్కువైపోవడం వల్ల అపస్మారక స్థితికి చేరుకున్నాడని చెప్పారు. ఆ కుర్రాణ్ణి నేను గుర్తుపట్టాను. అతను గతంలో నా దగ్గర చదువుకున్నవాడే. తరగతిలో చురుగ్గా ఉండేవాళ్ళలో ఒకడు. అతణ్ణి ఆసుపత్రికి తరలించాం. ఇలాంటి దృశ్యాలు ఈ మధ్య సర్వసాధారణమైపోయాయి. బడి వయసులోనే పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారు. వ్యసనాన్ని తీర్చుకోవడానికి డబ్బుకోసం అడ్డదారులు తొక్కుతున్నారు. మత్తులో విచక్షణ మరచిపోయి బాలికల మీద, మహిళల మీద అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. సంఘ వ్యతిరేక శక్తులుగా మారుతున్నారు. ఇది మా ప్రాంతానికే పరిమితం కాదు. చాలా ప్రాంతాల్లో ఆందోళనకరంగా మారిన సమస్య. 'కొందరి స్వార్థం కోసం రాబోయే తరం బలైపోతూ ఉంటే... నిస్సహాయంగా చూస్తూ ఊరుకోవాల్సిందేనా? ఒక మాజీ టీచర్‌గా, పంచాయతీ ప్రెసిడెంట్‌గా... అన్నిటికీ మించి ఇద్దరు పిల్లల తల్లిగా నేను ఏం చేయగలను?'... కొన్నాళ్ళపాటు ఇవే ఆలోచనలు.

రాద్ధాంతం చెయ్యొద్దన్నారు...

మాది కేరళలోని కన్నూర్ జిల్లా మట్టూల్ గ్రామం. ఉపాధ్యాయినిగా పని చేసిన నేను కొన్నేళ్ళ క్రితం ప్రజా జీవితంలోకి వచ్చాను. 30 వేలకు పైగా జనాభా ఉన్న మా పంచాయతీకి ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యాను. అన్ని రంగాల్లో మా గ్రామాన్ని అత్యుత్తమంగా నిలబెట్టాలనేది నా తపన. ఆ దిశగా పని చేస్తున్న నాకు డ్రగ్స్ మహమ్మారి ఒక సవాలుగా మారింది. మత్తుకు అలవాటు పడిన పిల్లల తల్లితండ్రులతో మాట్లాడినప్పుడు... "అన్యాయంగా మావాడి మీద నిందలు వేస్తున్నారు. వాడు అలాంటి వాడు కాదు" అని కొందరు, "ఈ సంగతి అందరికీ తెలిస్తే మా పరువు పోతుంది. దయచేసి రాద్ధాంతం చెయ్యకండి" అని ఇంకొందరు అనడంతో నేను దిగ్భ్రాంతి చెందాను. విదేశాల్లో పని చేసే తల్లితండ్రులు డబ్బు పంపుతూ ఉంటే... దాన్ని విచ్చలవిడిగా ఖర్చుపెడుతూ మాదకద్రవ్యాలకు బానిసలైన వారు, తోటివారి ప్రోత్సాహంతో, డ్రగ్స్ అమ్మేవారి ప్రలోభాలతో ఈ దురలవాటు చేసుకున్నవారు ఎక్కువమందే ఉన్నారు. చేతిలో డబ్బు లేకపోతే దొంగతనాలకు, అఘాయిత్యాలకు సైతం పాల్పడుతున్నవారూ ఉన్నారు. దీని వెనుక డ్రగ్స్ రాకెట్ ఉంది. కాబట్టి ఇది అత్యవసర సమస్య అనీ, పెద్ద స్థాయిలో చర్యలు చేపట్టాల్సిందేననీ అర్థమయింది. ఈ దిశలో తొలి అడుగుగా... 'ధీర' అనే పేరుతో కొన్ని నెలల క్రితం సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభించాను. దానికోసం నిర్వహణ బృందాన్ని ఏర్పాటు చేశాను. చిన్న స్థాయిలో...



కొద్దిమందితో మొదలైన వాట్సాప్ గ్రూప్‌లో ఇప్పుడు 800కు పైగా వాలంటీర్లు ఉన్నారు.

అందరి సాయంతో...

మత్తుపదార్థాలు వినియోగిస్తున్నవారి గురించి, వాటిని సరఫరా చేస్తున్నవారి గురించి తెలిసిన సమాచారాన్ని మా గ్రూపులో పంచుకుంటాం. ఆ సమాచారాన్ని పోలీసులకు అందిస్తాం. దీనికోసం పంచాయతీ అంతటా... ముఖ్యంగా పాఠశాలల్లో, పని ప్రదేశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి ప్రసంగాల ద్వారా, కరపత్రాల పంపిణీ ద్వారా ప్రజలకు వివరించాం. మా ప్రయత్నానికి చక్కటి మద్దతు లభించింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, న్యాయవాదులు, వ్యాపారులు, దుకాణకారులు, పోలీసు అధికారులు... ఇలా అన్ని వర్గాలవారూ మాతో చేతులు కలిపారు. మాదక ద్రవ్యాలు అమ్ముతున్న 13 మందిని ఇప్పటివరకూ అరెస్ట్ చేయించాం. డ్రగ్స్‌కు బానిసలైన అనేకమందికి వైద్య చికిత్స అందిస్తున్నాం. ఇప్పుడు మా పొరుగు పంచాయతీ మదాయి కూడా మాతో భాగస్వామి అయింది. దాంతో 'ధీర: మట్టూల్-మదాయి కూటమి'గా ఏర్పడ్డాం. డ్రగ్స్ వ్యాపారులంటే భయంతో మొదట్లో ప్రజలు ధైర్యంగా మాట్లాడడానికి వెనుకాడేవారు. ఇప్పుడు డ్రగ్ జోన్స్, వాడకందారులు, విక్రయదారుల గురించి కీలక సమాచారం ఇస్తున్నారు. వేరే ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికులు కొందరు డ్రగ్స్ పంపిణీ చేస్తున్నట్టు గుర్తించి, వారికి హిందీలో కౌన్సెలింగ్ ఇచ్చాం. ఎవరి ఇళ్ళలోనైనా అక్రమ కార్యకలాపాలు జరిగితే... వారిపై చర్యలు తప్పవని హెచ్చరించాం. పోలీసులు, ఎక్సైజ్ శాఖలు కూడా దీనికి ఎంతో సహకరిస్తున్నాయి.

వారికి హెచ్చరికగా...

ఇవన్నీ ఒక ఎత్తయితే... నాకు బెదిరింపులు కూడా తీవ్రస్థాయిలోనే వస్తున్నాయి. ఇంటికి ఫోన్ చేసి అసభ్యంగా తిట్టడంతో ఇది మొదలయింది. ఇప్పుడు నా కుటుంబం మొత్తాన్ని చంపేస్తామంటూ సందేశాలు పంపిస్తున్నారు. వాళ్ళు నన్ను భయపెట్టాలని చూస్తున్నారు. "ఫోన్ వెనకాల దాక్కోవడానికి బదులు ముఖాముఖి నాతో వచ్చి మాట్లాడు" అని వారికి చెబుతున్నాను. ఇలాంటి వాటికి నేను, మా బృందం భయపడేది లేదనే గట్టి హెచ్చరిక వారికి చేయాలనే ఉద్దేశంతో... ఈ మధ్య పెద్ద ఊరేగింపు నిర్వహించాను. దుండగుల బెదిరింపులపై పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఏది ఏమైనా... మా కృషి మంచి ఫలితాలనే ఇస్తుందని ఆశిస్తున్నాను. రాబోయే రోజుల్లో 'ధీర'ను రిజిస్టర్డ్ ఎన్జీవోగా మార్చి... మరింత విస్తరించాలనే ఆలోచన ఉంది. అలాగే చాటుమాటుగా సాగుతున్న డ్రగ్స్ కార్యకలాపాలను కనిపెట్టడం కోసం డ్రోన్లతో నిఘా, థర్మల్ స్కానింగ్ లాంటివి ప్రవేశపెట్టాలనుకుంటున్నాం. డ్రగ్స్ లేని సమాజంతోనే మన పిల్లలకు మంచి భవిష్యత్తును అందించగలం. అందుకు అవసరమైన సామాజిక చైతన్యం కోసం నా కృషిని కొనసాగిస్తాను."



పాదాలకూ కావాలి సంరక్షణ..!

నడవడం, పరుగెత్తడం, మెట్లు ఎక్కడం, దిగడం లాంటి పనులు చేస్తూ పాదాలు అలసిపోతూ ఉంటాయి. నిరంతరం శరీర బరువును మోసే పాదాలను నిర్లక్ష్యం చేస్తే అరికాళ్ల మంటలు, పాదాల నొప్పులు వేధిస్తాయని నిపుణులు చెబుతున్నారు. పాదాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇలా సూచిస్తున్నారు.

- పాదాలకు సరిగా అమరే చెప్పులు, బూట్లు ఎంపిక చేసుకోవాలి. పాదాల పొడవుకు తగ్గట్టుగా ఉన్న చెప్పులు కొని వేసుకోవాలి. పాదం కంటే కొద్దిగా ఎక్కువ పొడవున్న బూట్లు కొనుక్కోవాలి. వాటి ముందు భాగంలో కనీసం మూడు సెంటీమీటర్ల ఖాళీ ఉండేలా చూసుకోవాలి.
- ఎత్తు మడమల చెప్పులు వేసుకోకూడదు. వీటివల్ల పాదాల నొప్పి, వేళ్ల ఒంగడం, మడమల నుంచి వేళ్ల వరకు ఉన్న కణజాలం వాయడం, గోర్లు లోపలికి పెరగడం లాంటి సమస్యలు వస్తాయి.
- ప్రతి రోజూ స్నానం చేసేటప్పుడు పాదాలను సబ్బుతో రుద్ది వేడి నీళ్లతో కడగాలి. అప్పుడే అవి పూర్తిగా శుభ్రమవుతాయి. తరవాత పాదాలను అలాగే వేళ్ల మధ్య తడిలేకుండా తుడుచుకోవాలి.
- రాత్రి పడుకునే ముందు పాదాలను కొద్దిగా సాగదీయాలి. అరికాళ్ల మధ్యలో బొటనవేలితో ఒత్తాలి. ఇలా చేస్తే పాదాలపై ఒత్తిడి తగ్గుతుంది. బిగుసుకున్న కండరాలు సడలి ఉపశమనంగా అనిపిస్తుంది.
- నడక, పరుగు, సైకిల్ తొక్కడం, తాడుతో ఆడటం లాంటి చిన్న చిన్న వ్యాయామాలు చేస్తూ ఉంటే పాదాల్లో రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. నిత్యం బ్రిస్క్ వాకింగ్ చేయడం వల్ల పాదాలకు బలం చేకూరుతుంది.
- శరీరంలో నీటి శాతం తగ్గితే పాదాల్లో పగుళ్ల వస్తాయి. వేసవిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. పోషకాహారం తీసుకుంటూ తరచూ మంచినీళ్ల తాగుతూ ఉంటే దీని నుంచి బయటపడవచ్చు. వెడల్పాటి టబ్‌లో గోరువెచ్చని నీళ్ల పోసి అందులో రెండు చెంచాల కల్లుప్పు వేసి కరిగించాలి. ఈ నీళ్లలో పాదాలను అరగంట సేపు ఉంచాలి. తరవాత పాదాలను వేళ్లతో రుద్ది మంచి నీళ్లతో కడగాలి. వెంటనే పొడి వస్త్రంతో తుడిచి వాటికి మాయిశ్చరైజర్ క్రీమ్ రాసి శుభ్రమైన సాక్స్ తొడగాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే పాదాల పగుళ్ల తగ్గిపోతాయి.
- గోళ్లను కూడా శుభ్రంగా ఉంచుకోవాలి. పెరిగిన గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. లేకపోతే వాటి సందుల్లో మట్టి చేరుకొని, అపరిశుభ్రంగా కనిపించడమే కాకుండా, పాదాలకు హాని చేస్తాయి.
- చిన్న కోతలు, పుండ్లు, వాపులు, ఆనలు, పొడిబారడం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. వాటి ద్వారా బ్యాక్టీరియా, రోగాలను కలిగించే క్రిములు మన శరీరంలోకి ప్రవేశిస్తాయి. వర్షాలు పడినప్పుడు ఈ సమస్య మరీ ఎక్కువ. ఒకవేళ గాయాలున్నట్టయితే యాంటిసెప్టిక్ క్రీమ్ రాసుకోవాలి. పొడిబారకుండా మాయిశ్చరైజర్లు ఉపయోగించాలి.

వేసవిలో హాయి హాయిగా..!



ఎండాకాలంలో వేడి, ఉక్క పోత, చెమట ఇబ్బంది పెడుతూ ఉంటాయి. ఈ సమయంలో ఎండ నుంచి కాపాడుతూ చెమటను పీల్చుకునే బట్టలు ధరించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. శరీరానికి గాలి తగిలేలా పలుచని బట్టలు ఎంచుకోవాలని సూచిస్తున్నారు. అలాంటి బట్టల గురించి తెలుసుకుందాం.

- వేసవిలో కాటన్ బట్టలు ధరిస్తే హాయిగా ఉంటుంది. వీటి మీద ఉండే రంధ్రాల వల్ల శరీరానికి గాలి ఆడుతుంది. పత్తి దారాల నుంచి తయారుచేస్తారు కాబట్టి ఇవి చెమటను పీల్చుకుని శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.
- షిఫాన్ బట్టలు చాలా తేలికగా మెత్తగా ఉంటాయి. స్టయిల్‌గా కూడా కనిపిస్తాయి. చీరలు, షర్టులు, కుర్తీలు ఇలా ఏవి ధరించినా ఎండాకాలంలో సౌకర్యవంతంగా అనిపిస్తుంది. వేడుకలు, పార్టీలకు వెళ్లేటప్పుడు వేసుకోవడానికి రకరకాల డిజైన్లలో షిఫాన్ దుస్తులు అందుబాటులో ఉన్నాయి.
- లినెన్(నార) బట్టలు చాలా తేలికగా ఉంటాయి. వీటిని సహజసిద్ధమైన పీచులతో రూపొందిస్తారు కాబట్టి త్వరగా చెమటను పీల్చుకుంటాయి. ఇవి కాటన్ బట్టలకంటే బలంగా ఉంటాయి. ఎక్కువ కాలం మన్నుతాయి కూడా. వేసవికి మంచి ఎంపిక.
- షీర్ బట్టలు చాలా పలుచగా ఉంటాయి. వీటిని కూడా పత్తి దారాల తోనే తయారు చేస్తారు. ఇవి కాస్త బరువుగా అనిపించినప్పటికీ ఎండాకాలంలో ధరించడానికి అనువుగా ఉంటాయి. 'ఆర్గంజా' ఈ కోవలోకే వస్తుంది. టాప్స్, పాంట్స్, స్కర్టులు, కుర్తీలు, గౌన్లు ఇలా ఎన్నో రకాల షీర్ దుస్తులు అందుబాటులో ఉన్నాయి.
- లాన్ బట్టలు చాలా మెత్తగా ఉంటాయి. వీటిలో కొంత మేరకు కాటన్ కలిసి ఉంటుంది. లాన్ దుస్తులు ఫ్యాషన్‌గా కనిపిస్తాయి. వేసవికాలంలో జరిగే వేడుకలకు వీటిని ధరించవచ్చు.
- చాంబ్రే బట్టలు కొద్దిగా మందంగా ఉంటాయి. వీటిలో కూడా కాటన్ కలిసి ఉంటుంది. అందుకే వీటిని ధరించినప్పుడు చల్లని అనుభూతి కలుగుతుంది. చాంబ్రే లెగ్గింగ్స్‌ని మహిళలు ఎక్కువగా ఆదరిస్తున్నారు.
- వేసవికాలంలో మహిళలు పార్టీలకు వెళ్లేటప్పుడు చందేరీ, కశ్మీరీ, మట్కా, క్రేప్ సిల్క్ చీరలు కట్టుకుంటే బాగుంటుంది. ఉద్యోగినులు కార్యాలయాలకు వెళ్లేటప్పుడు ప్రింటెడ్ కాటన్ చీరలు, హ్యాండ్‌లూమ్ చీరలు, షార్ట్ మోడల్ కుర్తాలు, ప్రింటెడ్ బాటమ్స్, కాటన్ జీన్స్, కాటన్ షర్ట్స్ వేసుకుంటే హాయిగా అనిపిస్తుంది.



బంగారు ఆభరణాల మెరుపులకు...

మహిళలు సాధారణంగా గొలుసులు, గాజులు, దిద్దులు, ఉంగరాలు లాంటి బంగారు ఆభరణాలు ధరిస్తూ ఉంటారు. వీటి మీద చెమట, దుమ్ము చేరడం వల్ల అవి మెరుపును కోల్పోయి నల్లబడుతుంటాయి. ఈ ఆభరణాలను కొత్తవాటిలా మెరిపించడానికి ఇంట్లోనే శుభ్రం చేసే విధానాలను చాలానే ఉన్నాయి. అలాంటి కొన్ని చిట్కాలు మీ కోసం...



- ఒక గిన్నెలో ఒక గ్లాసు వేడి నీళ్ల పోసి, రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి బాగా కలపాలి. ఇందులో నల్లగా మారిన బంగారు ఆభరణాలను ఉంచి అరగంట సేపు నానబెట్టాలి. తరవాత మెత్తని స్పాంజితో రుద్ది మంచినీళ్లతో కడిగితే నగలు కొత్తవాటిలా మెరుస్తాయి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక గ్లాసు నీళ్ల పోసి ఒక చెంచా పసుపు, ఒక చెంచా సర్ఫ్ వేసి అయిదు నిమిషాలు వేడి చేసి దించాలి. ఇందులో బంగారు ఆభరణాలు ఉంచి పది నిమిషాలు నాననివ్వాలి. తరవాత వాటిని పాత టూత్‌బ్రష్‌తో సున్నితంగా రుద్ది నీళ్లతో కడిగితే మురికి పూర్తిగా వదిలిపోతుంది.
- ఒక గిన్నెలో రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్ల పోసి అందులో కొద్దిగా డిటర్జెంట్ పౌడర్ లేదా వాషింగ్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. ఈ నీళ్లలో నగలు ఉంచి పావుగంటసేపు నానబెట్టాలి. తరవాత వేళ్లతో రుద్దుతూ నీళ్లతో శుభ్రం చేస్తే వాటిమీద పేరుకున్న మురికి తొలగిపోతుంది.
- ఒక పాత టూత్‌బ్రష్ మీద కొద్దిగా టూత్‌పేస్టు వేసి దానితో ఆభరణాలను మెల్లగా తోమాలి. మధ్య మధ్యలో కొద్దిగా నీళ్ల చిలకరిస్తూ ఉండాలి. తరవాత ఈ ఆభరణాలను మంచినీళ్లలో ముంచి తీసి పొడిగుడ్డతో తుడిస్తే కొత్తవాటిలా కనిపిస్తాయి.
- వజ్రాలు, కెంపులు, పచ్చలు పొదిగిన ఆభరణాలను సబ్బునీటితో శుభ్రం చేయవచ్చు. ముత్యాలు పొదిగిన నగలను మాత్రం తేలికపాటి షాంపూ కలిపిన నీళ్లతో కడగాలి.
- అలాగే వెండి వస్తువులు, ఆభరణాలు కూడా ఇంట్లోనే శుభ్రం చేసుకోవచ్చు. షాపునకు వెళ్లినప్పుడు మొదటగా వారు కుంకుడుకాయ నురగతో శుభ్రం చేస్తారు. ఇలా మీరు కూడా ఇంట్లో చేసుకోవచ్చు. వెండి వస్తువులను ఓ అరగంటపాటు కుంకుడు కాయల రసంలో వేసి ఉంచండి. తరువాత కుంకుడు కాయ నురగ తీసుకొని వెండి వస్తువులపై రుద్దితే కొత్తవిలా మెరుస్తాయి.

అసలైన ఆనందం భారత్‌లోనే

ప్రతి తల్లిదండ్రులూ... తమ పిల్లలు బాగా చదివి అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడాలని కోరుకుంటూ ఉంటారు. కానీ ఓ అమెరికన్ తల్లి మాత్రం తన పిల్లలు భారత్‌లో పెరిగితేనే ప్రయోజకులు అవుతారంటూ ఇన్‌స్టా వేదికగా ఓ వీడియో షేర్ చేసింది. దానికి కారణాలు వివరిస్తూ సుదీర్ఘమైన పోస్టు పెట్టింది. 'అమెరికాలో డబ్బు సంపాదించడం సులువే కావచ్చు కానీ అసలైన ఆనందం భారత్‌లోనే ఉంద'ని అంటూ మన దేశ ఔన్నత్యాన్ని ఆకాశానికి ఎత్తేసింది. ఈ పోస్టు చూసిన నెటిజన్లు ఆమె విశ్లేషణను ప్రశంసిస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఇంతకీ ఎవరీ విదేశీ అమ్మ? ఆమె పోస్టులో ఏముంది?



ఆమె పేరు క్రిస్టెన్ ఫిషర్. ముగ్గురు ఆడపిల్లల తల్లి. ఓ సంస్థలో కంటెంట్ క్రియేటర్‌గా పని చేస్తున్నారు. భర్త, పిల్లలతో కలసి గత నాలుగేళ్లుగా ఢిల్లీలో నివశిస్తున్నారు. 'ఇండియా వర్సెస్ అమెరికా' ట్యాగ్‌లైన్‌తో రెండు దేశాల మధ్య ఉండే భిన్నత్వం గురించి చిన్నచిన్న వీడియోలు చేసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తూ ఉంటారు. ఆహారపు అలవాట్లు, వేషధారణ, పండుగలు-వేడుకలు జరుపుకోవడం, విద్యా విధానం, కుటుంబంతో అనుబంధం, స్నేహం ఇలా ఎన్నో అంశాలను ఇతివృత్తంగా తీసుకుని ఇప్పటికే వందల వీడియోలు రూపొందించారు. ప్రతి వీడియోలో ఆమె మన దేశాన్ని గొప్పగా అభివర్ణించడం కనిపిస్తుంది. ఆమె నిర్వహిస్తున్న యూట్యూబ్ చానెల్‌కు అమెరికాలోనే కాదు ఇండియాలో కూడా పెద్ద సంఖ్యలో సబ్‌స్క్రయిబర్స్ ఉన్నారు. అమెరికాను వదిలి భారత్‌లోనే నివశించాలనుకోవడానికి కారణాలు చెబుతూ గత ఏడాది ఆమె ఒక వీడియోను నెటిజన్లతో పంచుకున్నారు. అందులో చాలా విషయాలు వివరించారు. తాను మొదటిసారి 2017లో భారత దేశాన్ని సందర్శించాననీ, ఇక్కడి సంస్కృతి తనకు బాగా నచ్చిందని, అప్పుడే భారత్ వచ్చేయాలని నిర్ణయించుకున్నానని ఆ వీడియోలో చెప్పుకున్నారు.



ఇక్కడే బాగుంటుంది...

అమెరికాలో కంటే భారత్‌లోనే పిల్లలు తమ బాల్యాన్ని ఆనందంగా గడుపుతారని అంటున్నారు క్రిస్టెన్. ఆమె పలు అంశాలను ఇన్‌స్టా వేదిక మీద ప్రస్తావిస్తూ... భారత్‌లో పెరగడంవల్ల పిల్లలకు కలిగే ప్రయోజనాలను చక్కగా విశ్లేషించారు. ఎందుకు తన పిల్లలు ఇక్కడే పెరగాలని అనుకుంటున్నారో ఆ కారణాలను ఇలా పంచుకున్నారు.

- సాంస్కృతిక అవగాహన: భారత దేశంలో భిన్న సంస్కృతులు కనిపిస్తాయి. ఎన్నో భాషలు, ఆచారాలు, నమ్మకాలు ఉంటాయి. వీటన్నింటినీ చూస్తూ, అర్థం చేసుకుంటూ ఎదిగే పిల్లలకు విశాల దృక్పథం అలవడుతుంది. కొత్తగా ఆలోచించడం, ఎదుటివారి అభిప్రాయాలను గౌరవించడం, పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోవడం లాంటి వాటిని పిల్లలు నేర్చుకుంటారు.
- బహుభాషా నైపుణ్యం: ఇక్కడ ఎన్నో భాషలు, మాండలికాలు మాట్లాడుతూ ఉంటారు. హిందీ, ఇంగ్లీష్‌తోపాటు వీటన్నింటినీ పిల్లలు చాలా తేలిగ్గా నేర్చుకోగల్గుతారు. ఓర్పుగా వినడం, అర్థం చేసుకోవడంతోపాటు స్పష్టంగా మాట్లాడడం, చక్కని భావ వ్యక్తీకరణ పిల్లలకు అలవడుతుంది. ఇవన్నీ భవిష్యత్తులో ఉద్యోగ ప్రయత్నాలు చేసేటప్పుడు వాళ్లకి ఉపయోగపడతాయి.
- ప్రాపంచిక దృక్పథం: భారత సమాజం... పిల్లలకు ప్రాపంచిక దృక్పథాన్ని పరిచయం చేస్తుంది. ప్రపంచ సమస్యలు, స్థానిక సమస్యలు, సాంస్కృతిక వైవిధ్యం, సామాజిక నిబంధనల్లో తేడాలు అవగతమయ్యేలా చేస్తుంది. దీంతో పిల్లలు ప్రపంచాన్ని లోతుగా విభిన్న కోణాల నుంచి అర్థం చేసుకోవడం నేర్చుకుంటారు.
- తొణకని తత్వం: పుట్టిన దేశాన్ని వదిలి వేరే దేశంలో ఉండడమంటే అది పిల్లలకు పెద్ద సవాల్ అనే చెప్పాలి. వాళ్ల ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక్కడి పాఠశాల విధానానికి అలవాటు పడాలి. కొత్త స్నేహితులతో సర్దుకుపోవాలి. ఇలాంటివాటివల్ల పిల్లలు స్వతంత్రంగా సమస్యలను పరిష్కరించుకునే నైపుణ్యాన్ని సాధిస్తారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా తొణకకుండా నిలబడడం నేర్చుకుంటారు.
- భావోద్వేగాలు: ఇక్కడి సమాజంలో రకరకాల వ్యక్తులు తారసపడుతూ ఉంటారు. ఒక్కొక్కరికి ఒక్కో నేపథ్యం ఉంటుంది. వీళ్లని కలిసినప్పుడు పిల్లల్లో సహజంగానే రకరకాల భావోద్వేగాలు కలుగుతూ ఉంటాయి. స్నేహం, దయ, జాలి, బాధ ఇలా ఎన్నో భావాలు వాళ్ల అనుభవంలోకి వస్తాయి. వ్యక్తులను అర్థం చేసుకోవడం, సున్నితంగా వ్యవహరించడం, సామాజిక బాధ్యత పిల్లలకు అలవడతాయి.
- కుటుంబ వ్యవస్థ: భారతదేశంలో బలమైన కుటుంబ వ్యవస్థ ఉంటుంది. కుటుంబ సభ్యులంతా ప్రేమాభిమానాలతో వ్యవహరిస్తూ ఉంటారు. ఇలాంటివన్నీ అమెరికాలో కనిపించవు కాబట్టి పిల్లలు ఆసక్తిగా గమనిస్తూ ఉంటారు. దీనివల్ల పిల్లలకు తమవారు అనే భావన, భావోద్వేగాల వ్యక్తీకరణ, బంధువర్గ సమీకరణ గురించి తెలుస్తుంది.
- సాధారణ జీవనం: ఇక్కడ పిల్లలు.... ధనిక, పేద తారతమ్యాలను చూస్తూ పెరుగుతారు. క్రమంగా సాధారణ జీవన మాధుర్యాన్ని, సంతృప్తి విలువను అర్థం చేసుకుంటారు.
- భారత్‌లో పెరిగే పిల్లలు... ప్రపంచంలో ఏ ప్రాంతం వారితోనైనా స్నేహపూర్వకంగా మెలగుతారు. స్నేహబంధాలను పెంచుకుంటారు. ఇది అంతర్జాతీయంగా సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ కార్యకలాపాల విస్తరణకు దోహదం చేస్తుంది.

అమెరికా వర్సెస్ భారత్

అమెరికా... వ్యక్తిగత దేశంలా వ్యవహరిస్తుంది. సామాజికంగా ఒంటరిగా ఉంటుంది. కానీ భారత్... అందరినీ ఆహ్వానిస్తుంది. మానవ సంబంధాలకు విలువ ఇస్తుంది. పరస్పర సహకారాన్ని కోరుతుంది. అందుకే నా పిల్లలను భారత్‌లోనే పెంచాలని అనుకుంటున్నా...! అని చెప్పుకొచ్చారు క్రిస్టెన్.

SCHOLARSHIP ALERT

The Cadence Scholarship

The Cadence Scholarship Program 2025-26 provides financial assistance to Indian nationals pursuing undergraduate and professional courses in select regions (Delhi NCR, Bangalore, Pune, Ahmedabad, or Hyderabad).

Eligibility: Must be an Indian national residing and studying in one of the eligible regions. For undergraduate courses, applicants should have passed Class 12 with a minimum overall score of 60% (current Class 12 students may apply based on previous records). Must come from a lower-income group. Preference will be given to STEM students, female students, and eligible specially-abled or transgender candidates.



Prizes & Rewards: Financial support for covering key educational expenses. ***Last Date to Apply :*** 30-04-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/TCSP5

The Doon School

The Doon School Scholarship Examination (DSSE) is an annual entrance exam conducted by the Doon School, Dehradun, Uttara khand. The scholarship exam is open to male students entering Class 7 or 8, whose families may find it difficult to pay the school fees.

Eligibility: This is open to Indian male students. Applicants must be between 11 to 13 years old as of 30th September 2025. Students must be promoted to Class 7 or 8 in the upcoming academic year.

Prizes & Rewards: An opportunity to pursue studies at the Doon School with financial assistance in the form of scholarship.

Last Date to Apply: 15-04-2025

Application mode: Online and offline via email at admissions@doonschool.com

Short Url : www.b4s.in/aj/DSSE2

buddy4study.com

ఇంటర్మీడియెట్ తరవాత
ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లు

ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తయ్యాయి. విద్యార్థులు ఇక పూర్తిస్థాయిలో ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లపై దృష్టిపెట్టి ఉంటారు. ఇప్పటికే జేఈఈ మెయిన్ రెండో సెషన్ కూడా దాదాపుగా పూర్తి కావచ్చింది. దీనితోపాటు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు రాసే ఇతర ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లు ఇవి.

జేఈఈ మెయిన్ పేపర్-1

ఎన్ఐటీ, ఐఐఐటీ, సీఎఫ్‌టీఐ, ఇతర పేరున్న ఇంజనీరింగ్ కాలేజీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఈ ఎంట్రెన్స్ రాయాలి.
వెబ్‌సైట్: jeemain.nta.nic.in

జేఈఈ అడ్వాన్స్‌డ్:

ఐఐటీల్లోని ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్, ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో చేరడానికి దీనికి రాయాలి. అయితే జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే ఈ ఎంట్రెన్స్ రాయగలరు.
వెబ్‌సైట్: jeeadv.ac.in

బిట్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్

పిలానీ, గోవా, హైదరాబాద్, దుబాయ్‌ల్లో ఉన్న బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బిట్స్) క్యాంపస్‌ల్లో ఇంజనీరింగ్ చేయడానికి ఈ సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ రాయాలి.
వెబ్‌సైట్: bitsadmission.com
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 18

టీజీ ఎప్‌సెట్

తెలంగాణలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం టీఎస్ 'ఇంజనీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్' రాయాల్సి ఉంటుంది.
వెబ్‌సైట్: https://eapcet.tgche.ac.in/
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 9(రూ.250/- ఆలస్య రుసుముతో) (ఐదువేల రూపాయల ఆలస్య రుసుముతో 2025 ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.)

ఏపీ ఎప్‌సెట్

ఆంధ్రప్రదేశ్‌లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం 'ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్' రాయాల్సి ఉంటుంది.
వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 24



విట్టీ

వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌ల అడ్మిషన్స్ కోసం 'విట్టీ' ఎంట్రెన్స్ (వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 'ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ ఎగ్జామ్) రాయాల్సి ఉంటుంది. ఈ విట్‌కు పలు రాష్ట్రాల్లో క్యాంపస్‌లు ఉన్నాయి.
వెబ్‌సైట్: viteee.vit.ac.in
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 7

ఎస్ఆర్ఎమ్ జేఈఈఈ

తమ సంస్థలో అడ్మిషన్ల కోసం ఎస్ఆర్ఎమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ జాతీయ స్థాయిలో ఎంట్రెన్స్ నిర్వహిస్తుంది. ఎస్ఆర్ఎంకు కూడా పలు రాష్ట్రాల్లో క్యాంపస్‌లు ఉన్నాయి.
వెబ్‌సైట్: srmist.edu.in
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 16

సెట్టీ

వివిధ రాష్ట్రాల్లో 'సింబయాసిస్' సంస్థకు ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం ఈ ఎంట్రెన్స్ పరీక్ష రాయాలి.
వెబ్‌సైట్ : www.settest.org/register.html
చివరి తేదీ : 2025 ఏప్రిల్ 12

టీజీ ఆర్‌జేసీ సెట్ 2025

తెలంగాణలోని 35 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన టీజీ ఆర్‌జేసీ సెట్ 2025 నోటిఫికేషన్ వెలువడింది. ఈ మేరకు తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ(టీఆర్ఈఐ) నోటిఫికేషన్ విడుదల చేసింది.

అర్హతలు: 2024-25 విద్యా సంవత్సరంలో మొదటిసారికే పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ కాలేజీల్లో దరఖాస్తు చేయడానికి అర్హులు. ఇవన్నీ కూడా రెసిడెన్షియల్ కళాశాలలు. చదువు, వసతులు అన్నీ కూడా ప్రభుత్వం భరిస్తుంది. ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 6 జీపీఏ, బీసీ, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు కనీసం 5 జీపీఏ సాధించి ఉండాలి.

పరీక్ష తేదీ: 2025 మే10 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు

ఎగ్జామ్ స్కీమ్: ఒక్కో సబ్జెక్టుకు 50 మార్కుల చొప్పున రెండున్నర గంటల్లో 150 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఇది పదో తరగతి స్థాయిలో ఉంటుంది.

ఎంపీసీ : ఇంగ్లీష్, మేథ్స్, ఫిజికల్ సైన్సుల్లో ప్రశ్నలు ఉంటాయి

బైపీసీ: ఇంగ్లీష్, బయో సైన్స్, ఫిజికల్ సైన్స్‌లో ప్రశ్నలు ఉంటాయి

ఎంఈసీ: ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, మేథ్స్‌లో ప్రశ్నలు ఉంటాయి.

చివరి తేదీ: 2025 ఏప్రిల్ 23, **పరీక్ష ఫీజు:** 200/-

పూర్తి వివరాలకు http://tgrjc.cgg.gov.in/. వెబ్‌సైట్ చూడవచ్చు.

టెన్త్ తరవాత డిప్లొమా
లెదర్ టెక్నాలజీతో కెరీర్

● డిప్లొమా ఇన్ లెదర్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ ● డిప్లొమా ఇన్ లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ

టెన్త్ తరవాత పాలిటెక్నిక్ డిప్లొమా చేయవచ్చని అందరికీ తెలిసిందే. అయితే మెకానికల్, సివిల్ వంటి రెగ్యులర్ కోర్సులతోపాటు పాలిటెక్నిక్‌లో ప్రత్యేకమైన కోర్సులు ఉన్నాయి. ఈ డిప్లొమాలు చేస్తే కాలేజీ పట్టాతోపాటే ఉద్యోగం వస్తుంది. చిన్నవయసులోనే మంచి జాబ్ సాధించవచ్చు. అంత డిమాండ్ ఉన్న బ్రాంచ్‌లు ఇవి. ఆ వరుసలో ప్రధానమైన డిప్లొమాల్లో లెదర్ టెక్నాలజీ ఒకటి. హైదరాబాద్‌లోని 'గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ'లో మాత్రమే సంబంధిత డిప్లొమా కోర్సులు ఉన్నాయి.



ఫుట్‌వేర్(పాదరక్షలు), లెదర్ గార్మెంట్స్(తోలు వస్తువులు) ఉత్పత్తిలో మన దేశం రెండో స్థానంలో ఉంది. తోళ్లు/చర్మాల ఉత్పత్తిలో ఇండియా వాటా పదమూడు శాతం. భారతదేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో వేలకొద్ది లెదర్ గూడ్స్, ఫుట్‌వేర్ పరిశ్రమలు ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. విదేశాల్లో లేబర్ వ్యయాలు అధికం. ఇండియాలో లేబర్ ఖర్చులు తక్కువ. నైపుణ్యాలు ఎక్కువ. ఉత్పత్తి వ్యయం కూడా మనదేశంలోనే తక్కువ. ఫలితంగా క్లార్క్స్, బాలే, ఆడిడాస్, ఎక్కో, బుగతి, రీబాక్, టింబర్‌లాండ్, కొలెహాన్, నైక్ వంటి అంతర్జాతీయ బ్రాండ్లు తమ ఉత్పత్తి కేంద్రాలను మనదేశానికి మార్చుకున్నాయి. ఉత్పత్తి అయిన వస్తువులు ఆ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. దాంతో ఇక్కడి కంపెనీలు పెద్ద ఎత్తున ఆర్డర్లు పొందగలుగుతున్నాయి.

మరో అంశం, ఈ రంగంలో వ్యాపార అవకాశాలను గుర్తించిన టాటా, హెచ్ఎల్ఎల్ వంటి కంపెనీలు ఇందులోకి ప్రవేశించాయి. ఈ రంగంలో నైపుణ్యం ఉన్న వ్యక్తుల డిమాండ్‌కు తగ్గట్టుగా కాలేజీలు లేవు.

ఉన్నత చదువులు

లెదర్ టెక్నాలజీలో డిప్లొమాతోనే చదువు ఆపేయనవసరం లేదు. ఈసెట్ రాసి లేటరల్ ఎంట్రీ కింద బీఈ/ బీటెక్ రెండో ఏడాది కోర్సులో చేరవచ్చు. లెదర్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఐటీ, సీఎస్ఈ చేయవచ్చు.

బీటెక్ అందించే కాలేజీలు

- హర్‌కోర్ట్ బట్లర్ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాన్పూర్
- దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్, ఆగ్రా
- అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ, అలీగఢ్
- ముజఫర్‌పూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ముజఫర్‌పూర్
- అలగప్పా కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, చెన్నై
- సీఎస్ఆర్ సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, చెన్నై
- గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ లెదర్ టెక్నాలజీ, కోల్‌కతా

ఏకైక కాలేజీ

తెలంగాణ-హైదరాబాద్‌లో మాత్రమే గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ ఉంది. దీన్ని 1980లో ఏర్పాటు చేశారు. ఏఐసీటీఈ ఆమోదంతో స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్‌కు అనుబంధంగా ఆరంభమైంది. ప్రస్తుతం ఈ కాలేజీ రెండు డిప్లొమా కోర్సులను ఆఫర్ చేస్తోంది.

సీట్లు : ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. పదో తరగతి పాసైనవారు ఇందులో చేరేందుకు అర్హులు. కోర్సులో చేరేందుకు గరిష్ఠ వయోపరిమితి లేదు. 'టీఎస్ పాలిసెట్'లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీటు లభిస్తుంది.

కోర్సు కాలవ్యవధి: ఆరు సెమిస్టర్లు/మూడేళ్ళు. మొదటి అయిదు సెమిస్టర్లూ కాలేజీలోనే థియరీ, ప్రాక్టికల్స్ ఉంటాయి. ఆరో సెమిస్టర్ అంటే చివరి ఆరునెలలూ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. పూర్తిగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కోసం ఈ ఆరు నెలలు కేటాయించారు. ఈ సమయంలో విద్యార్థులు ఇండస్ట్రీ రెడీ విద్యార్థుల తయారవుతారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఉచిత వసతికి తోడు విద్యార్థులకు ఉన్న నైపుణ్యాల నుబట్టి నెలకు రూ.7,000 స్టయిపెండ్‌గా లభిస్తుంది.

ఉద్యోగ అవకాశాలు: దేశీయంగా బాటా వంటి కంపెనీలకు తోడు టాటా ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్ట్ డివిజన్, ఆడిడాస్, రీబాక్, నైక్, హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్(ఎక్స్‌పోర్ట్ డివిజన్), ఫరీదా ఎక్స్‌పోర్ట్స్, ఫ్లోరెన్స్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఈ డిప్లొమా హోల్డర్లకు జాబ్స్ లభిస్తున్నాయి. అంత్రప్రెన్యూర్లుగా మారి సొంతంగా యూనిట్ పెట్టుకోవచ్చు. ఈ డిప్లొమాతోనే కొందరు విద్యార్థులు బహుళ జాతి సంస్థల్లో చేరుతున్నారు. ముఖ్యంగా చైనా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ వంటి దేశాల్లో ఉద్యోగాలు పొందుతున్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965



నటనతో అదరగొట్టారు

ఎన్టీఆర్

"అంచనాలను మించి విజయం సాధించిన 'మ్యాడ్ స్క్వేర్' చిత్రబృందానికి నా అభినందనలు. ఈ విజయం వెనుక దర్శకుడు కల్యాణ్‌శంకర్ కష్టం చాలా ఉంది. ఈ సినిమాలో ప్రధాన పాత్రలు పోషించిన వారంతా తమదైన నటనతో అదరగొట్టారు. కామెడీని పలికించడం కష్టమైన పని. అందుకే నేను 'అదుర్స్ 2' చేయడం లేదు. అప్పట్లోలా ఇప్పుడు నవ్వించలేనేమో అనే భయం ఉంది. కానీ 'మ్యాడ్ స్క్వేర్'లో నార్నె నితిన్ కామెడీని బాగా పండించాడు" అని ఎన్టీఆర్ అన్నారు. ఇటీవలే విడుదలై ఘనవిజయం సాధించిన 'మ్యాడ్ స్క్వేర్' చిత్ర విజయోత్సవ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ "ఈ సినిమా ఇంతటి విజయం సాధించినందుకు ఆనందంగా ఉంది. చిత్రబృందానికి ధన్యవాదాలు" అని చెప్పారు. దర్శకుడు కల్యాణ్ శంకర్ మాట్లాడుతూ "నాగవంశీ లేకుంటే నేను ఉండేవాడ్ని కాదు. నిర్మాత చినబాబు లేకుంటే 'మ్యాడ్' చిత్రం ఉండేది కాదు" అని తెలిపారు.



మోగ్లీ సాహసం

'బబుల్‌గమ్' ఫేమ్ రోషన్ కనకాల నటిస్తున్న చిత్రం 'మోగ్లీ 2025'. సందీప్ రాజ్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సాక్షిసాగర్ మడోల్కర్ హీరోయిన్. శ్రీరామనవమి సందర్భంగా ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. అడవిలో హీరో హీరోయిన్లు ఓ చెట్టుకొమ్మకు వేలాడుతూ ఉన్న ఈ పోస్టర్ ఆసక్తిని పెంచేలా ఉంది. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్ కల్యాణ్, డీఓపీ: రామమారుతి ఎం, సంగీతం: కాలభైరవ.

ప్రేక్షకుల ముందుకు చంద్రేశ్వర




క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రం 'చంద్రేశ్వర'. సురేశ్ రవి, ఆశా వెంకటేశ్ జంటగా నటించారు. జీవీ పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో డాక్టర్ రవీంద్రాచారి నిర్మించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఆధ్యాత్మిక అంశాలకు వినోదాన్ని జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలూ ఈ చిత్రంలో ఉన్నాయి' అని తెలిపారు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి, ఈ నెల్లోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత చెప్పారు.

వైజయంతితో వారసుడు



నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా దర్శకుడు ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. విజయశాంతి శక్తిమంతమైన పోలీస్ పాత్రలో నటించారు. శ్రీకాంత్, సాయిమంజ్రేకర్, సోహైల్ ఖాన్ కీలక పాత్రలు పోషించారు. శ్రీరామనవమి సందర్భంగా ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో విజయశాంతి ముందు కుర్చీలో కూర్చున్న కల్యాణ్‌రామ్.. విలన్ గ్యాంగ్ పనిపడుతూ కనిపించారు. ఈ చిత్రానికి ఎడిటర్: తమ్మిరాజు, డీఓపీ: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

'రామం'కు శ్రీకారం



శ్రీరామ నవమి సందర్భంగా చిత్రాలయం స్టూడియోస్ అధినేత వేణు దోనేపూడి 'రామం' అనే పాన్ ఇండియా సినిమాకు శ్రీకారం చుట్టారు. 'ది రైజ్ ఆఫ్ అకిరా' అనేది దీని ట్యాగ్‌లైన్. టాలీవుడ్ యంగ్ హీరో కథానాయకుడిగా నటిస్తున్నారు. పలువురు దర్శకుల దగ్గర పనిచేసిన లోకమాన్యని ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, మోషన్ పోస్టర్‌ను మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. చిత్ర నిర్మాత వేణు దోనేపూడి మాట్లాడుతూ 'ఇప్పటి వరకు రానటువంటి వైవిధ్యమైన కథతో 'రామం' సినిమాను ప్రేక్షకుల ముందుకు తెస్తున్నాం. చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తాం' అని చెప్పారు.

అనన్య హిందీ చిత్రం



సవాల్‌తో కూడిన పాత్రలను ఎంచుకుంటూ తనలోని నటిని కొత్తతరహాలో తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు టాలీవుడ్ కథానాయిక అనన్య నాగళ్ల. 'మల్లేశం, వకీల్‌సాబ్' తదితర చిత్రాల్లో పాత్రోచిత నటనతో ఆమె ప్రేక్షకులకు చేరువయ్యారు. ఇప్పుడు బాలీవుడ్ అరంగేట్రానికి సిద్ధమయ్యారు అనన్య. మహిళా ప్రాధాన్య కథతో రూపొందుతోన్న హిందీ చిత్రంలో నటిస్తున్నారు. ఏక్తా ఫిలిం ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌లో రూపొందుతోన్న ఈ చిత్రానికి రాకేశ్ జగ్గి దర్శకత్వం వహిస్తున్నారు. హిమ్మత్ లడుమోర్ నిర్మిస్తున్నారు. 'ఇప్పటికే యాభై శాతం చిత్రీకరణ పూర్తయింది. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఓ గిరిజన యువతి పాత్రలో అనన్య నాగళ్ల కనిపించనున్నారు. ఆమె అభినయం చిత్రానికి ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అని మేకర్స్ తెలిపారు.

పుడ్తామా యేటి మళ్లీ

రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ది'. శ్రీరామనవమి సందర్భంగా ఈ సినిమా నుంచి గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. 'ఒకటే పని సేసేనాకి.. ఒకేనాగ బతికేనాకి.. ఇంత పెద్ద బతుకెందుకు.. ఏదైనా ఈ నేల మీద ఉన్నప్పుడే సేసేయాల.. పుడ్తామా యేటి మళ్లీ' అంటూ ఉత్తరాంధ్ర యాసలో రామ్ చరణ్ పలికిన డైలాగులతో మొదలైన ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో రామ్‌చరణ్ క్రికెటర్‌గా కనిపించనున్నారు. ఆయన మాస్ లుక్, ఏఆర్ రెహ్మాన్ సంగీతం, రత్నవేలు విజువల్స్ ప్రధానాకర్షణగా నిలిచాయి. సినిమాను వచ్చే ఏడాది శ్రీరామనవమి సందర్భంగా మార్చి 27న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అదే రోజు రామ్‌చరణ్ పుట్టినరోజు కూడా కావడం విశేషం. కాగా, ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. జగపతిబాబు, కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణ సంస్థలు మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకటసతీష్ కిలారు నిర్మిస్తున్నారు.



చేయిపట్టి లాగారు



నటి శ్రీలీలకు చేదు అనుభవం ఎదురైంది. ముంబైలో షూటింగ్ పూర్తి చేసుకొని తిరిగి వస్తున్న సమయంలో కొందరు ఆకతాయిలు ఆమె చేయి పట్టుకొని బలం ఉపయోగించి తమ గుంపులోకి లాగారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కార్తిక్ ఆర్యన్ హీరోగా అనురాగ్ బసు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రంలో ఆమె నటిస్తున్నారు. షూటింగ్ నిమిత్తం చిత్ర బృందం ఇటీవల డార్జిలింగ్ వెళ్లింది. చిత్రీకరణ అనంతరం కార్తిక్ ఆర్యన్‌తో కలసి శ్రీలీల తిరిగి వస్తుండగా వారిని చూసేందుకు స్థానికులు, అభిమానులు ఆసక్తి చూపించారు. ఈ క్రమంలో వారికి అభివాదం చేసుకుంటూ ఆమె ముందుకు నడిచారు. ఇంతలో బాడీగార్డులు, సెక్యూరిటీ సిబ్బంది ఉన్న గుంపులోంచి కొంత మంది ఆకతాయిలు ఆమె చేయి పట్టుకొని లాగారు. దీంతో శ్రీలీల షాక్‌కు గురయ్యారు. అప్రమత్తమైన సిబ్బంది ఆమెను అక్కడి నుంచి సురక్షితంగా తీసుకెళ్లారు.

సరికొత్త పాత్రలో విక్కీ కౌశల్



'ఛావా'లో శంభాజీ పాత్రలో నటించి మెప్పించిన విక్కీ కౌశల్ ఈసారి ఇంద్రజాలంతో ప్రేక్షకులను మైమరిపించేందుకు సిద్ధమవుతున్నారు. శూజిత్ సిర్కార్ దర్శకత్వంలో 'ఏక్ జాదూగర్' అనే హిందీ చిత్రంలో విక్కీ కౌశల్ మెజీషియన్‌గా నటిస్తున్నారు. రైజింగ్ సన్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. ఆదివారం ఈ సినిమా నుంచి చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేసింది. మెరుస్తున్న ఆకుపచ్చని దుస్తులతో ఇంద్రజాలికుని వేశంలో ఉన్న విక్కీ కౌశల్ లుక్ అదిరిపోయింది.

కదన రంగంలోకి



నటుడు అర్జున్ సర్జా కీలకపాత్ర పోషిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'సీతాపయనం'. శ్రీరామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్ పతాకంపై రూపొందుతోంది. ఈ చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్న హీరో ధ్రువ సర్జా ఫస్ట్‌లుక్‌ను శ్రీరామనవమి సందర్భంగా చిత్రబృందం విడుదల చేసింది. తీక్షణమైన చూపులతో కదన రంగంలోకి దిగుతున్నట్టు ఆయన కనిపించారు. ఈ చిత్రంలో ఐశ్వర్యా అర్జున్ కథానాయిక. నిరంజన్, సత్యరాజ్, ప్రకాశ్‌రాజ్, కోవై సరళ కీలకపాత్రల్లో కనిపించనున్నారు. సంగీతం: అనుప్ రూబెన్స్, సినిమాటోగ్రఫీ: జి. బాలమురుగన్, ఎడిటర్: ఆయూబ్‌ఖాన్

ఓ రామ శ్రీరామ..



బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'జాట్'. సయామీ ఖేర్, రెజీనా కాసాండ్రా హీరోయిన్లు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, జీ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. థియేటర్లలో ఈనెల 10న విడుదలవుతోంది. శ్రీరామ నవమి సందర్భంగా మేకర్స్ ఈ చిత్రం నుంచి 'ఓ రామా శ్రీరామ..' అనే పాటను విడుదల చేశారు. సంగీత దర్శకుడు థమన్ స్వరాలు అందించగా, ధనుంజయ్ ఆలపించారు.

హితేష్‌కు స్వర్ణం

- అభినాష్‌కు రజతమే!
- భారత్‌కు ఆరు పతకాలు
- ప్రపంచ బాక్సింగ్ కప్


అభినాష్ / హితేష్

న్యూఢిల్లీ: ప్రపంచ బాక్సింగ్ కప్‌ను భారత్ ప్రశంసనీయంగా ముగించింది. బ్రెజిల్‌లో జరిగిన ఈ టోర్నీలో మనోళ్లు ఒక స్వర్ణం సహా ఆరు పతకాలతో సత్తా చాటారు. 70 కి. విభాగంలో హితేష్ విజేతగా నిలవడం ద్వారా పసిడి పతకం అందించాడు. 65కి.లలో అభినాష్ జమ్వాల్ రజతం సొంతం చేసుకున్నాడు. జదుమణి సింగ్ (50కి.), మనీష్ రాథోడ్ (55కి.), సచిన్ (60కి.), విశాల్ (90కి.) కాంస్య పతకాలు సాధించారు. ప్రపంచ కప్‌లో మొత్తం 10 మంది బాక్సర్లు భారత్ తరఫున బరిలో దిగారు.



రిటైర్మెంట్.. ఇప్పుడే కాదు..!

● స్పష్టతనిచ్చిన ధోనీ

న్యూఢిల్లీ: తన ఐపీఎల్ రిటైర్మెంట్‌పై వస్తున్న ఊహాగానాలను ధోనీ కొట్టిపడేశాడు. ఈ సీజన్ చివరి వరకు ఆడతానని స్పష్టం చేశాడు. శనివారం చెపాక్‌లో ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌కు మహీ తల్లిదండ్రులు హాజరు కావడంతో అతడికి ఇదే చివరి మ్యాచ్ అనే వార్తలు నెట్‌లో హల్‌చల్ చేశాయి. కానీ, మ్యాచ్ ముగిసిన తర్వాత మహీ ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు. ఓ పాడ్‌కాస్ట్‌లో తన రిటైర్మెంట్ ఊహాగానాలను ధోనీ ఖండించాడు. 'ఇప్పటికిప్పుడు లీగ్‌కు గుడ్‌బై చెప్పలేను. ఈ సీజన్ ముగిసిన తర్వాత.. జూలైలో 44వ సంవత్సరంలోకి అడుగుపెడతా. ఇంకా ఆడాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకోవడానికి అప్పటికి మరో 10 నెలల సమయం ఉంటుంది. నా రిటైర్మెంట్ నిర్ణయం తీసుకొనేది నేను కాదు.. నా శరీరం. సీజన్ ఆరంభానికి ముందు శరీరం సహకరిస్తుంటే ఆడతా. లేకపోతే గుడ్‌బై చెబుతాన'ని ధోనీ చెప్పాడు.

బుమ్రా సిద్ధం

బెంగళూరుతో నేటి మ్యాచ్ బరిలో..



ముంబై : భారత జట్టు స్టార్ పేసర్ బుమ్రా ఐపీఎల్ బరిలో దిగుతున్నాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో సోమవారం ఇక్కడ జరిగే మ్యాచ్‌లో బుమ్రా ఆడనున్నాడు. ఈమేరకు అతడు ముంబై ఇండియన్స్ జట్టులో చేరాడు. గత జనవరిలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ఐదో, చివరి టెస్ట్ సందర్భంగా బుమ్రా వెన్ను గాయానికి లోనైన సంగతి తెలిసిందే. దాంతో చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. 'బెంగళూరుతో సోమవారం జరిగే మ్యాచ్‌లో బుమ్రా బరిలోకి దిగుతున్నాడు. ఆదివారంనాడు అతడు సాధన చేశాడు' అని ముంబై ఇండియన్స్ కోచ్ మహేల జయవర్ధనే వెల్లడించాడు. ఇక..మోకాలి గాయంతో లఖ్‌నవూతో గత మ్యాచ్‌కు దూరమైన రోహిత్ శర్మ వాంఖడేలో ఆదివారం నెట్ ప్రాక్టీస్ చేశాడు. 'రోహిత్ నెట్స్‌లో బ్యాటింగ్ సాధన చేశాడు. కానీ బ్యాటింగ్ సమయంలో సౌకర్యంగా లేడు' అని జయవర్ధనే తెలిపాడు.

రోహిత్‌తో ఆటను ఆస్వాదిస్తా..: కోహ్లీ



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలది ప్రత్యేక స్థానం. దశాబ్దాలుగా ఇద్దరూ కలిసి ఆడుతుండడంతో పాటు ఎన్నో విజయాలు అందించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో రోహిత్‌తో కలిసి ఆడడాన్ని ఎంతగానో ఆస్వాదించినట్టు విరాట్ తెలిపాడు. 'ఇద్దరం దాదాపు ఒకేసారి జట్టులోకి వచ్చాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు మాది సుదీర్ఘ ప్రయాణం. కలిసి ఆడాం.. కలిసి నేర్చుకున్నాం. ఎన్నో ఆలోచనలను పంచుకున్నాం. అలాగే ఒకరిపై మరొకరం నమ్మకం ఉంచుతూ జట్టు విజయాల కోసం తోడ్పడ్డాం. ఈ క్రమంలో మా మధ్య ఎన్నో మధుర స్మృతులున్నాయి. వాటన్నింటినీ ఎంజాయ్ చేశాను' అని విరాట్ పేర్కొన్నాడు.

రైజర్స్.. మరోసారి

సొంత మైదానంలోనైనా అదరగొట్టేస్తుందేమోనని ఆశించిన సన్‌రైజర్స్ అభిమానులకు నిరాశే ఎదురైంది. తాము దూకుడుగానే ఆడతామని కెప్టెన్ ప్యాట్ కమిన్స్ టాస్‌కు ముందు బీరాలు పలికినా.. పేసర్ సిరాజ్ కెరీర్ బెస్ట్ బౌలింగ్ (4/17)కు బ్యాటింగ్ ఆర్డర్ చెల్లాచెదురైంది. ఇక హైదరాబాద్ బౌలింగ్‌లోనూ పస లేకపోవడంతో గుజరాత్ టైటాన్స్ ఆడుతూ పాడుతూ హ్యాట్రిక్ విజయాన్ని పూర్తి చేసింది.


కమిన్స్

సొంతగడ్డపై చెలరేగిన సిరాజ్
గిల్ అర్ధసెంచరీ
గుజరాత్ హ్యాట్రిక్


సిరాజ్ (4/17)కు రషీద్ అభినందన


గిల్ (61 నాటౌట్)

1 ఐపీఎల్ కెరీర్‌లో సిరాజ్‌కిదే బెస్ట్ బౌలింగ్ (4/17). అలాగే ఈ లీగ్‌లో వంద వికెట్ల (97 మ్యాచ్‌ల్లో)ను కూడా పూర్తి చేశాడు.

హైదరాబాద్: అన్ని విభాగాల్లో విఫలమైన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు వరుసగా నాలుగో ఓటమి. అటు వేదిక ఏదైనా విజయమే లక్ష్యంగా గుజరాత్ టైటాన్స్ చెలరేగుతోంది. ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకున్న టైటాన్స్ ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ ఓటమితో రైజర్స్ తమ ఆఖరి స్థానాన్ని మరింత పదిలపర్చుకున్నట్టయ్యింది. అలాగే ఎస్‌ఆర్‌హెచ్‌పై గిల్ సేనకిది వరుసగా నాలుగో విజయం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 152 పరుగులు చేసింది. నితీశ్ (31), క్లాసెన్ (27), కమిన్స్ (22 నాటౌట్) మాత్రమే రాణించారు. సిరాజ్‌కు నాలుగు.. సాయికిశోర్, ప్రసిద్ధ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 16.4 ఓవర్లలో 3 వికెట్లకు 153 పరుగులు చేసి గెలిచింది. గిల్ (43 బంతుల్లో 9 ఫోర్లతో 61 నాటౌట్) తుదికంటా నిలవగా.. సుందర్ (29 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 49), రూథర్‌ఫోర్డ్ (16 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 35 నాటౌట్) వేగంగా ఆడారు. షమికి రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సిరాజ్ నిలిచాడు.

గిల్-సుందర్ అండతో..: స్వల్ప ఛేదన కోసం బరిలోకి దిగిన టైటాన్స్ తొలి ఐదు ఓవర్లలో చేసింది 28 పరుగులే. పైగా నిలకడగా రాణిస్తున్న ఓపెనర్ సాయిసుదర్శన్ (5), బట్లర్ (0)ల వికెట్లను కూడా కోల్పోయింది. ఈ స్థితిలో మ్యాచ్ రసవత్తరంగాసాగే అవకాశం ఉందనిపించింది. కానీ నాలుగో నెంబర్‌లో బరిలోకి దిగిన వాషింగ్టన్ సుందర్ ఒక్కసారిగా సీన్ మార్చేశాడు. ఆరో ఓవర్‌లో అతడు 20 పరుగులు సాధించి టైటాన్స్‌లో జోష్ నింపాడు. అనంతరం గిల్-సుందర్ జోడీ ఎలాంటి ఇబ్బందీ లేకుండా ముందుకు సాగింది. 36 బంతుల్లో గిల్ ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. మూడో వికెట్‌కు 90 పరుగుల భారీ భాగస్వామ్యం జత చేశాక షమి ఓవర్‌లో సుందర్ అవుటయ్యాడు. అనికేత్ ఈ క్యాచ్‌ను పట్టడానికి ముందు బంతి నేలకు తాకినట్టు కనిపించినా థర్డ్ అంపైర్ అవుటివ్వడం చర్చనీయాంశమైంది. ఇక అభిషేక్ ఓవర్‌లో రూథర్‌ఫోర్డ్ 18 రన్స్ రాబట్టడంతో రైజర్స్‌కు ఏమూలో ఉన్న ఆశలు కూడా అడుగంటాయి. 16వ ఓవర్‌లో గిల్ రెండు ఫోర్లతో సమీకరణం 24 బంతులు 12 పరుగులకు మారింది. కానీ రూథర్‌ఫోర్డ్ 6,4తో మరో 20 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

సిరాజ్ హవా: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్‌ను టైటాన్స్ బౌలర్లు కట్టడి చేశారు. ముఖ్యంగా పేసర్ సిరాజ్.. పవర్‌ప్లే, డెత్ ఓవర్లలో వికెట్ల వేట సాగించాడు. మొదటి 12 ఓవర్లపాటు వీరి ఇన్నింగ్స్‌లో ఒక్క సిక్సర్ కూడా నమోదు కాకపోవడం గమనార్హం. అంతేకాకుండా ఆఖరి ఓవర్‌లోనే అత్యధికంగా 17 పరుగులు సమకూరాయి. నితీశ్-క్లాసెన్ జోడీ కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకుంది. రెండు వరుస ఫోర్లతో జోష్ నింపిన ఓపెనర్ హెడ్ (8)ను ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే పేసర్ సిరాజ్ దెబ్బతీశాడు. ఆ తర్వాత మరో ఓపెనర్ అభిషేక్ (18), ఇషాన్ (17) బౌండరీలతో స్కోరును ముందుకు తీసుకెళ్లారు. కానీ ఐదో ఓవర్‌లో ఒకే పరుగిచ్చి అభిషేక్‌ను సిరాజ్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 45/2 స్కోరుకే పరిమితమైంది. ఆ తర్వాత పిచ్ నెమ్మదించడంతో క్రీజులో ఉన్న నితీశ్, క్లాసెన్ కుదురుకునేందుకు ప్రాధాన్యమిచ్చారు. దీంతో 5-10 ఓవర్ల మధ్య వీరి నుంచి ఒక్క ఫోర్ కూడా నమోదు కాలేదు. చివరకు 11వ ఓవర్‌లో నితీశ్ రెండు ఫోర్లు సాధించగా, 13వ ఓవర్‌లో క్లాసెన్ 4,6తో ఆకట్టుకున్నాడు. ఇక ట్రాక్‌లోకి వచ్చాడనుకున్న క్లాసెన్‌ను సాయికిశోర్ ఫ్లాట్ డెలివరీతో బౌల్డ్ చేశాడు. దీంతో నాలుగో వికెట్‌కు 50 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు భారీ షాట్‌కు ప్రయత్నించిన నితీశ్‌ను సాయికిశోర్.. కమిందు (1)ను ప్రసిద్ధ్ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చారు. కానీ 19వ ఓవర్‌లో మూడు పరుగులే ఇచ్చిన సిరాజ్ కళ్లు చెదిరే ఇన్‌స్వింగ్ యార్కర్లతో అనికేత్, సిమర్జీత్ (0) వికెట్లను పడగొట్టాడు. అయితే ఆఖరి ఓవర్‌లో కమిన్స్ 4,6.. షమి (6 నాటౌట్) 4తో సన్‌రైజర్స్ స్కోరు 150 దాటగలిగింది.

ఐపీఎల్‌లో నేడు | వేదిక ముంబై
ముంబై x బెంగళూరు రా.7.30

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	3	3	0	0	6	1.257
గుజరాత్	4	3	1	0	6	1.031
బెంగళూరు	3	2	1	0	4	1.149
పంజాబ్	3	2	1	0	4	0.074
కోల్‌కతా	4	2	2	0	4	0.070
లఖ్‌నవూ	4	2	2	0	4	0.048
రాజస్థాన్	4	2	2	0	4	-0.185
ముంబై	4	1	3	0	2	0.108
చెన్నై	4	1	3	0	2	-0.891
హైదరాబాద్	5	1	4	0	2	-1.629

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

హైదరాబాద్: అభిషేక్ (సి) తెవాటియా (బి) సిరాజ్ 18; హెడ్ (సి) సాయి సుదర్శన్ (బి) సిరాజ్ 8; ఇషాన్ (సి) ఇషాంత్ (బి) ప్రసిద్ధ్ 17; నితీశ్ (సి) రషీద్ (బి) సాయికిశోర్ 31; క్లాసెన్ (బి) సాయికిశోర్ 27; అనికేత్ (ఎల్బీ) సిరాజ్ 18; కమిందు (సి) సాయి సుదర్శన్ (బి) ప్రసిద్ధ్ 1; కమిన్స్ (నాటౌట్) 22; సిమర్జీత్ (బి) సిరాజ్ 0; షమి (నాటౌట్) 6; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 152/8. వికెట్ల పతనం:** 1-9, 2-38, 3-50, 4-100, 5-105, 6-120, 7-135, 8-135; **బౌలింగ్:** సిరాజ్ 4-0-17-4; ఇషాంత్ శర్మ 4-0-53-0; ప్రసిద్ధ్ కృష్ణ 4-0-25-2; రషీద్ ఖాన్ 4-0-31-0; సాయి కిశోర్ 4-0-24-2.

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) అనికేత్ (బి) షమి 5, గిల్ (నాటౌట్) 61, బట్లర్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 0, సుందర్ (సి) అనికేత్ (బి) షమి 49, రూథర్‌ఫోర్డ్ (నాటౌట్) 35, **ఎక్స్‌ట్రాలు: 3 ; మొత్తం 16.4 ఓవర్లలో 153/3 ; వికెట్లపతనం :** 1-15, 2-16, 3-106 ; **బౌలింగ్:** షమి 4-0-28-2, కమిన్స్ 3.4-0-26-1, సిమర్జీత్ సింగ్ 1-0-20-0, ఉనాద్కట్ 2-0-16-0, జీషన్ అన్సారీ 4-0-33-0, కమిందు మెండిస్ 1-0-12-0, అభిషేక్ శర్మ 1-0-18-0.

విజేత వెర్‌స్టాపెన్

జపనీస్ గ్రాండ్ ప్రీ



సుజుక (జపాన్): వరల్డ్ చాంపియన్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ వరుసగా నాలుగోసారి జపనీస్ గ్రాండ్ ప్రీ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో పోల్ పొజిషన్ నుంచి రేస్‌ను ఆరంభించిన రెడ్ బుల్స్ డ్రైవర్ వెర్‌స్టాపెన్.. ప్రత్యర్థుల నుంచి గట్టిపోటీ ఎదురైనా తట్టుకొని అగ్రస్థానంలో నిలిచాడు. మెక్ లారెన్స్‌కు చెందిన డ్రైవర్లు నోరిస్, పియాస్ట్రి రెండు, మూడు స్థానాలు దక్కించుకొన్నారు.

రుద్రాంక్ష్‌కు పసిడి



బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ వరల్డ్‌కప్‌లో రుద్రాంక్ష్ భారత్‌కు రెండో స్వర్ణాన్ని అందించాడు. ఆదివారం జరిగిన పురుషుల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్లో రుద్రాంక్ష్ 252.9 పాయింట్లతో టాప్‌లో నిలిచి పసిడి పతకం సొంతం చేసుకొన్నాడు. ఇస్ట్వాన్ మార్టిన్ (హంగేరి) 251.7 పాయింట్లతో రజతం, మార్సెల్లో గుజెరజ్ (అర్జెంటీనా) 230.1 పాయింట్లతో కాంస్యం దక్కించుకొన్నారు. కాగా, క్వాలిఫయర్స్‌లో అదరగొట్టిన అర్జున్ బబూటా ఏడో స్థానానికే పరిమితమయ్యాడు.

బిజినెస్



3 రోజులు.. 3 విమానాల్లో

అమెరికాకు యాపిల్ ఫోన్ల ఎగుమతి

ట్రం'పోటు' తప్పించుకునేందుకు కంపెనీల కొత్త అస్త్రం
భారీ పరిమాణంలో ఐఫోన్లు, వజ్రాభరణాల తరలింపు
అయినా ఫోన్ల ధరలు పెరగవు: యాపిల్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలను తప్పించుకునే లక్ష్యంతో యాపిల్ కంపెనీ కేవలం మూడు రోజుల వ్యవధిలో భారత్ నుంచి నిండుగా లోడ్ చేసిన మూడు విమానాల్లో ఐఫోన్లను అమెరికాకు తరలించింది. సీనియర్ భారత ప్రభుత్వ అధికారులు ఈ విషయం ధ్రువీకరించారు. ట్రంప్ ప్రభుత్వం 10% టారిఫ్‌ల ప్రకటన వెలువడడం కన్నా ముందు మార్చి చివరి వారంలో ఈ ఐఫోన్ల తరలింపు జరిగిందన్నారు. అంతేకాదు కొత్త టారిఫ్‌లు అమలులోకి వచ్చినప్పటికీ భారత్‌లో గాని, ఇతర దేశాల మార్కెట్లో గాని తక్షణ చర్యగా ఐఫోన్ల ధరలు పెంచే ఆస్కారం లేదని యాపిల్ స్పష్టం చేసింది. సాంప్రదాయికంగా వస్తు రవాణా పరిశ్రమకు ఇది అంత రద్దీ ఉండని సమయం. అయినప్పటికీ ట్రంప్ చర్యల నేపథ్యంలో చైనా, భారతదేశాల్లోని తమ ఫ్యాక్టరీల నుంచి భారీగా యాపిల్ కంపెనీ ఐఫోన్లను తరలించిందని వారు తెలిపారు. టారిఫ్‌లకు ముందే భారీ పరిమాణంలో ఐఫోన్ల తరలింపు వల్ల యాపిల్ కంపెనీ స్థిరమైన ధరలను నిర్వహించగలిగిందంటున్నారు. దీంతో అమెరికాలోని యాపిల్ కంపెనీ గిడ్డంగులన్నీ భారీ ఐఫోన్ నిల్వలు కలిగి ఉన్నాయి. అలాగే కొత్త టారిఫ్‌ల ప్రభావం తమపై ఎంత మేరకు ఉంటుందని మదింపు చేసుకునే లోగా ధరలు పెంచే పని లేకుండా జరిగిపోయింది. భారత్ నుంచి ఈ ఆకస్మిక ఎగుమతుల వృద్ధి ఒక్క యాపిల్‌కే పరిమితం కాలేదు. ముంబై నుంచి వజ్రాభరణాల ఎగుమతులు సైతం ఏప్రిల్ 1-4 తేదీల మధ్య కాలంలో ఆరు రెట్లు పెరిగి 34.4 కోట్ల డాలర్లకు చేరినట్టు చెబుతున్నారు. అలాగే దుస్తుల ఎగుమతుల్లో కూడా వేగం పెరిగింది.

- జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్.. థామస్ కుక్ (ఇండియా) లిమిటెడ్, ఎస్‌ఓటీసీ ట్రావెల్‌తో వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఈ సంస్థలకు ట్రావెల్, వ్యయ నిర్వహణ సొల్యూషన్స్‌ను జాగిల్ అందించనుంది.

- కిరాణా భాగస్వాముల కోసం ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్.. వ్యాపారీ దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ నెల 13 వరకు అన్ని ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ స్టోర్లు, ఆన్‌లైన్, మొబైల్ యాప్‌లలో ఈ సేల్ అందుబాటులో ఉండనుంది. ఈ ఆఫర్‌లో భాగంగా వ్యక్తిగత, గృహ సంరక్షణ, ఆహారోత్పత్తులు, పానీయాల వంటి వివిధ ఉత్పత్తులపై భారీగా ఆఫర్లను అందించనున్నట్లు ప్రకటించింది.

ఇక ఒక రాష్ట్రం-ఒకే ఆర్‌ఆర్‌బీ విధానం

ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రణాళిక సిద్ధం



న్యూఢిల్లీ: ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు (ఆర్‌ఆర్‌బీ)ల్లో నిర్వహణాపరమైన సమర్థతను సాధించి, వ్యయాలను హేతుబద్ధీకరించేందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ త్వరలో "ఒక రాష్ట్రం-ఒకే ఆర్‌ఆర్‌బీ" విధానం అనుసరించేందుకు రెడీ అవుతోంది. ఫలితంగా ప్రస్తుతం 43గా ఉన్న ఆర్‌ఆర్‌బీల సంఖ్య 28కి తగ్గుతుంది. ఆర్‌ఆర్‌బీల కన్సాలిడేషన్ ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని, తుదివిడత ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కావచ్చని ఆర్థిక శాఖ వర్గాలంటున్నాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ రూపొందించిన ప్రణాళిక ప్రకారం త్వరలోనే వివిధ రాష్ట్రాల్లోని 15 ఆర్‌ఆర్‌బీలను విలీనం చేసే ఆస్కారం ఉంది. ఇందులో ఆంధ్రప్రదేశ్ గరిష్ఠంగా 4 ఆర్‌ఆర్‌బీలతో అగ్రస్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మూడేసి, బిహార్, గుజరాత్, జమ్ము-కశ్మీర్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్‌లలో రెండేసి ఆర్‌ఆర్‌బీలున్నాయి. తెలంగాణ రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) ఆస్తులు, అప్పులను ఏపీజీవీబీ, తెలంగాణ గ్రామీణ బ్యాంకుల మధ్య విభజించే ప్రక్రియ పూర్తయింది. ఇందుకు నాందిగా ఆర్‌ఆర్‌బీలకు నిధుల కల్పన కూడా జరిగింది. ఆర్‌ఆర్‌బీల వృద్ధికి అవసరమైన మూలధనం అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2021-22 సంవత్సరంలో రూ.5,445 కోట్ల నిధులను అందించింది. ఫలితంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌ఆర్‌బీల పనితీరు గణనీయంగా మెరుగుపడింది. ఆర్‌ఆర్‌బీలన్నింటి ఉమ్మడి నికరలాభం జీవితకాల గరిష్ఠ స్థాయిలో రూ.7,571 కోట్లుగా నమోదైంది. వాటి సీఏఆర్ కూడా ఈ ఏడాది మార్చి 31 నాటికి ఆల్ టైమ్ గరిష్ఠం 14.2 శాతానికి చేరింది. స్థూల మొండి బకాయిలు పదేళ్ల కనిష్ఠ స్థాయి 6.1 శాతానికి దిగి వచ్చింది. ఆర్‌ఆర్‌బీల కన్సాలిడేషన్ ప్రక్రియను ప్రభుత్వం 2004-05 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించి మూడు దశల్లో విలీనం చేయడంతో అప్పటికి 196గా ఉన్న ఆర్‌ఆర్‌బీలు ఇప్పుడు 43కి తగ్గాయి.

మరో పావు శాతం వడ్డీ కోత

నేటి నుంచి ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశం

ముంబై: కీలక రెపో రేటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరో పావు శాతం తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ద్రవ్యోల్బణం 4% కన్నా దిగిరావడమే ఇందుకు కారణం. దీనికి తోడు అమెరికా ప్రతీకార సుంకాలు విధించిన నేపథ్యంలో వృద్ధిని ఉద్దీపింప చేయాల్సిన అవసరం సైతం ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు సమావేశమవుతున్న ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) బుధవారం ప్రకటించనున్న నూతన ఆర్థిక సంవత్సరపు తొలి పాలసీలో రెపో రేటును మరో పావు శాతం తగ్గించే ఆస్కారం ఉందని ఆర్థిక నిపుణులంటున్నారు. ఫిబ్రవరి పాలసీలో 0.25 శాతం తగ్గింపుతో ప్రస్తుతం రెపో రేటు 6.25 శాతం వద్ద ఉంది. ఈసారి మరో పావు శాతం తగ్గించినట్టయితే 6 శాతానికి దిగొస్తుంది. ఫలితంగా గృహ, వినియోగ, పారిశ్రామిక రుణాలపై వడ్డీ రేట్లు మరింతగా తగ్గి అన్ని వర్గాలకు ఊరట లభిస్తుంది.

23,200 పైన బుల్లిష్

(ఏప్రిల్ 1-4 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

చార్ట్ చూపు

గత వారం నిఫ్టీ: 22,904 (-615)

నిఫ్టీ గత వారం 22,857-23,566 పాయింట్ల మధ్యన కదలాడి 615 పాయింట్ల నష్టంతో 22,904 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,200 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,167, 23,361, 23,227, 22,836 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,200 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 22,600
నిరోధ స్థాయిలు: 23,100, 23,200, 23,300 (23,000 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22,700, 22,600, 22,500 (22,800 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	440
వరంగల్	412	గోదావరి	435
చిత్తూరు	480	విశాఖపట్నం	445
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	115
వరంగల్	100	గుంటూరు	117
కరీంనగర్	100	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	85
కర్నూలు	100	నెల్లూరు	90
విశాఖపట్నం	109	అనంతపురం	90
గోదావరి	115		

వేచి చూసే ధోరణి బెస్ట్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశాలున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన టారిఫ్స్ అమల్లోకి రావటంతో ప్రపంచ మార్కెట్లు షేక్ అవుతున్నాయి. ట్రంప్‌నకు పోటీగా చైనా సహా మిగిలిన దేశాలు ప్రతీకార సుంకాలను ప్రకటించటంతో అనిశ్చితి పెరిగింది. భారత్‌పై దీని ప్రభావం తక్కువే అయినప్పటికీ నెగటివ్ సెంటిమెంట్‌తో సూచీలు పడిపోయే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో మదుపరులు వేచి చూసే ధోరణిలో ఉండటం ఉత్తమం. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల షేర్లలో మూమెంటమ్ కనిపిస్తోంది.

స్టాక్ రికమండేషన్స్

అపోలో హాస్పిటల్స్: జీవితకాల గరిష్ఠం నుంచి 20 శాతం మేర పతనమైన ఈ షేరు ప్రస్తుతం టర్న్ అరౌండ్ అయ్యాయి. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా ట్రేడవుతోంది. గత శుక్రవారం రూ.6,714 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.6,700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.6,850/6,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.6,660 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

అదానీ పవర్: గత ఏడాది జూన్ నుంచి వరుసగా పతనమైన ఈ కౌంటర్‌లో ప్రస్తుతం బేస్ ఏర్పడుతోంది. రూ.500 స్థాయిలో మద్దతు తీసుకుని కన్సాలిడేట్ అవుతున్నాయి. గత వారం చివరి మూడు సెషన్లలో బాగా రాణించాయి. గత శుక్రవారం రూ.532 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.530/520 శ్రేణిలో ప్రవేశించి రూ.590 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.510 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టొరెంట్ ఫార్మా: డొనాల్డ్ ట్రంప్ దెబ్బకు ఫార్మా రంగంలోని షేర్లు కుదేలవుతున్నప్పటికీ ఈ షేరు మాత్రం అనూహ్యంగా పెరుగుతోంది. నెల రోజుల్లోనే 15 శాతం మేర పెరిగింది. నిఫ్టీతో పోల్చితే మెరుగ్గా రాణిస్తోంది. గత శుక్రవారం రూ.3,286 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.3,260 వద్ద పొజిషన్ తీసుకుని రూ.3,400 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,220 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్: గత ఏడాది నవంబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ఈ ఏడాది మార్చి నుంచి పుంజుకుంది. దాదాపు 20 శాతం మేర పెరిగింది. ప్రస్తుతం రూ.1,100 స్థాయిలో బేస్ ఏర్పడుతోంది. బెంచ్‌మార్క్ సూచీలు ఒడుదొడుకులకు లోనైనప్పటికీ ఈ షేరు మాత్రం రాణిస్తోంది. గత శుక్రవారం రూ.1,165 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,140 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,250/1,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,100 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇండస్ టవర్: జీవితకాల గరిష్ఠం నుంచి 30 శాతం మేర దిద్దుబాటుకు లోనైన ఈ షేరు ప్రస్తుతం మంచి బేస్ ఏర్పరచుకుంటోంది. గత ఏడాది నవంబరు నుంచి డార్వాస్ బాక్స్ మాదిరిగా చలిస్తున్నాయి. కీలకమైన రూ.320 స్థాయిలో మరోసారి మద్దతు తీసుకుని పుంజుకున్నాయి. గత శుక్రవారం రూ.360 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.350 వద్ద పొజిషన్ తీసుకుని రూ.410 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.320 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

భారీ కరెక్షన్‌కు ఆస్కారం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కీలక స్థాయి 23,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమై ముందు వారంతో పోల్చితే 615 పాయింట్ల నష్టంతో 22,900 వద్ద ముగిసింది. 2,000 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించిన నేపథ్యంలో ఈ కరెక్షన్ ఊహించినదే అయినప్పటికీ సాధారణం కన్నా అధికంగా ఉండడం అప్రమత్త సంకేతం. రాబోయే కొద్ది రోజుల్లో మార్కెట్ నిలదొక్కుకుంటే తప్ప తక్షణ ర్యాలీకి ఆస్కారం లేదు. అమెరికన్ మార్కెట్లలో గత శుక్రవారం ఏర్పడిన తీవ్ర బేరిష్ ధోరణి వల్ల ఈ వారం మన మార్కెట్ భారీ ప్రతికూల ధోరణిలోనే ప్రారంభం కావచ్చు. తీవ్రమైన కదలికలకు కూడా ఆస్కారం ఉంది. వారం ప్రారంభ ట్రేడింగ్ ఎలా ఉంటుందో కూడా ఊహించడం కష్టం. ఇటీవల ఏర్పడిన కనిష్ఠ స్థాయిల్లో మరోసారి పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: మరింత బలహీనత సాధించినట్టయితే కనిష్ఠ స్థాయి 22,500 వద్ద మద్దతు తీసుకోవలసి ఉంటుంది. అప్పుడు మాత్రమే సానుకూల సంకేతం వెలువడుతుంది. రికవరీ బాట పడితే మానసిక అవధి 23,000.

బేరిష్ స్థాయిలు: 22,500 వద్ద మద్దతు తీసుకోలేకపోతే మరింత బలహీనతలో పడుతుంది. మద్దతు స్థాయి 22,350. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడుతుంది. తదుపరి మద్దతు స్థాయిలు 22,200, 22,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ మాత్రం గత వారంలో మైనర్ రియాక్షన్ మాత్రమే సాధించి 51,500 వద్ద ముగిసింది. గత రెండు వారాల్లో 52,000 వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. స్వల్పకాలిక మద్దతు స్థాయి 50,800 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 50, 100 డీఎంఏల కన్నా దిగువకు వచ్చింది. సానుకూలత కోసం 22,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" తప్పనిసరిగా పునరుజ్జీవం సాధించాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు | నిరోధం : 22,550, 22,700

సచివాలయంలో ఏఐసీసీ ఇన్‌చార్జ్ సమీక్షనా..?

» మంత్రివర్గ విస్తరణలో ఏఐసీసీదే నిర్ణయమా?

» తెలంగాణలో పాలనను భ్రష్టు పట్టించారు: సంజయ్



కరీంనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సచివాలయంలో మంత్రుల కమిటీతో ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్ సమీక్ష చేయడమేంటని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంజయ్ మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణపై ఏఐసీసీ అధిష్ఠానానిదే తుది నిర్ణయమని పీసీసీ అధ్యక్షుడు చెప్పడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రబ్బర్ స్టాంపులా మారారన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరుండాలనేది ముఖ్యమంత్రి విచక్షణాధికారమని, కానీ ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుందని ప్రకటించడం.. సచివాలయంలో కాంగ్రెస్ నేత సమీక్ష చేయడం, హెచ్‌సీయూ భూముల వ్యవహారం వంటివి తెలంగాణలో పాలన భ్రష్టు పట్టిందనడానికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణ సొమ్మును దోచుకుని ఢిల్లీకి కప్పం కడుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటై మజ్లి్స్‌ను గెలిపించాలనుకుంటున్నాయని ఆరోపించారు. దేశద్రోహ ఎంఐఎం, దేశభక్త బీజేపీ మధ్య హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ జరుగుతోందని చెప్పారు. బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏనాడో కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. కేంద్రం సంక్షేమ పథకాలను తెలంగాణలో పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. సన్నబియ్యం పథకానికి కేంద్రం రూ.37 ఇస్తుంటే రాష్ట్రం రూ.పది మాత్రమే భరిస్తోందని చెప్పారు. అలాంటప్పుడు రేషన్ షాపుల వద్ద మోదీ ఫొటో ఎందుకు పెట్టడం లేదని సంజయ్ ప్రశ్నించారు.

భూముల వేలాన్ని విరమించుకోవాలి

» కంచె గచ్చిబౌలిని శాశ్వతంగా కాపాడుకుందాం

» విద్యార్థులు, పర్యావరణవేత్తలకు కేటీఆర్ లేఖ



హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఒక రియల్‌ఎస్టేట్ దళారి మాదిరిగా ఆర్థిక ప్రయోజనాల గురించి ఆలోచించకుండా, భవిష్యత్ ప్రయోజనాల కోసం కంచె గచ్చిబౌలి భూముల వేలాన్ని పూర్తిగా విరమించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు 400 ఎకరాల భూమిని కాపాడేందుకు నిస్వార్థంగా చేపట్టిన ఆందోళన అద్భుతమని పేర్కొన్నారు. ఈ భూములను శాశ్వతంగా కాపాడుకునేందుకు ఐక్యపోరాటం చేద్దామని విద్యార్థులు, పర్యావరణవేత్తలను ఆదివారం బహిరంగ లేఖ ద్వారా ఆయన కోరారు. 50 ఏళ్లకుపైగా సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ పరిరక్షణకు, విజ్ఞానానికి కేంద్రంగా నిలిచిందని, కాంగ్రెస్ చెబుతున్న ఏకోపార్క్ కన్నాగొప్పగా పర్యావరణ సమతుల్యత కలిగిందిగా ఈ క్యాంపస్ నిలిచిందని తెలిపారు. ప్రకృతికి విఘాతంకలగకుండా, యూనివర్సిటీకి ప్రమాదం రాకుండా తమ పార్టీ విద్యార్థులకు అండగా ఉంటుందన్నారు. భూములను కాపాడుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం సాగిద్దామని, దీనికి విద్యార్థులు, పర్యావరణవేత్తలు, ప్రముఖులు, తెలంగాణ ప్రజలు కలిసి రావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

ఆ భూముల వేలంలో ఎవరూ పాల్గొనొద్దు: కృష్ణయ్య

బర్కత్‌పుర, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన కంచ గచ్చిబౌలి భూముల వేలంలో ఎవరూ పాల్గొనవద్దని, కాదని, ఒకవేళ ఆ భూములను కొనుగోలు చేస్తే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక వాటిని తిరిగి స్వాధీనం చేసుకుంటుందని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఆ 400 ఎకరాల భూములను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి అప్పగించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కంచ గచ్చిబౌలిలోని భూముల అమ్మకాల ప్రతిపాదనను రేవంత్ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అన్ని రంగాల్లో బీసీల అణచివేత: తీన్మార్ మల్లన్న

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలను అన్ని రంగాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేస్తున్నాయని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విమర్శించారు. విద్యా, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ, సామాజిక రంగాల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం దక్కడంలేదన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం చేసిన బిల్లులను కేంద్రం ఆమోదించాలని, దేశవ్యాప్తంగా కులగణన చేయాలని బీసీ ఆజాదీ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బత్తుల సిద్దేశ్వర్ చేపట్టిన బీసీ ఆజాదీ ఆమరణ దీక్షకు ఆదివారం తీన్మార్ మల్లన్న మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల హక్కుల సాధన కోసం పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు. జక్కని సంజయ్ మాట్లాడుతూ.. తాము బీసీల హక్కుల కోసం ఆరు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, బీసీ ప్రధానిగా చెప్పుకునే నరేంద్ర మోదీకి బీసీలపై ప్రేమ లేదా? అని ప్రశ్నించారు. దీక్షలో రజక రిజర్వేషన్ల పోరాట సమితి అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, అంబేడ్కర్ ఆజాదీ సంఘం అధ్యక్షుడు కొంగర నరహరి తదితరులు పాల్గొన్నారు.

6 రోజుల్లో 1.27 కోట్ల మందికి సన్నబియ్యం

» 8.75 లక్షల క్వింటాళ్ల బియ్యం పంపిణీ

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గడిచిన ఆరు రోజుల్లో 1.27 కోట్ల మంది లబ్ధిదారులు సన్నబియ్యం తీసుకున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 90.42 లక్షల రేషన్ కార్డులుండగా.. ఇప్పటివరకు ఏప్రిల్ కోటా కింద 42 లక్షల రేషన్ కార్డులపై పేదలు బియ్యం తీసుకున్నారు. ప్రతి నెలా లబ్ధిదారులు సగటున 16 లక్షల క్వింటాళ్ల బియ్యం రేషన్ షాపులనుంచి తీసుకుంటుండగా... ఈ నెలలో ఆరు రోజుల వ్యవధిలో 8.75 లక్షల క్వింటాళ్ల బియ్యాన్ని వినియోగదారులకు పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17,311 రేషన్ షాపులుండగా.. 8,899 షాపుల్లో సన్నబియ్యం పంపిణీ జరుగుతోంది. కొన్ని జిల్లాలకు బియ్యం రవాణా పూర్తిస్థాయిలో జరగకపోవటం, కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలు వస్తుండటం, మరికొన్నిచోట్ల ప్రజాప్రతినిధుల రాక కోసం ఎదురుచూస్తుండటంతో.. బియ్యం పంపిణీ మందకొడిగా సాగుతోంది. గోదాముల నుంచి రేషన్‌షాపులకు బియ్యం రవాణా దాదాపుగా పూర్తయిందని, ఈ వారంలో బియ్యం సరఫరా మరింత మెరుగుపడుతుందని, 15 తేదీ నాటికి పూర్తవుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ ప్రసాద్ తెలిపారు.

హైదరాబాద్‌లో సీఎస్ఐఆర్ స్టార్టప్ కాన్‌క్లేవ్

» ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహణ

» దేశంలో అంత్రప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడమే లక్ష్యం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పరిశోధన సంస్థలు, స్టార్టప్‌ల మధ్య సహకారాన్ని సులభతరం చేయడం, భారత్‌లో అంత్రప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ నెల 22, 23 తేదీల్లో హైదరాబాద్‌లో సీఎస్ఐఆర్ స్టార్టప్ కాన్‌క్లేవ్‌ను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సీఎస్ఐఆర్‌కు చెందిన సంస్థలు ఐఐసీటీ, ఎన్‌జీఆర్ఐ, సీసీఎంబీ డైరెక్టర్లతో కేంద్ర శాస్త్ర సాంకేతిక వ్యవహారాల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. సీఎస్ఐఆర్-ఐఐసీటీ, సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ, సీఎస్ఐఆర్-సీసీఎంబీ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించనున్నాయి. ఔషధ ఆవిష్కరణ, జన్యు నిర్ధారణలో హైదరాబాద్‌కు చెందిన సీఎస్ఐఆర్ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ప్రశంసించారు. శాస్త్రీయ పరిశోధనలు, ఆవిష్కరణలు, అంత్రప్రెన్యూర్‌షిప్‌కు హైదరాబాద్ వేదికగా నిలుస్తోందన్నారు. ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ ప్రకాశ్ కుమార్, సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ నందికూరి సమావేశంలో పాల్గొన్నారు.

ఆహార కల్తీ.. దక్షిణాదిలో తెలంగాణకు రెండో స్థానం

» నాలుగేళ్లలో సేకరించిన ఆహార నమూనాల్లో సగటున 14 శాతం కల్తీ

» 58 శాతంతో దేశంలోనే యూపీ టాప్

» కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడి



హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆహార కల్తీ రోజురోజుకి పెరిగిపోతూ ఆందోళన కలిగిస్తోంది. ఆహార భద్రత అధికారులు గత నాలుగేళ్లలో దేశ వ్యాప్తంగా సేకరించిన ఆహార నమూనాల్లో సగటున 22 శాతం కల్తీవే ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించిన లెక్కలు భయపెడుతున్నాయి. 2021-24 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా సేకరించిన ఆహార పదార్థాల నమూనాలు, అందులో కల్తీగా తేలిన నమూనాల లెక్కలను రాష్ట్రాల వారీగా ఆ శాఖ ఇటీవల పార్లమెంట్‌కు నివేదించింది. దీని ప్రకారం.. ఆహార కల్తీలో తెలంగాణ దక్షిణాది రాష్ట్రాల్లో రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణలో గత నాలుగేళ్ల సగటు 14 శాతంగా ఉంది. అంటే తెలంగాణలో సేకరించి పరీక్షించిన ప్రతీ 100 నమూనాల్లో 14 వరకు కల్తీ ఆహారంగా తేలుతున్నాయి. ఇక, ఆహార కల్తీలో తమిళనాడు 20 శాతం సగటుతో దక్షిణాది రాష్ట్రాల్లోనే అగ్రస్థానంలో ఉంది. తెలంగాణ రెండో స్థానంలో ఉండగా.. కేరళలో 13.11 శాతం, ఆంధ్రప్రదేశ్ 9 శాతం, కర్ణాటక 6.30 శాతంతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

వామ్మో..!! యూపీ

ఆహార కల్తీలో ఉత్తరప్రదేశ్(యూపీ) దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. యూపీలో గత నాలుగేళ్లల్లో 93,182 ఆహార నమూనాలు సేకరించగా, అందులో 54,474 నమూనాల(58.75 శాతం)లో కల్తీని గుర్తించారు. యూపీ తర్వాత ఝార్ఖండ్ 49.91 శాతం, హరియాణా 27.48 శాతం, రాజస్థాన్ 26.28 శాతం సగటుతో ఆహారకల్తీలో వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గత నాలుగేళ్ల జాతీయ సగటు 22 కంటే ఈ రాష్ట్రాల్లో చాలా ఎక్కువగానే ఆహార పదార్థాల కల్తీ ఉండడం గమనార్హం. కాగా కలుషితమైన తాగు నీరు, ఆహార పదార్థాల వల్ల మనుషులు 200 రకాలకు పైగా వ్యాధులు బారినపడే అవకాశం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

దేశంలో ఆహార కల్తీ ఇలా.. (సెప్టెంబరు నాటికి)

సంవత్సరం	శాంపిల్స్	కల్తీ	కల్తీ (%)
2024-25	72,110	14,783	20.50
2023-24	1,70,513	33,808	19.82
2022-23	1,77,511	44,625	25.13
2021-22	1,42,584	32,930	23.09

తెలంగాణలో ఇలా... (సెప్టెంబరు నాటికి)

సంవత్సరం	శాంపిల్స్	కల్తీ	కల్తీ (%)
2024-25	1660	167	10.1
2023-24	6156	973	15.81
2022-23	4809	894	18.59
2021-22	3077	353	11.47

ఇంటికి పైసలు రెడీ

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. బేస్‌మెంట్ వరకు నిర్మించిన ఇళ్ల వివరాలన్నీ కార్పొరేషన్‌కు చేరాక హడ్కో నుంచి నిధులను తీసుకుని లబ్ధిదారులకు అందించనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఆర్థిక సాయాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే జమచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. కానీ ప్రతిష్ఠాత్మక పథకం కావడంతో.. ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి కొందరికి చెక్కులు ఇవ్వాలని, మిగతా వారికి ఖాతాల్లో జమచేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. మొదటి దశ కింద రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు.

క్షేత్రస్థాయిలో వేగంగా పరిశీలన..

రాష్ట్రవ్యాప్తంగా బేస్‌మెంట్ వరకు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఫొటోలు తీసి, జియో ట్యాగింగ్ చేస్తూ ఆన్ లైన్‌లో నమోదు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం సాయంత్రం వరకు 1,265 ఇళ్ల వివరాలను అప్‌లోడ్ చేశారు.

నిర్మాణం కోసం ఎస్‌హెచ్‌జీల రుణం

బేస్‌మెంట్ దశ వరకు కూడా ఇళ్లను నిర్మించుకోలేని పలువురు లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ద్వారా ప్రభుత్వం రుణాలను ఇప్పించింది. ఇందుకు సంబంధించి ఖమ్మం జిల్లా పాలేరులో కొందరు లబ్ధిదారులకు రుణం కింద రూ.లక్ష అందించారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ఇలా రుణాలు అందేలా చూడాలని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ జిల్లాల కలెక్టర్లకు సర్క్యులర్ పంపారు. ఇటీవల జరిగిన అడిషనల్ కలెక్టర్ల సమావేశంలోనూ దీనిపై సూచన చేశారు. సెర్ప్ సీఈవోకు కూడా ఈ రుణాల విషయంలో సహకరించాలంటూ లేఖ పంపారు. బేస్‌మెంట్ పూర్తయ్యాక అందించే ఆర్థిక సాయాన్ని లబ్ధిదారుల ఆమోదంతో.. ఎస్‌హెచ్‌జీలకు తిరిగి చెల్లించనున్నారు.

పీఎంఏవై రూరల్ కింద రాష్ట్రానికి ఇళ్లు..!

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద రాష్ట్రానికి ఇళ్లను మంజూరు చేసే అంశంపై చిక్కుముడులు వీడుతున్నట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కేంద్రం అమలుచేసే పీఎంఏవై పథకానికి అనుసంధానం చేసి, నిధులు పొందాలని భావించింది. పీఎంఏవైతో రాష్ట్ర పథకాన్ని అనుసంధానించాలంటే.. కేంద్రం రూపొందించిన ఆవాస్ ప్లస్ యాప్‌తో సర్వే చేసి, లబ్ధిదారుల వివరాలను పొందుపర్చాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా రూపొందించిన యాప్‌తో సర్వే చేసి, లబ్ధిదారులను ఎంపిక చేసింది. దీనితో ఇళ్లు మంజూరు చేయడానికి కేంద్రం అంగీకరించలేదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరిపినా ఇటీవలి వరకు స్పష్టత రాలేదు. తాజాగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్.. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్‌తోపాటు పలు శాఖలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంఏవై రూరల్ కింద రాష్ట్రానికి ఇళ్లను మంజూరు చేయాలన్న విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది. రాష్ట్రం రూపొందించిన యాప్, అందులో పొందుపర్చిన దరఖాస్తుదారుల వివరాలు, ప్రభుత్వం నిర్వహించిన సర్వే వివరాలన్నింటినీ తమకు సమర్పించాలని సూచించినట్టు సమాచారం. మరోవైపు పీఎంఏవై అర్బన్ కింద కేంద్రం ఇప్పటికే రాష్ట్రానికి 1.13 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. కేంద్రం రూరల్ స్కీం కింద ఇళ్లకు రూ.72 వేలు, అర్బన్ స్కీం కింద రూ.1.5లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తుంది.



నిదానంగా ఇళ్ల నిర్మాణాలు

ప్రభుత్వం జనవరి 26న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా 71వేల మందిని ఎంపిక చేసింది. వీరిలో 44,616 ఇళ్లకు మంజూరు పత్రాలు అందించారు. ఇప్పటివరకు 13,222 ఇళ్లకు మాత్రమే ముగ్గులు పోయగా (మార్కవుట్ చేయగా).. మరో 1,250 ఇళ్లు బేస్‌మెంట్ దశను పూర్తిచేసుకున్నాయి. మొత్తానికి రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిదానంగా సాగుతోందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వ్యవసాయ పనులతో, మంచి ముహూర్తాలు లేకపోవడంతోపాటు బేస్‌మెంట్ వరకు కూడా నిర్మించుకునేందుకు లబ్ధిదారులకు ఆర్థిక స్థోమత లేకపోవడమే దీనికి కారణమని అధికారుల పరిశీలనలో తేలింది. ఈ నెల 9 తరువాతి నుంచి మంచి ముహూర్తాలు ఉండడం, ఎస్‌హెచ్‌జీల ద్వారా రుణాలు ఇప్పించే చర్యలతో ఇళ్ల నిర్మాణం వేగవంతం అవుతుందని అంచనా వేస్తున్నారు.

నేడు ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, టీచర్, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇటీవల ఎన్నికైన అభ్యర్థులు సోమవారం ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎమ్మెల్యే కోటాలో కాంగ్రెస్ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం, బీఆర్ఎస్ నుంచి దాసోజు శ్రవణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కరీంనగర్ పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమరయ్య విజయం సాధించారు. ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి గెలిచారు. సోమవారం శాసనమండలిలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వీరితో ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం చేయిస్తారు. దాసోజు శ్రవణ్ మరోరోజు ప్రమాణ స్వీకారం చేస్తారని బీఆర్ఎస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

ఆ భూములు విక్రయించవద్దు

» హెచ్‌సీయూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

పంజాగుట్ట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను విక్రయించవద్దని, 400 ఎకరాల భూమి వేలాన్ని వెంటనే నిలిపివేయాలని వక్తలు డిమాండ్ చేశారు. జస్టిస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌సీయూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. గతంలో సెంటర్ ఫర్ స్మార్ట్ గవర్నెన్స్ కోసం భూమి కావాలని అడిగితే ఈసీలో ఉన్న తాను వ్యతిరేకించానని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు హయాం నుంచి భూ కేటాయింపులు జరుగుతూనే ఉన్నాయన్నారు. భూమిని అంగట్లో సరుకులా విక్రయిస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. వర్సిటీకి చెందిన అంగుళం భూమిని కూడా పోనివ్వమని తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్ అన్నారు. రూ.40 వేల కోట్ల విలువైన భూమిని ముంబైకి చెందిన వారికి రూ.10 వేల కోట్లకే ఎలా కుదువ పెడతారని సీనియర్ జర్నలిస్ట్ విఠల్ ప్రశ్నించారు. పౌరసమాజం స్పందించకపోతే అన్యాయాలు జరుగుతాయని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి అన్నారు. జస్టిస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా ప్రతినిధి కంచర్ల బద్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే శ్రీరాముడి సేవకుడిని

45 ఏళ్ల క్రితమే సంగారెడ్డి రామ్‌మందిర్ వద్ద గుంజలు పాతి, మామిడాకుల తోరణాలు కట్టేవాణ్ని

» సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో సంగారెడ్డిని అభివృద్ధి చేస్తా

» రామ్‌మందిర్ బస్తీలో ఉంటూ కౌన్సిలర్, మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యేగా గెలిచా

» టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 6 : "నా చిన్ననాటి నుంచే శ్రీరాముడికి సేవకుడిని.. 45 ఏళ్ల క్రితమే సంగారెడ్డి రామ్‌మందిర్‌లో జరిగే సీతారాముల కల్యాణానికి గుంజలు పాతి, మామిడాకుల తోరణాలు కట్టేవాణ్ని.. ఆనాటి నుంచే రామ్‌మందిర్‌లో నా సేవ ప్రారంభమైంది. ఇదే రామ్‌మందిర్ బస్తీలో ఉంటూ కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానంటే ఆ శ్రీరాముడి ఆశీర్వాదంతోనే.. "అంటూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తన భక్తిని చాటుకున్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం సంగారెడ్డిలోని రామ్‌మందిర్‌లో సీతారాముల కల్యాణాన్ని జగ్గారెడ్డి దంపతులు ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి పర్యవేక్షణలో కళ్యాణ వేడుక జరిగిన అనంతరం వేలాది మంది భక్తులకు ముత్యాల తలంబ్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత సీతారాముల కల్యాణం కోసం ఖర్చు చేయడం మొదలుపెట్టానని చెప్పారు. కల్యాణం ఉందంటే డబ్బులు లేకున్నా.. సమయానికి ఎక్కడి నుంచో వస్తాయని, కల్యాణాన్ని అద్భుతంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. వతన్‌దారుల చేతుల మీదుగానే కల్యాణాన్ని జరిపిస్తున్నానని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో సంగారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఆ శ్రీరాముడి కటాక్షంతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలని జగ్గారెడ్డి ఆకాంక్షించారు.



సంగారెడ్డి రామ్‌మందిర్‌లో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



చిన్నకోడూరు మండలం చౌడారం శివారులో కాలువలోని గోదావరి జలాలకు పూజలు చేస్తున్న హరీశ్‌రావు

కాళేశ్వరంపై ప్రభుత్వం చిన్నచూపు

» కుంగిన పిల్లర్‌కు మరమ్మతు చేసి నీటిని పంపింగ్ చేయొచ్చు: హరీశ్‌రావు

చిన్నకోడూరు/హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చౌడారం శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ ఎడమ కాలువ కింద ఉన్న ఎల్ఎస్ఎం-5 కాలువ ద్వారా కమ్మర్లపల్లి జాలు చెరువులోకి నీటిని వదిలారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు గోదావరి జలాలకు పూజ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఉద్దేశ్యపూర్వకంగానే భూసేకరణకు, కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయడం లేదన్నారు. ఈ ప్రభుత్వం పగతో పనిచేస్తోందని, అలాకాకుండా ప్రజలు, రైతుల కోసం ప్రేమతో పనిచేయాలన్నారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా కుంగిన కాళేశ్వరం పిల్లర్లకు తొందరగా మరమ్మతు చేస్తే వేసవిలోనూ నీటిని పంపింగ్ చేయవచ్చన్నారు. ఒక దశాబ్దంలో సాధించిన వృద్ధిని.. ఏడాది పాలనలో దెబ్బతీశారని హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్లపాలనలో (కోవిడ్ మినహా) తెలంగాణ స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ వార్షిక వృద్ధిరేటు 25.62% సాధిస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2024-25లో ఈ శాఖ ఆదాయంలో 1.93% తగ్గిందని ఆదివారం ఎక్స్ ఖాతాలో ఆయన పోస్ట్ చేశారు.

రహదారులకు భూమి ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

పలుసార్లు లేఖలు రాస్తే ఇప్పటి వరకు 904 హెక్టార్ల భూమే రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసింది. ఇంకా 646 హెక్టార్ల భూమి ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్థలాన్ని సేకరించి ఇస్తే ఆయా ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి వీలుంటుంది" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత..

కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన తెలంగాణ ప్రజలు.. భవిష్యత్‌లో బీజేపీ అధికారంలోకి రావాలని బలంగా కోరుకుంటున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. ఎంపీ ఎన్నికల్లో తమ పార్టీ 8 స్థానాల్లో గెలిచి చరిత్ర సృష్టించిందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకుని అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2 స్థానాల్లో బీజేపీ విజయం సాధించిందన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో, మహేశ్వరంలోని బడంగ్‌పేట్‌లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌పై పదేళ్లలో ప్రజా వ్యతిరేకత వస్తే, పది నెలల్లోనే కాంగ్రెస్ అంతకంటే ఎక్కువ వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్ గెలుపుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీ పడి కుట్రలు చేస్తున్నాయన్నారు.

దేశ విభజనకు విపక్షాల కుట్ర : లక్ష్మణ్

తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడాలన్నది ప్రజల ఆకాంక్ష అని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హరియాణా రాష్ట్రాల్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ వైపు ఏకపక్షంగా తీర్పు వచ్చిందని తెలిపారు. కులం, మతం, భాష, ప్రాంతం పేరుతో విపక్షాలు దేశ విభజనకు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు.

వక్ఫ్ కొత్త చట్టంతో అక్రమాలకు చెక్: డీకే అరుణ


వక్ఫ్ సవరణ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడం దేశ చరిత్రలో కీలక ఘట్టమని బీజేపీ ఎంపీ, వక్ఫ్ సవరణ బిల్లు జేపీసీ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. ఈ బిల్లుకు శ్రీరామనవమి రోజునే చట్టబద్ధత కల్పించడం శుభతరుణమని చెప్పారు. ఆదివారం తన నివాసంలో డీకే అరుణ మీడియాతో మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లుకు చట్టబద్ధత రావడంతో ఇన్నాళ్లూ కొంత మంది చేసిన అక్రమాలకు ఇకపై చెక్ పడుతుందని, వక్ఫ్ పేరుతో వివాదాల్లో ఉన్న వేల ఎకరాలపై స్పష్టత రానుందని డీకే అరుణ తెలిపారు.

ఆ భూములను హెచ్‌సీయూకే ఇవ్వాలి

» మీనాక్షీ నటరాజన్‌కు విద్యార్థుల వినతి

» కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై.. అధ్యాపకులు, విద్యార్థులతో మీనాక్షి భేటీ

» ప్రొఫెసర్లు, ఎన్జీవో ప్రతినిధులతోనూ సమావేశం.. అభిప్రాయ సేకరణ



హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూములను హెచ్‌సీయూకే రిజిస్టర్ చేయించాలని ఆ యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌ను కోరారు. మొత్తం భూమిని వర్సిటీకి రిజిస్టర్ చేయడమే కాకుండా.. బయోడైవర్సిటీ హెరిటేజ్ జోన్‌గా ప్రకటించేలా చూడాలన్నారు. ఆదివారం మీనాక్షి.. గచ్చిబౌలి స్టేడియంలో హెచ్‌సీయూ అధ్యాపకులు, విద్యార్థులతో సమావేశమయ్యారు. కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై వారి అభిప్రాయాలు సేకరించారు. ఈ భూముల వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో.. దీని పై నిజనిర్ధారణకు అభిప్రాయ సేకరణ చేపట్టాలని మీనాక్షీ నటరాజన్‌కు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సూచించినట్లు తెలుస్తోంది. రాహుల్ సూచన మేరకే శనివారం హైదరాబాద్‌కు వచ్చిన మీనాక్షి.. నేరుగా సచివాలయానికి వెళ్లి గచ్చిబౌలి భూములపై ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీని కలిసి వారి అభిప్రాయాలు తీసుకున్నారు. ఆదివారం హెచ్‌సీయూ అధ్యాపకులు, విద్యార్థులతోపాటు కాంగ్రెస్ నేతలు, ప్రజాసంఘాల ప్రతినిధుల నుంచి కూడా ఆమె సమాచారం సేకరించినట్లు తెలిసింది. సోమవారమూ అభిప్రాయాలు సేకరించి.. సాయంత్రం అహ్మదాబాద్‌కు వెళ్లనున్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో అహ్మదాబాద్‌లో ఏఐసీసీ విస్తృత స్థాయి సమావేశం, సీడబ్ల్యూసీ భేటీ జరగనున్న సంగతి తెలిసిందే. కాగా, కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై హైదరాబాద్‌లో సేకరించిన అభిప్రాయాలపై నివేదికను అహ్మదాబాద్‌లో రాహుల్‌గాంధీకి మీనాక్షీ నటరాజన్ ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. ఆ నివేదికను పరిశీలించి.. రాష్ట్ర ప్రభుత్వానికి ఏఐసీసీ నాయకత్వం దిశానిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది.



వైరా గురుకులంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

గురుకులంలో భట్టి ఆకస్మిక తనిఖీ

» విద్యార్థినులతో కలిసి భోజనం

వైరా, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా వైరాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆదివారం రాత్రి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ముందుగా పాఠశాల ఆవరణలో విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమైన భట్టి విక్రమార్క అక్కడ వసతులు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమయంలో "డిన్నర్ రెడీగా ఉందా? అంతా కలిసి భోజనం చేద్దాం పదండి" అంటూ పిల్లలను వెంట పెట్టుకొని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి డైనింగ్ హాల్‌కు వెళ్లారు. ఆ తర్వాత విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మెనూ పాటిస్తున్నారా.. భోజనాల్లో నాణ్యత ఎలా ఉంటుంది? అంటూ విద్యార్థినులను ప్రశ్నించారు. దాంతో భోజనం నాణ్యత బాగుంటుందని, మెనూ పాటిస్తున్నారని విద్యార్థినులు సమాధానమిచ్చారు.

బీజేపీ.. సన్నబియ్యం దేశమంతా ఎందుకివ్వట్లేదు?

» బండి సంజయ్ వ్యాఖ్యలకు మహేశ్ గౌడ్ కౌంటర్



హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కేంద్రమే సన్న బియ్యం పంపిణీ చేస్తుందంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. సన్న బియ్యం ఇచ్చేది బీజేపీనే అయితే.. దేశం మొత్తం ఎందుకు ఇవ్వట్లేదంటూ నిలదీశారు. బండి సంజయ్‌లో రోజురోజుకూ అభద్రతా భావం పెరిగిపోతోందని, బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రాదని తెలిసి ఆగమాగమవుతున్నాడని ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. బీజేపీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు.. కేంద్ర మంత్రి చెప్పులు మోసిన చరిత్ర సంజయ్‌దన్నారు. కాంగ్రెస్ సర్కారుపై నోటికి వచ్చింది మాట్లాడితే ఊరుకునేది లేదంటూ హెచ్చరించారు. బండి సంజయ్‌కి దమ్ముంటే.. బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన 2 బిల్లులను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేలా ప్రధానిని ఒప్పించాలన్నారు. ఢిల్లీ పెద్దలకు భయపడే తెలంగాణ బీజేపీ నేతలు.. బీసీ మహా ధర్నాకు ముఖం చాటేశారని విమర్శించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తరహాలోనే హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌తో బీజేపీ.. లోపాయికారి ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. మోదీ, అమిత్‌షాల వద్ద గుర్తింపు కోసం కేంద్ర మంత్రి అన్న సంగతి మరిచి.. సంజయ్ దిగజారి మాట్లాడుతున్నారన్నారు. హెచ్‌సీయూ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, రాజకీయ అవసరాల కోసం బండి సంజయ్ మాట్లాడటం సరికాదని ఆయన పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌తో ఒప్పందం మేరకే ఎమ్మెల్సీ బరిలో బీజేపీ: పొన్నం



హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌తో ఒప్పందంలో భాగంగానే హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. లేదంటే బలమే లేని చోట బీజేపీ ఎలా బరిలో నిలుస్తుందని ఓ ప్రకటనలో ప్రశ్నించారు. హైదరాబాద్ స్థానిక సంస్థలకు ఉన్న మొత్తం 112 ఓట్లలో బీజేపీకి 27 ఓట్లే ఉన్నాయి. ఎంఐఎంకు 49, బీఆర్ఎస్‌కు 23, కాంగ్రెస్‌కి 13 ఓట్లున్నాయి. గెలిచే బలం లేదని కాంగ్రెస్ పోటీ చేయకుండా తటస్థంగా ఉంది. బీఆర్ఎస్ కూడా పోటీలో లేదు. అలాంటప్పుడు 27 ఓట్లతో బీజేపీ గెలుపెలా సాధ్యం? బీజేపీ అభ్యర్థికి బీఆర్ఎస్ ఓట్లు వేస్తుందా? ఈ మేరకు రాజకీయ అవగాహన చేసుకున్నారా?' అని నిలదీశారు. ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్.. బీజేపీకి లోపాయికారిగా సహకరించిందని ఆయన అన్నారు.

రాజమౌళి భయపడే స్థాయిలో బీఆర్ఎస్-బీజేపీ ఏఐ గ్రాఫిక్స్: అద్దంకి

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలకు సంబంధించి అబద్ధపు ప్రచారం కోసం బీఆర్ఎస్-బీజేపీలు రూపొందిస్తున్న ఏఐ గ్రాఫిక్స్ వీడియోలు చూస్తే సినీ దర్శకుడు రాజమౌళినే భయపడే స్థాయిలో ఉన్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. ఈ వీడియోలతో వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దుష్ప్రచారం చేస్తున్నారని ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. సుప్రీం కోర్టు తీర్పునకు లోబడి చట్టాలను గౌరవిస్తూ ముఖ్యమంత్రి పనిచేస్తారన్నారు. గాంధేయవాది మీనాక్షి నటరాజన్ గురించి ఏమీ తెలియకుండా బండి సంజయ్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

పేదవారి కళ్లలో ఆనందం చూశా

(మొదటిపేజీ తరువాయి)

స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం పథకం తమ లాంటి పేద కుటుంబాలకు ఎంతో మేలు చేస్తుందని వారు సీఎంకు తెలిపారు. మానవతా దృక్పథంతో నడిపిస్తున్న గొప్ప పథకమంటూ ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. భోజనం అనంతరం ఆ కుటుంబ సభ్యులను సీఎం అభినందించారు. వారికి నూతన వస్త్రాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఇబ్బందుల్లో ఉన్నాం.. ఆదుకోండి

తమ కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. లబ్ధిదారు తల్లి పద్మావతి మాట్లాడుతూ.. తన భర్త శంకరరావు జీసీసీ సేల్స్ మేన్‌గా పనిచేసి 2015లో రిటైరయ్యారని, తన కుమారుడు ఏంఏ బీఈడీ చదువుకుని కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని, తన కుమార్తె సుహాసిని చిన్నప్పటి నుంచి మానసిక ఇబ్బందులతోపాటు కనుచూపు లేక అవస్థలు పడుతోందని సీఎంకు చెప్పారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి.. వారి సమస్యలను పరిష్కారించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సుల వల్లే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ఇంటికి భోజనానికి వచ్చారంటూ బూరం శ్రీనివాసరావు కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. నిరుపేదలమైన తమ ఇంట్లో సీఎంతోపాటు డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు భోజనం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ శ్రీరామ నవమిని తమ జీవితంలో మర్చిపోలేమని అన్నారు.



సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మధుర జ్ఞాపకం

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలో సన్న బియ్యం లబ్ధిదారు ఇంట్లో భోజనం చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. "పేదవాడి ఇంట కంచంలో సన్నబియ్యం.. స్వయంగా రుచి చూశా. వారి కళ్లల్లో ఆనందాన్నీ చూశా. సారపాకలో లబ్ధిదారుల ఇంట సహపంక్తి భోజనం చేసి పథకం అమలును స్వయంగా పరిశీలించా" అంటూ ఎక్స్‌లో సీఎం ట్వీట్ చేశారు. దీంతోపాటు రాములోరి పెళ్లికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించడం ఒక మధుర జ్ఞాపకమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. "కన్నుల పండువగా భద్రాద్రి వేడుకగా శ్రీ సీతారామస్వామి కల్యాణం కమనీయం. పల్లెపల్లెన పెళ్లి సందడి.. ఈ సీతారాముల కల్యాణ వైభోగం" అంటూ 'ఎక్స్'లో సీఎం పోస్ట్ చేశారు.

రమణీయం.. రాములోరి కల్యాణం

భద్రాచలంలో వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం.. ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ దంపతులు

» నేడు శ్రీరామ మహాపట్టాభిషేకం

» పట్టు వస్త్రాలు సమర్పించనున్న గవర్నర్







సీఎంకు స్వామివారి ప్రసాదాన్ని అందిస్తున్న అర్చకుడు, శ్రీసీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి , మంత్రి పొంగులేటి దంపతులు; సీతారాములకు తలంబ్రాలు పోస్తున్న వేదపండితులు

భద్రాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. రామ నామ జపంతో భక్తులు పరవశించిపోతుండగా.. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకే స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు, మంగళాశాసనం, అభిషేకం చేశారు. తదుపరి ధ్రువమూర్తులకు కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్ పాల్గొన్నారు. ఉదయం 9.45 గంటలకు వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ ఊరేగింపుగా మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపానికి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తీసుకొచ్చారు. స్వర్ణ సింహాసనంపై స్వామివారిని, అమ్మవారిని ఆసీనులను చేశారు. కళ్యాణం సందర్భంగా భక్తరామదాసు చేయించిన నగలను వధూవరులకు ధరింపజేశారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డి తొలిసారి సతీసమేతంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. రేవంత్‌రెడ్డి, ఆయన సతీమణి గీత ఉదయం 11.33 గంటలకు రామాలయానికి చేరుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. పూజల తర్వాత సీఎం దంపతులు 11.45 గంటలకు మిథిలా స్టేడియానికి చేరుకున్నారు. అక్కడ జీలకర్రబెల్లం సమయంలో పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రామయ్యకు సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నం సమీపించగానే వేద పండితులు ఉత్సవమూర్తుల శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచారు. అనంతరం మూడు సూత్రాలతో కన్నుల పండువగా మాంగళ్య ధారణ నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి తిలకించారు. అదేవిధంగా హైకోర్టు న్యాయమూర్తులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. టీటీడీ తరఫున చైర్మన్ బీఆర్ నాయుడు శ్రీసీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

భారీగా తరలివచ్చిన భక్తజనం

సీతారాముల కల్యాణాన్ని తిలకించడానికి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వసతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండ తీవ్రతను తాళలేక అవస్థలు పడ్డారు. కల్యాణ మండపానికి చేరుకునే మార్గాల్లో బారికేడ్లను ఏర్పాటు చేయడంతో భక్తులు ఇక్కట్ల పాలయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే సమయంలో గంటపాటు సామాన్య భక్తులకు స్వామి వారి దర్శనాన్ని నిలిపివేశారు. ఒక మహిళా ఎస్సై అత్యుత్సాహం ప్రదర్శించారు. నిఘా వర్గాల సిబ్బందిని సైతం వెళ్లిపోవాలని హుకుం జారీ చేయడం గమనార్హం. ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సీఎం రాకను చిత్రీకరించేందుకు ప్రయత్నించగా వారినీ ఆ ఎస్సై వెళ్లిపోవాలని హెచ్చరించారు. తమకు పాస్‌లు ఉన్నాయని చెప్పినా వినిపించుకోలేదు. చివరిలో కల్యాణ తలంబ్రాల కోసం భక్తులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది.

నేడు శ్రీరామ మహాపట్టాభిషేకం

కల్యాణం అనంతరం ఒక్క రామయ్యకు మాత్రమే నిర్వహించే విలక్షణ ఉత్సవం మహాపట్టాభిషేకం. ఏటా శ్రీరామ నవమి మరుసటి రోజు జరిగే ఉత్సవాన్ని శ్రీరామ మహాపట్టాభిషేకంగా పేర్కొంటారు. ఇందులో భాగంగా శ్రీరాముడికి ఆభరణాలతో పాటు రాజదండం, రాజముద్రిక, ఛత్రం, శంఖు, చక్రాలు, కిరీటం ధరింపజేస్తారు. సోమవారం నిర్వహించే ఈ పట్టాభిషేకానికి భద్రాచలం దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శ్రీరామ మహాపట్టాభిషేకానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

యాదగిరిగుట్టపై వైభవంగా సీతారామ కల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, సిరిసిల్ల, ఇల్లెందు రూరల్, చారకొండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్టపై సీతారాముల కల్యాణోత్సవం శివాలయంలో కన్నుల పండువగా జరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణ వేడుకలు ప్రారంభం కాగా, ముందుగా పట్టు వస్త్రాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయం తూర్పు రాజగోపురం నుంచి స్వామి అమ్మవారిని వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య తిరువీధి సేవ నిర్వహించి ఉత్సవ మండపం వద్దకు చేర్చారు. దేవస్థానం తరఫున కల్యాణ దంపతులకు పట్టువస్త్రాలను ఆలయ ఈవో అందజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో శ్రీరామనవమి వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాల మధ్య సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండల పరిధిలోని సిరసనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణాన్ని ప్రభుత్వ లాంఛనాలతో వైభవంగా నిర్వహించారు.



ఇల్లెందు దర్గాలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్న ముస్లింలు



యాదగిరిగుట్టపై సీతారాముల కల్యాణ వేడుకలు

ఇల్లెందు దర్గాలో ముస్లింల ఆధ్వర్యంలో..

భద్రాద్రి జిల్లా ఇల్లెందులో ముస్లింలు దర్గాలో శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఇల్లెందు మండలం సత్యనారాయణపురం సమీపంలోని హజరత్ నాగుల్‌మీరా దర్గాలో కులమతాలకు అతీతంగా ఉత్సవాలు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. సోమవారం దర్గాలో శ్రీరామ పట్టాభిషేకం మహోత్సవం నిర్వహిస్తారు.

తిరుమలలో శ్రీరామనవమి ఆస్థానం

తిరుమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం రాత్రి శ్రీరామనవమి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలోని బంగారువాకిలి వద్ద ఆస్థానాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి తోమాలసేవ, అర్చన సేవలను నిర్వహించారు. తర్వాత ఆలయంలోని రంగనాయకమండపంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమంత స్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవను కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పఠనం చేశారు. రాత్రి హనుమంత వాహనసేవ వేడుకగా నిర్వహించారు. శ్రీరాములవారు తన భక్తుడైన హనుమంతునిపై కొలువుదీరి మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. కాగా, సోమవారం రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించనున్నారు.

జీఎస్‌డీపీ వృద్ధి రేటులో తెలంగాణకు 13వ స్థానం

(మొదటిపేజీ తరువాయి)

అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. ఇందులో 18 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల వృద్ధి రేట్లను పేర్కొంది. తెలంగాణ జీఎస్‌డీపీ స్థిర ధరల వద్ద రూ.8,16,834 కోట్లుగా ఉంది. వృద్ధి రేటు 6.79 శాతంగా నమోదైంది. ఈ లెక్కన రాష్ట్రం 13వ స్థానంలో నిలిచింది. అయితే ప్రస్తుత ధరల వద్ద జీఎస్‌డీపీ రూ.16,12,579 కోట్లు ఉండగా.. వృద్ధి రేటు 10.12 శాతంగా నమోదైంది. ఈ వృద్ధి రేటు లెక్కన తెలంగాణ 14వ స్థానంలో ఉంది. ఇక రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,79,751 ఉండగా.. వృద్ధి రేటు 9.61 శాతం నమోదైంది. ఈ వృద్ధిరేటులో రాష్ట్రం 11వ స్థానంలో నిలిచింది. కాగా, తెలంగాణ జీఎస్‌డీపీలో వృద్ధి రేటు స్థిర ధరల వద్ద 2022-23లో 6.9 శాతం నమోదైంది. అయితే తర్వాతి సంవత్సరం (2023-24)లో 7.4శాతానికి పెరిగింది. తాజాగా 2024-25లో మాత్రం మళ్లీ 6.79 శాతానికి తగ్గింది. ఇక ప్రస్తుత ధరల వద్ద చూస్తే 2023-24లో రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.14.64 లక్షల కోట్లుగా నమోదైంది. వృద్ధి రేటు 11.9 శాతంగా ఉంది. ఈ విషయంలో దేశంలో మూడో స్థానంలో రాష్ట్రం నిలిచింది. కానీ 2024-25లో ప్రస్తుత ధరల వద్ద జీఎస్‌డీపీ వృద్ధి రేటు 10.12 శాతానికి తగ్గిపోయి 14వ స్థానానికి దిగజారింది.

ఏపీ రెండో స్థానంలో...

స్థిర ధరల వద్ద జీఎస్‌డీపీ వృద్ధి రేటులో తమిళనాడు మొదటి స్థానంలో, ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచాయి. 2024-25లో 8.22 శాతం వృద్ధి రేటుతో ఏపీ రెండో స్థానంలో, తలసరి ఆదాయం వృద్ధిలో మూడోస్థానంలో నిలిచింది. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రం గాడిలో పడిందని, ఆత్మవిశ్వాసం పెంచేలా ఫలితాలు వస్తున్నాయని ఆదివారం 'ఎక్స్'లో తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్ ఈజ్ రైజింగ్' అని వ్యాఖ్యానించారు. కేంద్రం నివేదిక ప్రకారం.. వైసీపీ హయాంలో 2023-24లో వృద్ధి రేటు కేవలం 6.19 శాతమే ఉండగా.. 2024-25లో రాష్ట్రం 8.22 శాతం వృద్ధిరేటుతో రూ.8.65 లక్షల కోట్ల జీఎస్‌డీపీని సాధించింది. ప్రస్తుత ధరల ప్రకారం 12.02 శాతం వృద్ధిరేటుతో రూ.15.93 లక్షల కోట్ల జీఎస్‌డీపీ నమోదైంది. ఈ లెక్కన 5వ స్థానంలో నిలిచింది. 2024-25లో తలసరి ఆదాయం రూ.2,66,240కు చేరింది. 11.89 శాతం వృద్ధి నమోదైంది. ఇందులో రాష్ట్రం 3వ స్థానంలో నిలిచింది. సీఎం చంద్రబాబు 15% వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా కృషిచేస్తున్నారు.

మహిళా సాధికారత పైపైకి.. కేంద్రం గణాంకాల్లో వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: పలు రంగాల్లో మహిళా సాధికారత వేగం పుంజుకుందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడించింది. 'విమెన్ అండ్ మెన్ ఇన్ 2024' పేరిట ఆదివారం విడుదల చేసిన నివేదికలో పలు అంశాలను పరిశీలిస్తే.. జెండర్ పారిటీ ఇండెక్స్(జీపీఐ)లో బాలబాలికల వ్యత్యాసం అప్పర్ ప్రైమరీ ఎలిమెంటరీల్లో కనిపించినా.. ప్రాథమిక, హయ్యర్ సెకండరీల్లో స్థిరంగా ఉన్నట్లు గడిచిన నాలుగేళ్ల డాటా చెబుతోంది దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు ఖాతాల్లో మహిళల వాటా 39.2%. మొత్తం డిపాజిట్లలో వారి వాటా 39.7శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల డిపాజిట్ల వాటా 42.2శాతంగా ఉండడం గమనార్హం..! స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన డీమాట్ ఖాతాల్లోనూ మహిళలు పురోభివృద్ధి సాధిస్తున్నారు. 2021-24 మధ్యకాలంలో దేశంలోని డీమాట్ ఖాతాల సంఖ్య 3.32 కోట్ల నుంచి 14.3 కోట్లకు పెరిగింది. ఇందులో మహిళల భాగస్వామ్యం 2021లో 66 లక్షలుగా ఉండగా.. 2024 కల్లా.. 2.77 కోట్లకు పెరిగింది. మహిళలు నిర్వహిస్తున్న పరిశ్రమలు కూడా పెరిగాయని తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఉత్పాదకరంగంలో వారి వాటా 58.4శాతంగా ఉంది. వాణిజ్యంలో 13.7%, ఇతర సేవల్లో 14.2% వాటాను కలిగి ఉన్నారు.



దుబాయ్‌లో శ్రీరామనవమి వేడుకలలో పాల్గొన్న భక్తులు

దుబాయ్‌లో వైభవోపేతంగా శ్రీరామనవమి వేడుకలు

యూఏఈ, ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి, ఏప్రిల్6: దుబాయ్‌లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. అజ్మాన్‌లో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో భారతీయులు పాల్గొన్నారు. తెలంగాణ భక్తి బృందం ఆధ్వర్యంలో గణపతి పూజ, హనుమాన్ చాలీసా పఠనం సాగాయి. స్థానిక వేద పండితుడు సతీష్ బృందం ఆధ్వర్యంలో తెలుగు వారు కుటుంబసమేతంగా రామాయణం పారాయణం చేశారని తెలంగాణ ప్రవాసీలు గాజా నవినీత్, వంశీగౌడ్ తెలిపారు. వేడుకల ఏర్పాట్లను ఆరే శరత్, కృష్ణా మేగి, మదన్ మోదన్, జగదీశ్ సమన్వయం చేశారు.

కన్నుల పండువగా శోభాయాత్ర

భారీగా తరలివచ్చిన భక్తులు

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా హైదరాబాద్‌లోని ధూల్‌పేట నుంచి కోఠి హనుమాన్ వ్యాయామ్‌శాల వరకు నిర్వహించిన శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. తొలుత భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సీతారాంబాగ్ ఆలయం వద్ద సీతారాముల కళ్యాణం మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాత్రను ప్రారంభించారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ధూల్‌పేట ఆకాశపురి హనుమాన్ దేవాలయం వద్ద హనుమాన్ చాలీసా పఠనం చేసి శోభాయాత్రను ప్రారంభించారు. ధూల్‌పేట నుంచి ఆనంద్ సింగ్ ఏర్పాటు చేసిన సీతారాముల పల్లకి యాత్రను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రారంభించారు. ప్రధాని మోదీ నిజమైన భూములకు రక్షణ కల్పించడం కోసమే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తీసుకొచ్చారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పారు. దేశం మొత్తం మోదీ, యోగీ వైపు చూస్తోందన్నారు. రామ మందిర నిర్మాణం జరగదని ఒవైసీ భావించారని కానీ మోదీ ప్రభుత్వం రామమందిర నిర్మాణం చేసి చూపిందని రాజాసింగ్ చెప్పారు. శోభాయాత్ర శాంతియుతంగా సాగేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది.



హైదరాబాద్ ధూల్‌పేట వద్ద శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



బాలీవుడ్‌లో 50 ఏళ్లు దాటిన ఓ కండల వీరుడు. తన వయసులో సగమున్న కథానాయికతో కలిసి నటించడంపై విమర్శలువస్తే.. "ఆమెతో మాత్రమే కాదు, ఆమెకు పుట్టబోయే అమ్మాయితో కూడా నటిస్తాను. మీకేంటి బాధ?" అని ఎదురు ప్రశ్నించాడు. ఐదుపదుల వయసు దాటినా అతడిలో వార్ధక్యపు ఛాయలు అంతగా కనబడవు. ముప్పై ఏళ్లకే తెల్ల వెంట్రుకలు రావడం మొదలై.. నాలుగు పదుల వయసుకు ముఖం మీద చర్మం బిగుతును కోల్పోయి.. 50 ఏళ్లకే ముసలివారిలా కనిపించే సామాన్యులకు, అతడికి తేడా ఏంటి?

..ఇలా ఒకరు కాదు, ఇద్దరు కాదు. ఇటీవలికాలంలో చాలా మంది సెలబ్రిటీలను చూస్తే వయసు అస్సలు తెలియట్లేదు. అరవై, డెబ్బై ఏళ్లొచ్చిన హీరోలు సైతం 40-50ల్లో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. 'మమ్మీ..' అంటూ పిల్లలు ఆలింగనం చేసుకునే వరకూ తెలియనంత అందంతో మెరిసిపోతున్న అమ్మలకు ఇప్పుడు కొదవే లేదు. దీనికి కారణం.. ఇటీవలికాలంలో బాగా అందుబాటులోకి వచ్చిన యాంటీ ఏజింగ్ చికిత్సలే.

పిల్లలు పుట్టాక..

ఆడవారిలో ఎక్కువ మంది ప్రెగ్నెన్సీ తరువాత బాడీ షేపింగ్ చికిత్సలు చేయించుకుంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు. పిల్లలు పుట్టాక.. రొమ్ములు జారడం, ఆకృతి మారడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నవారు, వాటిని సరిచేసుకోవడానికి చికిత్స చేయించుకుంటున్నారు. బ్రెస్ట్ ఫ్యాట్ ట్రాన్స్‌ఫర్, బ్రెస్ట్ లిఫ్ట్, బ్రెస్ట్ రిడక్షన్ లాంటివి వీటిలో ఉంటాయి. ప్రసవం అయిన తరువాత కూడా పొట్టభాగం పెద్దగా కనబడే వారు.. అబ్డామినో ప్లాస్టీ, టమ్మీ టక్ ట్రీట్‌మెంట్ చికిత్సలు చేయించుకుంటున్నారు. స్ట్రెచ్ మార్క్స్ (గర్భం దాల్చిన తరువాత పొట్ట దగ్గర వచ్చే చారలు) తొలగించుకోవడానికి కూడా చాలా మంది వైద్యులను సంప్రదిస్తున్నారు. వీటికి అయ్యే ఖర్చు దాదాపు రూ.50-60 వేల వరకూ ఉండవచ్చు.

దాచాలంటే దాగునులే

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు చాలానే అందుబాటులోకి వచ్చాయి. ఎప్పటికీ యవ్వనంగా కనిపించాలనుకునేవారి సంఖ్య కూడా ఎక్కువైంది. ఒకప్పుడు సినీ తారలకు మాత్రమే పరిమితమైన యాంటీ ఏజింగ్ చికిత్సలు ఇప్పుడు సామాన్యులకూ చేరువయ్యాయి. డబ్బు ఎక్కువగా ఉన్నవారు.. కాస్తంత ఖరీదైనా సరే వినూత్నమైన పరిష్కారాల వైపు చూస్తున్నారు. యాంటీ ఏజింగ్ చికిత్సల కోసం కొందరు సరాసరిన నెలకు 10-15 వేల రూపాయలను ఖర్చు చేస్తోంటే, కొంతమంది 50-90 వేల రూపాయలను కూడా ఖర్చు చేస్తున్నారు. దీంతో యాంటీ ఏజింగ్ చికిత్సల వ్యాపారం బాగా జోరందుకుంది. సాధారణంగా వయసు పెరిగే కొద్దీ చర్మం సాగడంతోపాటు తేమ కోల్పోతుంది. ఫలితంగా ముడతలు, గీతలు, బుగ్గలు లోపలకు చొచ్చుకుపోవడం.. వంటి మార్పులు సంభవిస్తాయి. జుట్టు తెల్లబడడం, ఊడిపోవడం సరేసరి. జన్యుపరమైన కారణాలు, జీవనశైలి మార్పులు, రోజువారీ జీవితంలో మనం వాడే వస్తువుల్లో ఉండే రసాయనాల వల్ల వయసు మీరే ప్రక్రియ కొందరిలో మరికొంత వేగంగా జరుగుతుంది. అలాంటివారంతా యాంటీ ఏజింగ్ చికిత్సలపై ఆసక్తి చూపుతున్నారని అంబ్రోసియా క్లినిక్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ ప్రీతి శుక్లా తెలిపారు. క్లినిక్‌లకు వెళ్లి చేయించుకునే పెద్ద పెద్ద చికిత్సల సంగతి పక్కన పెడితే ప్రస్తుతం అందరూ ఎక్కువగా వాడుతున్నవి.. యాంటీ ఏజింగ్ క్రీములు. సూర్యుడి అతినీలలోహిత (యూవీ) కిరణాల బారిన పడకుండా చర్మాన్ని కాపాడే ఈ క్రీముల వల్ల.. ముడతలు పడటం, నుదుటిపై గీతలు రావడం వంటి సమస్యలను కొంతమేరకు నివారించవచ్చు. అయితే, ఇలాంటి క్రీమ్‌లతో ఫలితాలు పరిమితమేనని.. చాలా మంది కాస్మెటాలజిస్టులు, డెర్మటాలజిస్టులు, ప్లాస్టిక్ సర్జన్లు చెబుతున్నారు. ఎందుకంటే.. అందరికీ అనువుగా ఉండేలా వాటిని అతి తక్కువ గాఢతతో చేస్తారని, సాధారణ చర్మం కలిగినవారికి మాత్రం వాటితో కొంత ఫలితం ఉంటుంది తప్ప అందరికీ ఒకే స్థాయిలో ఉండదని వారు వివరిస్తున్నారు. ఇక.. ప్రస్తుతం భారతీయ యాంటీ ఏజింగ్ మార్కెట్‌లో ఎక్కువగా వినిపిస్తున్న మాట.. 'బయో రీ మోడలింగ్'. దీనిలో భాగంగా చర్మానికి తేమ అందించడంతో పాటు కొలాజెన్ ఉత్పత్తి అయ్యేలా చర్మాన్ని ప్రేరేపిస్తారు. చర్మంలో సాగే గుణాన్ని పెంపొందింపజేస్తారు. చికిత్సలేవైనా సరే, ఎంత చెప్పినా సరే ఒత్తిళ్లతో కూడిన ఉద్యోగాలు చేసేవారికి వాటితో మెరుగైన ఫలితాలు రావడం కష్టమేనని హెయిర్‌లైన్ స్టూడియో అధినేత, సెలబ్రిటీ స్టైలిస్ట్ వంశీ అభిప్రాయపడ్డారు. వేళకు పౌష్టికాహారం తీసుకుంటూ, కంటి నిండా నిద్రపోతూ, నిత్య వ్యాయామాలు చేసే వారికి ఈ చికిత్సలు బాగా ఉపకరిస్తాయని ఆయన పేర్కొన్నారు. "సహజంగా వచ్చేదే అందం, అది తెలుసుకుంటేనే ఆనందం" అంటారాయన.



బోలెడన్ని చికిత్సలు..

వయసు మీద పడుతున్నా యవ్వనంగా కనిపించేలా చేయడానికి అనేక రకాల చికిత్సలున్నాయి. ప్రాథమికంగా యాంటీ ఏజింగ్ క్రీములు మొదలు.. కణజాల స్థాయిలో చర్మం పై ప్రభావం చూపే ఫేషియల్ సీరమ్‌లు, మాయిశ్చరైజర్ల దాకా పలు ఉత్పత్తులు, ప్రక్రియలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి..

బొటాక్స్: ముఖంపై ముడతలను పోగొట్టడానికి ఇచ్చే ఒక న్యూరో టాక్సిన్ ప్రొటీన్ ఇది. దీనిని బ్యాక్టీరియం క్లోస్ట్రిడియం బొటులినమ్ అనే బ్యాక్టీరియా ఉత్పత్తి చేస్తుంది. దీనిని మన కండరాల్లోకి చొప్పిస్తే ఆ కండరాలు పనిచేయడం మానేస్తాయి. దీనివల్ల చర్మంపై గీతలు తగ్గుతాయి. ముడతలు పోతాయి. చర్మం మృదువుగా కనిపిస్తుంది. వయసు తక్కువగా అనిపిస్తుంది. అయితే.. ఈ ఇంజెక్షన్ సరిగ్గా చేయకపోయినా, అది సరైన కండరాల్లోకి వెళ్లకపోయినా ఫలితాలు చాలా ఇబ్బందిగా ఉంటాయి. సంవత్సరానికి 2-3 మూడు ఇంజెక్షన్లు చేయాల్సి ఉంటుంది. ఒక్కో సెషన్‌కూ 15-20 వేల రూపాయల వరకూ ఖర్చవుతుంది.

ఫిల్లర్లు: ఫిల్లర్స్‌లో హైల్యూరానిక్ యాసిడ్ ఉంటుంది. కళ్ల కింద గుంతలు, నవ్వినప్పుడు వచ్చే గీతలను పూరించడానికి వాడతారు. దీని ఖర్చు 20-40 వేల రూపాయల వరకూ ఉంటుంది. ఫిల్లర్ నాణ్యత, డాక్టర్ అర్హతలను బట్టి కూడా ఈ ఖర్చు మారుతుంటుంది.

కెమికల్ పీల్: ఈ పద్ధతిలో కెమికల్ సొల్యూషన్‌ను చర్మం లోపలకు జొప్పిస్తారు. తద్వారా చర్మం పై పొర తొలగిస్తారు. కొత్తగా వచ్చే చర్మం కాంతివంతంగా ఉంటుంది. ఈ యాంటీ ఏజింగ్ చికిత్స ఖర్చు ఒక్క సిటింగ్‌కు రూ.3 వేల నుంచి రూ.5 వేల దాకా ఉంటుంది.

ఫోటోఫేషియల్: ఇది కాంతి ఆధారిత చికిత్స. కొల్లాజెన్ ఉత్పత్తి మెరుగుపరచడానికి, వయసు ప్రభావం తగ్గించడానికి వినియోగిస్తారు. చర్మం మృదువుగా మారేందుకు, పునరుత్తేజం కావడానికి ఈ చికిత్స తోడ్పడుతుంది. దీనిలోనూ రెండు రకాలు ఉన్నాయి. ఒకటి ఎల్ఈడీ అయితే మరోటి ఇంటెన్స్ పల్స్‌డ్ లైట్ (ఐపీఎల్) థెరపీ. వీటికి ఒక్కో సెషన్‌కూ రూ.2 వేల నుంచి రూ.5 వేల దాకా వసూలు చేస్తున్నారు.

ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీ: చర్మంపై ముడతలు, గీతలు పోగొట్టటానికి వాడుతున్నారు. దీని ఖర్చు సెషన్‌కు రూ.5 వేల నుంచి 12 వేల రూపాయల దాకా ఉంటుంది.

లేజర్ చికిత్సలు: వీటిని బ్లాక్ ప్యాచెస్ వంటి వాటి నిర్మూలన కోసం వాడుతుంటారు. సెషన్ కు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకూ ఉండవచ్చు. పిగ్మెంట్ సంబంధిత చికిత్సలకైతే ఆరు సెషన్‌లు ఉంటాయి. ఈ లేజర్‌లో విభిన్న రకాలు ఉంటాయి. రకాన్ని బట్టి ఖర్చు కూడా మారుతుంటుంది. వీటిలో క్యు స్విచ్ లేజర్, ఫ్రాక్షనల్ లేజర్ వంటివి ఎక్కువగా వాడుతున్నారు.

స్కిన్ బూస్టింగ్ ఇంజెక్షన్స్: చర్మాన్ని యవ్వనంతో మెరిసిపోయేలా చేయడానికి ఈ చికిత్స చేస్తారు. వీటిలో పెప్టైడ్స్, ఎక్సోజోమ్స్, హైల్యూరానిక్ యాసిడ్స్ ఇలా చాలా ఉన్నాయి. ఈ ఇంజెక్షన్లన్నీ రూ.15-20 వేల ధరలో ఉంటాయి. చర్మ స్థితి, ఆరోగ్య పరిస్థితి, తదితర అంశాల ఆధారంగా ఎన్ని ఇంజెక్షన్లు ఇవ్వాలన్నదీ వైద్యులు నిర్ణయిస్తారు. వాహనాలకు సర్వీసింగ్ లాగా.. ఈ తరహా చికిత్సలను క్రమం తప్పకుండా చేయించుకోవాల్సి ఉంటుంది.

హెయిర్ గ్రోత్ ట్రీట్‌మెంట్: యాంటీ ఏజింగ్ చికిత్సల్లో జుట్టు కూడా ఒక భాగమే. ఇంకా చెప్పాలంటే.. జుట్టు ఒక ప్రధాన భాగం. అది బాగా పెరిగేందుకు చేసే ఈ చికిత్స ఒక్కో సెషన్‌కూ 15-20 వేల రూపాయల ఖర్చవుతుంది.

హైఫూ (హై ఇంటెన్సిటీ ఫోకస్డ్ అల్ట్రాసౌండ్): ఇది.. కొలాజెన్ ఉత్పత్తిని ప్రేరేపించడం ద్వారా ముఖచర్మాన్ని బిగుతుగా చేసే నాన్ సర్జికల్ ఫేస్ లిఫ్ట్ ట్రీట్‌మెంట్. దీన్ని మూడు నెలలకోమారు చేయించుకుంటే మెరుగైన ఫలితాలు వస్తాయి. ఖర్చు రూ.30-40 వేలు అవుతుంది.

థ్రెడ్ లిఫ్ట్: ఇది కూడా.. సాగే చర్మాన్ని బిగుతుగా చేసే ఒక తరహా నాన్ సర్జికల్ కాస్మెటిక్ చికిత్స. ఈ చికిత్సలో భాగంగా.. కరిగిపోయే గుణం కలిగిన మెడికల్ గ్రేడ్ దారాలను వాడతారు. ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన ఈ చికిత్సకు.. రూ.70 వేల నుంచి రూ.లక్ష దాకా ఖర్చవుతుంది. రెండు సంవత్సరాలకు ఒకసారి ఈ చికిత్స చేయాల్సి ఉంటుంది. మధుమేహం తదితర సమస్యలు ఉన్న వారికి అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

బ్లెఫరో ప్లాస్టీ: కనురెప్పల లోపాలను సరిచేసి, అందంగా కనిపించేలా చేసే శస్త్రచికిత్స. రూ.40 వేల నుంచి రూ. లక్ష దాకా ఖర్చవుతుంది.

ఫేస్ లిఫ్ట్: ముఖచర్మాన్ని బిగుతుగా చేసే శస్త్రచికిత్స. ఈ పద్ధతిలో ముఖం, మెడ సరిచేయడానికి రూ.5-6 లక్షల దాకా ఖర్చవుతుంది.

నల్లగా ఉన్న వారు తెల్లగా మారడానికి..

స్కిన్ లైటెనింగ్‌కి.. అంటే నల్లగా ఉన్న వారు తెల్లగా కావడానికి గ్లూటాథియోన్ అనే చికిత్స అందుబాటులోకి వచ్చింది. నిజానికి గ్లూటాథియోన్ అనేది శరీరంలో సహజంగా ఉత్పత్తి అయ్యే యాంటాక్సిడెంట్. శరీరంలో మెలనిన్ ఉత్పత్తిని తగ్గించడం ద్వారా చర్మాన్ని తెల్లబరచడానికి దీన్ని ఇప్పుడు ఇంజెక్షన్ల రూపంలో ఇస్తున్నారు. అయితే, ఇది ఎలా పడితే అలా చేసే చికిత్స కాదు. వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, అవసరాలను బట్టి ఎంత మోతాదులో దానిని అందించాలన్నది డాక్టర్ నిర్ణయిస్తారు. ఇష్టం వచ్చినట్లు చేస్తే అది ప్రమాదానికి కారణమవుతుంది. ఈ చికిత్స 10-15 సిట్టింగ్స్ తీసుకుంటే ఫలితాలు ఉంటాయి. ఒక్కో సిటింగ్‌కూ రూ.10 వేల దాకా ఖర్చవుతుంది.

ముందుగా ప్రారంభిస్తే ఫలితాలు మెరుగ్గా..

చర్మం ముడతలు పడటం, చర్మం వదులుగా మారడం, నుదుటిపై గీతల వంటి సమస్యలకు.. బొటాక్స్, ఫిల్లర్లు, థ్రెడ్ లిఫ్ట్, సర్జరీ వంటి చికిత్సలు చేస్తాం. ఇప్పుడు రీజనరేటివ్ మెడిసిన్ కూడా అందుబాటులోకి వచ్చింది. ఏ చికిత్స అయినా 30-40లలో ప్రారంభిస్తేనే కోరుకున్న ఫలితాలు వస్తాయి. అర్హులైన, నైపుణ్యం కలిగిన ప్లాస్టిక్‌సర్జన్లు, డెర్మటాలజిస్టులను సంప్రదించి, నాణ్యమైన ఉత్పత్తులు వాడితే ఎలాంటి సమస్యలూ రావు. కానీ.. అర్హతలు లేనివారు ఇటీవలికాలంలో ఈ చికిత్సలను అందిస్తుండటం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాబట్టి ఆ విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

- డాక్టర్ ప్రీతి శుక్లా
ప్లాస్టిక్ సర్జన్, ఫౌండర్, అంబ్రోసియా క్లినిక్

అర్హులా? కాదా? చూసుకోవాలి

యాంటీ ఏజింగ్ చికిత్సలు మూడు రకాలు. అవి.. పీల్స్, ఇంజెక్టబుల్స్, ఎనర్జీ బేస్డ్ డివైజెస్. మృతకణాలు, పిగ్మంటేషన్ వంటివాటిని తొలగించడానికి పీల్స్ వాడతాం. రెండో రకం... బొటాక్స్, ఫిల్లర్ల వంటి ఇంజెక్టబుల్స్. ఎనర్జీ బేస్డ్ డివైజస్ అంటే.. లేజర్లు, రేడియో ఫ్రీక్వెన్సీ డివైజ్‌లు, హైఫూ వంటివి. చర్మంలో కొలాజెన్‌ను పెంచడానికి, సాగే గుణం మెరుగుపరచడానికి వీటిని వాడతాం. ఈ చికిత్సలన్నీ అర్హత కలిగిన వ్యక్తుల చేత మాత్రమే చేయించుకోవాలి. లేదంటే అంతర్గత కండరాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.

- డాక్టర్ సింధూర కంభంపాటి
సీనియర్ కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్, స్టార్ హాస్పిటల్



మగవారికీ కొన్ని..

మగవారు ఎక్కువగా.. ముక్కు సరిచేసుకునే శస్త్ర చికిత్సతో పాటు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఎక్కువగా చేయించుకుంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు. అలాగే లైపోసక్షన్ (అధికంగా ఉన్న కొవ్వు తీసివేయడం), గైనకోమాస్టియా (మగవారిలో పెరిగిన రొమ్ము పరిమాణాన్ని తగ్గించే శస్త్ర చికిత్స) కూడా ఎక్కువగా చేయించుకుంటున్నారు.

డ్రగ్స్ డోర్ డెలివరీ



- కొరియర్ పార్సిళ్లలో సరఫరా
- ఇంటికే.. గంజాయి, సింథటిక్ డ్రగ్స్
- టీజీ-న్యాబ్ విచారణలో బహిర్గతం
- త్వరలో కొరియర్ సర్వీసులతో సమావేశానికి టీజీ-న్యాబ్ కసరత్తు

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల బానిసలు ఆర్డరిస్తే.. కొరియర్‌లో ఇంటికే డ్రగ్స్‌ను సరఫరా చేసేలా కొన్ని గ్యాంగులు వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నట్లు తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ-న్యాబ్) గుర్తించింది. గంజాయి మొదలు.. సింథటిక్ డ్రగ్స్ వరకు ఆర్డరిస్తే.. ఇంటికే పంపిస్తామని డ్రగ్స్ పెడ్లర్లు తమ వినియోగదారులకు ఆఫర్లిస్తున్నట్లు నిర్ధారించింది. ఇటీవల అమెరికా సహా.. ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్‌లో డ్రగ్స్ దందా చేసే అంతర్జాతీయ ముఠా గుట్టును టీజీ-న్యాబ్ రట్టు చేసిన విషయం తెలిసిందే.! తదుపరి దర్యాప్తులో ఈ కేసులో సౌరభ్ సుభాష్ అనే ఏజెంట్ కొరియర్ ద్వారా పది సార్లు విదేశాల నుంచి డ్రగ్స్‌ను తెప్పించినట్లు అధికారులు గుర్తించారు. అంతర్జాతీయ కొరియర్ సర్వీసులు మొదలు.. దేశీయంగా ఆ సేవలందించే సంస్థలు తాము ఏ సరుకును డెలివరీ చేస్తున్నామనే దాన్ని.. ముఖ్యంగా డ్రగ్స్‌ను గుర్తించే వ్యవస్థను అభివృద్ధి చేసుకోలేదు. దీన్ని డ్రగ్స్ ముఠాలు వరంగా మార్చుకుంటున్నాయి. ఇలా సౌరభ్ పుణెలోని బోపడి ప్రాంతంలోఉన్న డీహెచ్ఎల్ కొరియర్ సర్వీసు ద్వారా 2023లో ఏడు సార్లు.. పుణెలోని హింజ్వాడీ చిరునామాకు ఫెడెక్స్ కొరియర్ సర్వీసు ద్వారా మూడు సార్లు పార్సిళ్లలో డ్రగ్స్ అందాయి. ఇలా తెప్పించిన డ్రగ్స్‌ను ఈ ముఠా హైదరాబాద్‌కు తరలించేదని నిర్ధారించారు.

పార్సిల్ చిరిగి వెలుగులోకి..

ఈ ఒక్క కేసే కాకుండా.. గత ఏడాది డిసెంబరులో విశాఖపట్నం నుంచి ఢిల్లీకి డీటీడీసీ కొరియర్ ద్వారా మాదకద్రవ్యాలను పంపుతున్న ఓ ముఠాను ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. విశాఖ ఏజెన్సీల్లో గంజాయి కొనుగోలు చేసే ఈ ముఠా.. శ్రీహరిపురంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని, అక్కడి నుంచి చేతి తొడుగుల వ్యాపారం ముసుగులో గంజాయిని ఢిల్లీకి పంపించేది. ఓ సారి ఢిల్లీకి పంపిన ఒక పార్సిల్‌కు సంబంధించి చిరునామా సరిగా లేకపోవడంతో తిరుగుటపాలో వచ్చింది. ఆ సమయంలో పార్సిల్ చిరిగిపోవడంతో అందులోని గంజాయి బయటపడింది. దీంతో.. ఈ ముఠా గుట్టురట్టయింది. గత ఏడాది కేరళలోని కోచి కేంద్రంగా విదేశాల నుంచి కొరియర్ ద్వారా డ్రగ్స్ తెప్పించుకుంటున్న ముఠాను అక్కడి పోలీసులు అరెస్టుచేశారు. దాదాపు పది కొరియర్ కంపెనీల ద్వారా ఈ పార్సిళ్లు రావడంతో.. అక్కడి పోలీసులు కొరియర్ కంపెనీల ఏజంట్లతో సమావేశం నిర్వహించి, అనుమానాస్పద పార్సిళ్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. మహారాష్ట్రలో ఏటా రూ.వందల కోట్ల డ్రగ్స్ పట్టుబడుతుంటే.. అందులో కొరియర్ సర్వీసుల ద్వారా విదేశాల నుంచి వస్తున్నవి ఎక్కువగా ఉన్నాయని ఆ రాష్ట్ర హోంమంత్రి గత ఏడాది విధానసభలో ప్రస్తావించారు.

యాక్షన్‌లోకి టీజీ-న్యాబ్

డ్రగ్స్ డోర్ డెలివరీ ఉదంతం నేపథ్యంలో టీజీ-న్యాబ్ అప్రమత్తమైంది. కొరియర్ కంపెనీలతో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసి, అనుమానాస్పద పార్సిళ్లను గుర్తించేలా వారికి ఆదేశాలు జారీ చేయనున్నట్లు టీజీ-న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. 2016లోనూ డార్క్ వెబ్‌లో ఆర్డరిస్తే.. కొరియర్‌లో విదేశాల నుంచి సికింద్రాబాద్‌కు డ్రగ్స్ డెలివరీ అయిన ఉదంతాలున్నాయి. అప్పట్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న అకున్ సభర్వాల్ కొరియర్ సంస్థలతో సమావేశం ఏర్పాటు చేసి, అప్రమత్తంగా లేకుంటే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'హరితహోటళ్లు'.. బార్ అండ్ రెస్టారెంట్స్

నష్టాల నుంచి బయటపడటం, ఆదాయం సమకూర్చుకోవడమే లక్ష్యం

- కొత్త పర్యాటక పాలసీలో భాగంగా సర్కారుకు టూరిజం శాఖ ప్రతిపాదన
- ఇప్పటికే పలు పర్యాటక శాఖ హోటళ్లలో బార్ అండ్ రెస్టారెంట్ సేవలు
- ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహణ.. వాటిపై అధికారుల అధ్యయనం
- అవి లాభదాయకంగా ఉండటంతో మిగతా వాటినీ మార్చాలని నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాల్లో విడిది, భోజన సదుపాయాల కోసం పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన 'హరిత' హోటళ్లు.. ఇకపై బార్ అండ్ రెస్టారెంట్లుగా మారిపోనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదిత నూతన టూరిజం పాలసీలో భాగంగా అన్ని వర్గాలకు అందుబాటులో ఉంచడం, నష్టాల్లో ఉన్న హోటళ్లను లాభదాయకంగా మార్చడం కోసం పర్యాటక శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. దీనితో ప్రభుత్వ ఖజానాకు మరింత ఆదాయం సమకూర్చుకునే అవకాశం కూడా ఉంటుందని అధికారులు ప్రభుత్వానికి నివేదించినట్టు సమాచారం. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ఉన్నవి మినహా మిగతా ప్రాంతాల్లోని దాదాపు అన్ని హరిత హోటళ్లు త్వరలోనే మద్యం, మాంసాహార సరఫరాకు కేంద్రాలుగా మారిపోనున్నాయి.



నష్టం తప్పడమే కాదు.. అదనపు ఆదాయం!

కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్మించిన హరిత హోటళ్లకు ఆశించిన స్థాయిలో డిమాండ్ ఉండటం లేదు. వారాంతాలు, పండుగలు, ఇతర సెలవు రోజులు, ప్రత్యేక సందర్భాల్లో మినహా సాధారణ రోజుల్లో హరితహోటళ్లు వెలవెలబోతున్నాయి. దీనితో వాటి నిర్వహణ పర్యాటకసంస్థకు భారంగా మారింది. ఈ క్రమంలోనే ప్రైవేటు సంస్థలకు లీజు రూపంలో, ఇతర మార్గాల ద్వారా అప్పగిస్తే... ఇటు నిర్వహణ నష్టాల నుంచి బయటపడటంతోపాటు అదనంగా ఆదాయం సమకూరుతుందని పర్యాటకశాఖ అధికారులు ఆలోచనకు వచ్చారు. అదే సమయంలో ఆబ్కారీ శాఖకు లైసెన్స్ ఫీజులతోపాటు మద్యం అమ్మకాలతో ప్రభుత్వానికి మరింత ఆదాయాన్ని సమకూరుతుందని భావిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్టు సమాచారం.

ఇప్పటికే ప్రైవేటు ఇచ్చినవాటిపై అధ్యయనం

పర్యాటక శాఖ ఇప్పటికే గోల్కొండ సమీపంలోని తారామతి బరాదరి, బేగంపేట టూరిజం ప్లాజాలో బార్ అండ్ రెస్టారెంట్ సేవలను ప్రారంభించింది. ఈగలపెంట, సోమశిల, మన్ననూరు, మేడారం, తాడ్వాయి, బొగత తదితర ప్రాంతాల్లోని హరిత హోటళ్లను బార్ అండ్ రెస్టారెంట్ సేవల కోసం ప్రైవేట్ సంస్థలకు అప్పగించింది. అవి నష్టాల ఊబి నుంచి బయటపడటమే కాకుండా సంస్థకు అదనపు ఆదాయం సమకూర్చుతున్నాయి. ఈ క్రమంలో ఇతర ప్రాంతాల్లోని హరిత హోటళ్లను బార్ అండ్ రెస్టారెంట్స్‌గా మార్చడంపై పర్యాటక సంస్థ అధికారులు అధ్యయనం చేశారు. ఈ క్రమంలో నాగార్జున సాగర్‌లోని హరిత రెస్టారెంట్, నిజామాబాద్‌లోని హరిత ఇందూర్ ఇన్, లక్నవరం, రామప్ప, వికారాబాద్ అనంతగిరి, జగిత్యాల జిల్లా కొండగట్టు, మంచిర్యాల జిల్లా జన్నారం, నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీరంగపురం, మహబూబ్‌నగర్ కోయిల్‌కొండ, అలంపూర్‌లలో ఉన్న హరిత రెస్టారెంట్లు; ప్రజ్ఞాపూర్‌లోని హరిత హోటల్; సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, ఖమ్మం జిల్లా వైరా, వనపర్తి జిల్లా బీచుపల్లిలలోని వేసైడ్ ఎమినిటీస్ తదితర చోట్ల బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణకు అనుమతించేందుకు పర్యాటక సంస్థ అధికారులు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. వీటితోపాటు తక్కువ ఆదాయమున్న సంగారెడ్డి జిల్లా నందికంది, ఝరాసంగం కాలేజీ, ములుగు జిల్లా ఘనపూర్, జెటప్రోలులోని హరిత హోటళ్లను కూడా బార్లుగా అనుమతించే యోచనలో ఉన్నట్టుఉ సమాచారం.

ఆ దంపతుల బిడ్డడు నా బిడ్డే!!

యూఏఈలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హిందూ దంపతులతో పాక్ యువకుడి పేచీ

- తనను ఆమె పెళ్లాడిందని, బాబును ఇస్లాం పద్ధతిలో పెంచుకుంటానని న్యాయస్థానంలో వాదన
- చిన్నారి తండ్రి ఆ పాకిస్థానీయేనని తేల్చిన డీఎన్ఏ టెస్టు
- అతడికే బిడ్డను అప్పగించాలని న్యాయస్థానం తీర్పు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్‌లో స్థిరపడ్డ ఏపీకి చెందిన ఓ హిందూ దంపతులకు ఇద్దరు కూతుళ్ల తర్వాత ఓ బాబు కలిగాడు. అతడి వయసు ప్రస్తుతం ఐదేళ్లు. ఉన్నట్టుండి ఓ పాకిస్థాన్ యువకుడొచ్చి ఆ బాబు తన బిడ్డేనని.. తనకే దక్కాలని ఆ దంపతులతో వాదించాడు. తన రక్తం పంచుకు పుట్టిన బిడ్డను ముస్లిం సంప్రదాయ పద్ధతిలో పెంచుకుంటానని.. తనకు అప్పగించాలని గొడవకు దిగాడు. డీఎన్ఏ టెస్టులోనూ ఆ బిడ్డకు తండ్రి ఆ పాకిస్థానీయేనని తేలడం విశేషం. అయి తే ఆ కన్నతల్లి మాత్రం బిడ్డను ఇచ్చేందుకు ససేమిరా అంటోంది. తాను హిందువునని.. తన పేగు తెంచుకొని పుట్టిన బిడ్డ.. జన్మతః హిందువే అవుతాడని.. అందుకే బాబు తనకే దక్కాలని ఆ తల్లి వాదిస్తోంది. ఆమెకు భర్త కూడా మద్దతునిచ్చాడు. బిడ్డ తమ ప్రాణం అని.. ఇచ్చేది లేదంటూ ఆమెకు దన్నుగా నిలిచాడు. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దంపతులు, వారి ఇద్దరు పిల్లలు యూఏఈలో చాలాకాలంగా ఉంటున్నారు. షార్జాలో ఈ దంపతులకు పాకిస్థాన్‌కు చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలోనే ఆ మహిళకు మూడో సంతానంగా బాబు పుట్టాడు. అయితే ఐదేళ్ల తర్వాత గత డిసెంబరులో ఆ బాబుకు తానే తండ్రినంటూ సదరు పాకిస్థాన్ యువకుడు వాదించాడు. అతడి ఈ వాదనపై ఆ దంపతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ పాకిస్థానీ విజ్ఞప్తి మేరకు యూఏఈ అధికారులు డీఎన్ఏ పరీక్ష నిర్వహించారు. అందులో బాబుకు తండ్రి.. పాకిస్థానీయే తేలింది. అయితే.. ఆ మహిళతో తాను బిడ్డను కనడమే కాదు, ఆమెను తాను పెళ్లి కూడా చేసుకున్నానంటూ న్యాయస్థానం దృష్టికి తెచ్చాడు. ఇన్నాళ్లు.. తన కొడుకును ఆమె హిందూ సంప్రదాయం ప్రకారం పెంచిందని, బిడ్డకు తండ్రిని తానే కాబట్టి తనకు అప్పగిస్తే ముస్లిం సంప్రదాయ పద్ధతిలో పెంచుకుంటానని కోర్టుకు తెలిపాడు వాదనలన్నీ విన్న న్యాయస్థానం చిన్నారిని పాకిస్థాన్ జాతీయుడికే అప్పగించాలని తీర్పిచ్చింది. దీనిపై ఆ తెలుగు కుటుంబం ఉన్నత న్యాయస్థానానికి అప్పీలుకు వెళ్లింది.. చిన్నారితో సహా తల్లిదండ్రులు దేశం విడిచి వెళ్లకుండా అధికారులు ఆంక్షలు విధించారు. అయితే ఈ మొత్తం న్యాయ ప్రక్రియలో తమ వాదనను తెలుగు కుటుంబం సరిగ్గా వినిపించలేకపోయింది. ఇంటిపెద్ద ఉన్న ఉద్యోగం కోల్పోవడం.. ఫలితంగా ఆర్థిక సమస్యల కారణంగా న్యాయవాదులను పెట్టుకోలేకపోవడం.. చెప్పుకొంటే పరువు రోడ్డున పడుతుందనే భావనతో తమ సమస్యను ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితిలో కుమిలిపోతుండటం.. స్థానిక చట్టాలపై అవగాహన లేకపోవడంతో సరైన వాదనలను వినిపించలేకపోయారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అప్పటికే పెళ్లయి ఇద్దరు పిల్లలకు తల్లిగా భర్తతో కలిసి ఉంటున్న మహిలను ఆ పాకిస్థానీ ఏ చట్టం ప్రకారం పెళ్లి చేసుకున్నాడు? జీవిత భాగస్వామి ఉండగా మరోవ్యక్తిని పెళ్లి చేసుకునేందుకు గల్ఫ్ చట్టాలూ అనుమతించవు కదా? ఒకవేళ పాకిస్థానీయుడిని పెళ్లాడాలంటే భర్తకు తొలుత ఆమెకు విడాకులివ్వాలి.. అందునా గల్ఫ్ దేశాల్లో ఓ ముస్లింను పెళ్లి చేసుకునే వారు ముస్లిమేతరులైతే ఇస్లాంను స్వీకరించాలి కదా? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఈ కేసు చాలా సంక్లిష్టతతో కూడుకొని ఉన్నదని.. ఒకవేళ దంపతులు పెట్టుకున్న అప్పీలు వీగిపోయినా కూడా పాకిస్థాన్ యువకుడికి చిక్కులే ఉంటాయని అంటున్నారు. ఎందుకంటే.. ఆ చిన్నారిని పాకిస్థాన్‌కు తీసుకెళ్లాలంటే ఆ దేశం పాస్‌పోర్టు అవసరం అని.. భారతీయ పౌరసత్వం, పాస్‌పోర్టు ఉన్న చిన్నారిని తీసుకెళ్లడం ఎలా సాధ్యం? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.